RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 17.02.2025 | సంపుటి : 11 సంచిక : 217 | పేజీలు : 12 వెల: రూ. 4/-




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



అమెరికా మద్దతు లేకుండా

## మేం జీవించలేం

ఉక్రెయిన్ మనుగడ చాలా కష్టం :జెలెన్స్కీ

**కీవ్(జనంసాక్షి):**అమెరికా మద్దతు లేకుండా రష్యా దాడుల నుంచి ఉక్రెయిన్ మనుగడ సాధించడం కష్టమేనని అధ్యక్షుడు జెలెన్స్కీ పేర్కొన్నారు. అమెరికా-రష్యా అధ్యక్షులమధ్య ఇటీవల చోటుచేసుకున్న ఫోన్ సంభాషణ నేపథ్యంలో ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జెలెన్స్కీ ఈ

మిగతా 2లో..




## మాలిలో పెను విషాదం

బంగారు గని కుప్ప కూలి 42మంది మృత్యువాత

**బమాకో(జనంసాక్షి):**పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తూర్పు మాలిలో ఓ బంగారు గని కుప్ప కూలి 42మంది కార్మికులు మృత్యువాత పడగా.. అనేకమంది

మిగతా 2లో..

# బ్యూరోక్రాట్లు ఏసీ గదులు వీడండి



## చెమటోడ్చండి.. క్షేత్రస్థాయిలో పర్యటించండి

## వారి ఆలోచనా విధానంలో మార్పురావాలి

**హైదరాబాద్(జనంసాక్షి):** అధికారులు ఎంత నిబద్ధత చూపితే పథకాలు అంత విజయవంతమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి- మెమైర్ ఆఫ్ ఏ సివిల్ సర్వెంట్' పుస్తకావి ష్కరణ కార్యక్రమం ఆదివారం హైదరాబాద్ లోని బేగంపేటలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో ఎంత తిరిగితే అంత మంచిదన్నారు. కానీ, ఇప్పుటి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లేందుకు సుముఖంగా లేరని, ఏసీ గదుల వీడేందు కు ఇష్టపడట్లేదని వ్యాఖ్యానించారు. "నిబద్ధత కలిగిన అధికారులను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నాం. పాలకు లు ఎన్ని పాలసీలు చేసినా.. అమలు చేసేది అధికారులే. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన వారిని ప్రజలూ గుర్తుంచుకుంటారు. మనకున్న జ్ఞానం, అధికారం పేదలకు ఉపయోగపడాలి" అని సీఎం అన్నారు. " గోపాలకృష్ణ అనుభవాలను

మిగతా 2లో..



- అధికారులు ఎంత నిబద్ధత చూపితే పథకాలు అంత విజయవంతమవుతాయి
- పాలకులు ఎన్ని పాలసీలు చేసినా.. అమలు చేసేది అధికారులే
- మనకున్న జ్ఞానం, అధికారం పేదలకు ఉపయోగపడాలి
- నిబద్ధత కలిగిన అధికారులను గుర్తించి ప్రాధాన్యత ఇస్తున్నాం
- విశ్రాంత ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన 'లైఫ్ ఆఫ్ ఏ కర్మ యోగి- మెమైర్ ఆఫ్ ఏ సివిల్ సర్వెంట్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

## అనౌన్స్‌మెంట్ తికమకతోనే

# తొక్కిసలాట

రైలు వచ్చే ప్లాట్‌ఫాం తెలియక గందరగోళానికి గురైన ప్రయాణికులు

అందరూ 16 నెంబర్ ప్లాట్‌ఫాంపైకి వెళ్లేందుకు ఎగబడటంతో దారుణఘటన

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ప్రకటించిన రైల్వేశాఖ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాటకు కుంభమేళాకు వెళ్లే రైళ్ల పేర్లలో గందరగోళమే కారణం కావచ్చని పోలీసులు చెబుతున్నారు. ప్రయాగ్ రాజ్‌కు వెళ్లే రెండు రైళ్లకు దాదాపు ఒకేలాంటి పేరుండటంతో ప్రయాణికులు తికమకపడ్డారని పేర్కొన్నారు. నిన్న రాత్రి తొలుత ప్రయాగ్‌రాజ్ స్పెషల్ రైలు ప్లాట్‌ఫామ్ నెంబర్ 16పైకి వస్తుందని అనౌన్స్‌మెంట్ చేశారు. మరోవైపు 14 నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ అప్పటికే ఉంది. దానినే తాము ఎక్కాల్సిన రైలుగా భ్రమించి కొందరు అక్కడకు చేరారు. కానీ, అనౌన్స్‌మెంట్ వినగానే.. తాము ఎక్కాల్సిన రైలు 16వ నెంబర్ ప్లాట్‌ఫామ్ వద్దకు వస్తోందని.. తాము దానిని అందుకోలేమని కంగారు పడ్డారు. దీంతో ఒక్కసారిగా వందల మంది ప్లాట్‌ఫామ్ నెంబర్ 16 వైపు పరుగులు పెట్టారు. అప్పటికే 12,13, 14 ప్లాట్‌ఫారంలు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. దీనికి తోడు 16వైపు వెళ్లేవారి హడావుడితో తొక్కిసలాట జరిగింది. ప్రయాగ్‌రాజ్ వెళ్లేందుకు ఆ సమయంలో 4 రైళ్లు ఉన్నాయి.

మిగతా 2లో..

### రైల్వేశాఖ నిర్లక్ష్యంతోనే..

విపక్షాల విమర్శలు

కేంద్ర రైల్వేమంత్రి వెంటనే రాజీనామా చేయాలంటూ డిమాండ్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడంపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు.రైల్వేశాఖ

మిగతా 2లో..



బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ

## ఏర్పాటు వృథా

గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఏడాదిలోనే ప్రభుత్వంపై తీవ్ర వత్యిరేకత: కిషన్ రెడ్డి



**వరంగల్(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో నాసిరకం ఖనిజం లభిస్తుంది. అక్కడ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే నిధులు వృథా అవుతాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని బిజెపి చెప్పలేదని అన్నారు. రాష్ట్రంలో చేసిన కులగణన ఏ ఒక్క బీసీ సంఘం కూడా అంగీకరించడం లేదన్నారు. రాష్ట్రంలో సర్వే పూర్తి అయి, బీసీ సంఘాలు సమర్థిస్తే కేం ద్రాన్ని ఒప్పించి ఆమోదం చేపిస్తామని హామీనిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలు,

మిగతా 2లో..

# జౌళి ఉత్పత్తుల ఎగుమతులు పెరగాలి

2030 నాటికి రూ.9లక్షల కోట్లకు పెంచడమే లక్ష్యం

భారత్ టెక్స్ కార్యక్రమంలో ప్రధాని మోదీ వెల్లడి



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** జౌళి ఉత్పత్తుల ఎగుమతుల్ని పెంచడమే లక్ష్యంగా కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఈ రంగంలో వార్షిక ఎగుమతులను 2030 కన్నా ముందే రూ.9 లక్షల కోట్ల లక్ష్యాన్ని సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దిల్లీలో ఫిబ్రవరి 14 నుంచి 17వరకు జరుగుతున్న భారత్ టెక్స్ కార్యక్రమానికి ఆయన ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ రంగానికి బ్యాంకులు సహకారం అందించాలని, తద్వారా ఉపాధి పెంచేందుకు సహకరించాలని కోరారు. ప్రపంచంలోనే ఆరో అతిపెద్ద వస్త్ర ఎగుమతిదారుగా ఉన్న భారత్.. గతేడాది 7శాతం వృద్ధి నమోదు చేసిందన్నారు. ప్రస్తుతం రూ.3లక్షల కోట్లుగా వార్షిక ఎగుమతుల్ని 2030 నాటికి రూ.9లక్షల కోట్లకు పెంచడమే

మిగతా 2లో..



# బర్డ్‌ఫ్లూ భయం

## వైరస్ ఫియర్‌తో మాంసానికి నో ఇంట్రెస్ట్

## పడిపోయిన చికెన్.. పైకి లేచిన మటన్..!

*రోజు తప్పి రోజు చికెన్ లేనిదే 'చిల్' ఉండదని ఫీలయ్యే విశ్వేష్‌కు పెద్ద కష్టమే వచ్చింది. గత వారం రోజులుగా సరిగ్గా తిండి కూడా తినలేకపోతున్నానని నిట్టూరుస్తున్నాడు. కోడ్ని తిందామంటే భయం. మటన్ తిందా మంటే ధరల మంట..! రెంటికీ చెడ్డ రేవడిలా మారిం దని ఈ ఆదివారం నాడు తెగ బాధపడిపోయాడు విశ్వేష్..!*

*మటన్ తింటే మనిషి తిన్నట్టు అనిపిస్తుందని చెప్పే మోహన్‌కు కూడా ఈసారి నాలుకకు రుచిలేకుండా పోయింది. కేవలం చికెన్‌ను మాత్రమే తినే ఆయన వారం రోజులుగా ముక్కకు దూరమయ్యాడు. కేవలం ఇంట్లో వాళ్లకు తెచ్చిపెట్టి తానుమాత్రం పప్పన్నంతో లాగించేశాడు. గుడ్డు తిందామన్నా గుండెలు గుబేల్‌మనే పరిస్థితులు ఏర్పడటంతో చేసేదేం లేక ఉన్నది తిని చేతులు కడిగేసుకున్నాడు.*

- భోజన ప్రియులకు భారంగానే గడిచిన ఆదివారం
- గత వారం పదిరోజులుగా వ్యాపారాలపై తీవ్ర ప్రభావం
- చిన్న మధ్య తరగతి దుకాణా దారులకే భారీ నష్టం
- 24 లక్షల మంది జీవానాధారానికి దెబ్బ
- వేల సంఖ్యల్లో కోళ్ల మృత్యువాతతో కార్మికుల ఉపాధికీ గండం



రామర్తి రవితేజ
(జనంసాక్షి స్పెషల్ కరస్పాండెంట్)

బర్డ్ ఫ్లూ బెంబేలుతో భోజన ప్రియుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. మూడేళ్ల క్రితం ఏడాది న్నరపాటు వణికించిన కరోనా వైరస్‌తో క్షణక్షణం భీతిల్లిన ప్రజానీకం మళ్లీ అలాంటి పరిస్థితులను తలుచుకుని బెంబేలెత్తుతు న్నాయి. ఈసారి కోళ్ల రూపంలో అంతుచిక్కని వైరస్ వ్యాపిస్తోందని రాష్ట్ర సర్కారు సహా ప్రజలు ఎక్కడికక్కడ అప్రమత్తమవుతున్నారు. ఇటీవల వేల సంఖ్యల్లో కోళ్లు చనిపోవడం, సోషల్ మీడియాలోనూ పెద్దఎత్తున వీడియోలు, చిత్రాలు ప్రచారం కావడంతో మాంసప్రియులకు కంటిమీద కునుకు లేకుండాపోతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామంలోని ఓ కోళ్ల ఫారంలో

మిగతా 2లో..



## మేడ్చల్ మార్గంలో మెట్రో చకచకా

ఈ నెలాఖరుకల్లా ట్రాఫిక్ సర్వే, భూ సామర్థ్య పరీక్షలు పూర్తి: ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** మేడ్చల్, శామీర్‌పేట్ ప్రాంతాల్లో మెట్రో కారిడార్‌కు సర్వే పనులు కొనసాగుతున్నాయి. ఇందులో ప్రధానంగా భూసామర్థ్య పరీక్షలు చేపట్టారు.ప్రతి కిలోమీటరుకు రెండుచోట్ల 15 మీటర్ల వరకు బోర్‌వెల్ వేసి మట్టి నమూనాలను సేకరించి విశ్లేషిస్తున్నారు. ట్రాఫిక్ సర్వేలను ఏజెన్సీలు నిర్వహిస్తున్నాయి. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) రూపకల్పన కోసం ఇదంతా చేస్తున్నారు. ఈ నెలాఖరుకల్లా ట్రాఫిక్ సర్వే, భూ సామర్థ్య పరీక్షలు పూర్తవుతాయని

మిగతా 2లో..

తెలంగాణ ప్రయోజనాలకు

# ఏపీ గండికొడుతోంది

- కృష్ణా జలాలను ఏపీ తరలించుకుపోతుంటే కాంగ్రెస్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది
- ఏడాది కాలంలోనే పంటలను ఎండబెట్టిన కాంగ్రెస్
- నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ రాష్ట్రం ప్రభుత్వ చర్యల వల్ల మళ్లీ తిరోగమనబాటపట్టింది
- గురుకుల విద్యాసంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారు
- ఎక్స్ వేదికగా మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్(జనంసాక్షి):** ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా జలాలను తరలిస్తుంటే కాంగ్రెస్ చోద్యం చూస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. కృష్ణా జలాల నుంచి ఏపీ ఇప్పటికే 646 టీఎంసీలు వినియోగించిందని, నదీ జలాలను ఆంధ్రప్రదేశ్ తన్నుకుపోతుంటే రేవంత్ సర్కారు చలనం లేకుండా ఉందని ఎద్దేవా చేశారు.ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పంట పొలాలను ఎండబెట్టిందని 'ఎక్స్' వేదికగా విమర్శించారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం కోసం ఏర్పడ్డ రాష్ట్రంలో.. ఒక్కొక్కటిగా అన్నింటినీ కాంగ్రెస్ గంగలో కలుపుతోందన్నారు. కేఆర్‌ఎంబీ పరిధిలోని త్రీమెన్ కమిటీ దిక్కులేదు, సాగర్, శ్రీశైలంలో నీళ్ల అడుగంటి పొలాలు ఎండుతున్నా నిమ్మకు నీరెత్తినట్టు కాంగ్రెస్ వ్యవహరిస్తోందని

మిగతా 2లో..

### ఏపీ నీటిని తరలిస్తున్నా చోద్యం చూస్తున్న ప్రభుత్వం

హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలకు ఆంధ్రప్రదేశ్

మిగతా 2లో..

## కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు..

# మమ్మల్ని దొంగల్లా తరలించారు

- మా పట్ల దారుణంగా వ్యవహరించారు
- 'డిపోర్టేషన్' బాధితుల ఆవేదన
- 157 మందితో అమెరికా నుంచి రానున్న మూడో విమానం..



**అమృత్‌సర్(జనంసాక్షి):**అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించిన వారిని తిప్పి పంపేందుకు ట్రంప్ యంత్రాంగం భారీ ఆపరేషన్ చేపట్టింది. స్వదేశానికి పంపించే క్రమంలో అమెరికా అనుసరిస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే.దీంతో మానవీయంగా వ్యవహరించే అంశంపై అమెరికాతో సంప్రదింపులు చేస్తామని భారత్ కూడా ఇటీవల పేర్కొంది. ఈ నేపథ్యంలో అమృత్‌సర్‌లో దిగిన రెండో విమానంలోనూ అక్రమ వలసదారులను బంధించి తీసుకువచ్చినట్లు బాధితులు పేర్కొన్నారు.' డిపోర్టేషన్'లో భాగంగా 116 మంది భారతీయులతో కూడిన రెండో విమానం శనివారం రాత్రి అమృత్‌సర్‌కు చేరుకుంది. ఇందులో హోషియార్‌పూర్ జిల్లా కురలా కలాన్‌కు చెందిన దల్జిత్ సింగ్ అనే వ్యక్తి.. అమెరికా ప్రయాణం గురించి మీడియాతో మాట్లాడాడు. తిరిగి వచ్చే సమయంలో అమెరికా అధికారులు వ్యవహ రించిన తీరును వివరించాడు. "కాళ్లకు గొలుసులు, చేతులకు సంకెళ్లు వేశారు. ముగ్గురు మహిళలు, ముగ్గురు చిన్నారులను మాత్రం నిర్బంధించలేదు.

మిగతా 2లో..

### ఈ ఏడాదిలోనే భారత్‌లో తొలి చిప్ తయారుచేస్తాం

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈ ఏడాది సెప్టెంబర్-అక్టోబర్ నాటికి తొలి మేడిన్ ఇండియా చిప్ తీసుకురానున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఇది దేశ సాంకేతిక స్వావలంబనలో కీలక ముందడుగుకు గుర్తుగా నిలుస్తుందని పేర్కొన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో పెట్టుబడులు, మేడిన్ ఇండియా చిప్ గురించి ప్రస్తావించారు. సెమీకండక్టర్ల విషయంలో స్వావలంబన సాధించే దిశగా కేంద్రం చర్యల్ని వేగవంతం చేస్తోంది. ఇటీవల భారత దేశం ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలోకి రూ.13,162 కోట్ల పెట్టుబడులు

మిగతా 2లో..

## తెలంగాణ ప్రయోజనాలకు ఏపీ గండికొడుతోంది

ట్వీట్ చేశారు.నది జలాలను ఆంధ్రప్రదేశ్ తన్నుకు పోతున్నా బోర్డుకు చలనం లేదని.. రేవంత్ సర్కార్ నోరెత్తడం లేదని కేటీఆర్ విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల్లో బొట్టును బొట్టును కాపాడుతూ బీడు భూములను కేసీఆర్ సస్యశ్యామలం చేస్తే.. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పంటపొలాలను ఎండబెట్టిందని మండిపడ్డారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో న్యాయం కోసం ఏర్పడ్డ రాష్ట్రంలో ఒక్కొక్కటిగా అన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం గంగలో కలుపుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చేది వేసవి కాలమని.. తాగునీళ్లకు, సాగు నీళ్లకు కష్టం అని తెలిసి కూడా గాలిమోటర్‌లో ఢిల్లీ ట్రిప్పులు కొడ్తున్న ముఖ్యమంత్రికి అన్నదాతల గోస ఏం తెలుస్తుందని కేటీఆర్ ప్రశ్నించారు. కేఆర్ఎంబి పరిధిలోని త్రీ మెన్ కమిటీ దిక్కులేదని విమర్శించారు. సాగర్, శ్రీశైలంలో నీళ్లు అడుగంటి పొలాలు ఎండుతున్నా నీమ్మకు నీరెత్తినట్టున్నగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. జాగో రైతున్న జాగో.. జాగో తెలంగాణ జాగో అని పిలుపునిచ్చారు.హైదరాబాద్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి సర్కార్.. గురుకుల విద్యాసంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ భవిష్యత్ అయిన భావితరాలకు శాపంగా మారిందని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాలు.. ఏడాది కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయని కేటీఆర్ పేర్కొన్నారు. నాడు డాక్టర్లు, ఇంజనీర్ వంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు.. నేడు సరైన దిశానిర్దేశం లేక ధీన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ పడిన విద్యార్థులు.. నేడు గురుకులం పేరు చెబితే డీలా పడిపోతున్నారు. నాడు కడుపునిండా అన్నం తిని, అనుకున్న లక్ష్యాలను సాధిస్తే?నేడు అన్నమో రామచంద్ర అనే రోజులొచ్చాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నాడు 41 వేల సీట్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు లక్షా 68 వేల దరఖాస్తులు వస్తే.. నేడు 51 వేల సీట్లకు గాను 80 వేల దరఖాస్తులే వచ్చాయి. ఏడాది పాలనలో 50కి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా కాంగ్రెస్ సర్కారులో కనీస చలనం లేదు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా.. అంత్యక్రియలకు, పరామర్శకు వెళ్లే ప్రతిపక్షం మీద ఈ ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తున్నది అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాగో తెలంగాణ జాగో! అని కేటీఆర్ నినదించారు.

## ఏపీ నీటిని తరలిస్తున్నా చోద్యం చూస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వం గండి కొడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుండటం దుర్మార్గమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాలను ఏపీ అడ్డూ అదుపూ లేకుండా తరలించుకుపోతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మూడు నెలలుగా నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి రోజుకు 10వేల క్యూసెక్కులను ఏపీ తరలించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు.ఈ వాటర్ ఇయర్ లోనే 646 టీఎంసీలు తరలిస్తే ఎందుకు నోరు మెదపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాంగ్రెస్ కు పట్టవా అని నిలదీశారు. సాగర్ ఆనకట్ట కేంద్ర బలగాల ఆధీనంలో ఉందని.. వారి పర్యవేక్షణలో మాత్రమే నీటిని విడుదల చేసుకోవాల్సి ఉన్నప్పటికీ ఏపీ మాత్రం ఇష్టారాజ్యంగా నీటిని తరలిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ తాగునీటి అవసరాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో నిలువ ఉంచాల్సిన కోటాను ఏపీ తీసుకెళ్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టైనా లేదని మండిపడ్డారు.శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో మిగులు నిల్వలు లేకున్నా పోతిరెడ్డిపాడు, సాగర్ కుడి కాల్వ ద్వారా ఇప్పటికే ఏపీ నీటిని తరలిస్తూ మొండిగా వ్యవహరిస్తుందని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతి సంవత్సరం ఉమ్మడి ప్రాజెక్టులకు సంబంధించి నీటి వినియోగానికి కేఆర్ఎంబీ పరిధిలోని త్రిమెన్ కమిటీ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని అన్నారు. కానీ ఈ ఏడాది ఇంతవరకు త్రిమెన్ కమిటీ మీటింగ్ పెట్టలేదని.. అంటే బోర్డు వ్యవహారం ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. బోర్డు పై ఒత్తిడి చేయడంలో, నీటి తరలింపు చేయకుండా ఏపీని నిలువరించడంలో తద్వారా తెలంగాణ నీటి హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఏపీ దూకుడు, తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్య వల్ల ఇప్పటికే నాగార్జున సాగర్, శ్రీశైలం రిజర్వాయర్లు ఖాళీ అయిన పరిస్థితి నెలకొందని హరీశ్‌రావు అన్నారు.మరోవైపు వేసవి పూర్తిగా మొదలు కాలేదు తెలంగాణ రైతులు నీళ్ళ కోసం రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారని హరీశ్‌రావు అన్నారు. ఏపీ నీటి తరలింపును ఇప్పటికైనా అడ్డుకోకపోతే సాగర్ ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుందని తెలిపారు. సాగర్ లో నీటిమట్టం పడిపోతే హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య సైతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాలని, ఈమేరకు కృష్ణ బోర్డుపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వం యథేచ్ఛగా కృష్ణా జలాలను తరలిస్తుంటే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం చోద్యం చూస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల నుంచి ఏపీ ఇప్పటికే 646టీఎంసీలు వినియోగించుకుందని తెలిపారు. సాగర్ కుడి కాలువ ద్వారా గత మూడునెలలుగా రోజుకు 10 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో జలాలలను తరలిస్తుందని పేర్కొన్నారు. అయినప్పటికీ కాంగ్రెస్ సర్కార్ నిలువరించడం లేదని విమర్శించారు.

# బ్యూరోక్రాట్లు ఏసీ గదులు వీడండి





ఈ పుస్తకంలో నిక్షిప్తం చే యడం సంతోషం ఆరు దశాబ్దాల తన అనుభవాన్ని నిక్షిప్తం చేయడం పెద్ద టాస్క్ ఏదైనా కొనవచ్చు కానీ ఎక్స్పీరియన్స్ ను కొనలేం సివిల్ సర్వెంట్స్ అందరికీ ఈ పుస్తకం ఒక దిక్సూచిగా ఉంటుందని భావిస్తున్నా ఆనాటి నుంచి ఈనాటి వరకు దేశంలో వేగంగా జరిగిన మార్పు లకు ఆయన ప్రత్యక్ష సాక్షి ఈసందర్భంగా ముగ్గురు వ్యక్తులను మనం గుర్తు చేసుకోవాలి శంకరన్, శేషన్, మన్మోహన్ సింగ్ నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ పారదర్శక ఎన్నికల నిర్వహణకు ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి శేషన్ .దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్ సింగ్ వారి అనుభవాల నుంచి సివిల్ సర్వెంట్స్ ఎంతో నేర్చుకోవాల్సి ఉంది గతంలో అధికారులు రాజకీయ నాయకులు అంశాలను ప్రస్తావిస్తే అందులోని లోతుపాతులు, లాభ నష్టాల ను వివరించేవారు కానీ ఈ రోజుల్లో ఎందుకో అది తగ్గిపోయింది.రాజకీయ నిర్ణయాలపై నాయకులకు అధికారులు విశ్లేషణ చేసి చెప్పాలి గతంలో ఐఏఎస్ అధికారులు నిత్యం ప్రజల్లో ఉండేవారు రాజకీయ నాయకుల కంటే ప్రజలు అధికారులను ఎక్కువ గుర్తుంచుకునేవారు కానీ ఇప్పుడు కలెక్టర్లు ఏసీ రూముల్లోంచే బయటకు వెళ్లడం లేదు అధికారుల ఆలోచనలో, విధానంలో మార్పు రావాలి నిబద్ధత కలిగిన అధికారులకు తప్ప కుండా గుర్తింపు ఉంటుంది పేదలకు సాయం చేయాలన్న ఆలోచన అధికారులకు ఉండాలి అలాం టి వారే ప్రజల మనసులో ఎక్కువకాలం గుర్తుం టారు ఆ దిశగా రాష్ట్రంలో అధికారులు దృష్టి సా రించాలని కోరుతున్నా" అని అన్నారు.

## కాళ్లకు చైన్లు, చేతులకు సంకెళ్లు.. మమ్మల్ని దొంగల్లా తరలించారు

**- మా పట్ల దారుణంగా వ్యవహరించారు**

**- 'డిపోర్టేషన్' బాధితుడి ఆవేదన**

**- 157 మందితో అమెరికా నుంచి రానున్న మూడో విమానం..**

విమానం అమృత్‌సర్‌లో ల్యాండ్ అయ్యే ముందు సంకెళ్లను తొలగించారు" అని దిల్జిత్ సింగ్ పేర్కొన్నారు. గతేడాది 'డంకీ రూట్'లో అమెరికాకు ఓ ఏజెంట్ తీసుకెళ్లిన తీరును.. వలసదారులు పడుతున్న బాధలను దిల్జిత్ వివరించాడు. "లీగల్ పద్ధతిలోనే అమెరికాకు తీసుకెళ్తామని ఏజెంట్ చెప్పాడు. రూ.65లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అడ్వాన్సుగా ఒక ఎకరం భూమిని అతడికి రాసిచ్చాం. నేను అమెరికా వెళ్లే మార్గమధ్యలో ఉండగానే మరో నాలుగు ఎకరాలు భూమికి సంబంధించి సదరు ఏజెంట్ నా భార్య నుంచి 'పవర్ ఆఫ్ అటార్నీ' రాయించుకున్నాడు. నేరుగా విమానం ఉంటుందని చెప్పి అక్రమ మార్గంలో అమెరికాకు తీసుకెళ్లాడు. తొలుత బ్రెజిల్‌కు.. అక్కడ ఓ నెల గడిచిన తర్వాత డంకీ మార్గంలో అమెరికాకు పంపించారు. ప్రమాదకర కొండల్లో నడుచుకుంటూ, నదులు దాటుకుంటూ, కొంత దూరం టాక్సీలో ప్రయాణం సాగింది. పనామాను దాటేందుకు మూడు రోజులు పట్టింది. కొంతదూరం పడవ ప్రయాణం అనంతరం చివరకు మెక్సికో చేరుకున్నాం. అక్కడ సుమారు నెల గడిచిన తర్వాత జనవరి 27న అమెరికాలోకి ప్రవేశించాం. గస్తీలో ఉన్న అమెరికా సరిహద్దు దళం మమ్మల్ని నిర్బంధించింది." అని దిల్జిత్ పేర్కొన్నాడు. ఏజెంట్‌లను నమ్మి మోసపోవద్దని, అక్రమ మార్గంలో వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించాడు.

మండిపడ్డ సీఎం..

అక్రమ వలసదారులతో కూడిన అమెరికా సైనిక విమానాలు పంజాబ్‌లో దిగడంపై ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పవిత్రమైన నగరాన్ని 'డిపోర్టేషన్ కేంద్రంగా' మార్చవద్దన్న ఆయన.. దేశంలో అనేక ఎయిర్‌బేస్‌లు ఉన్నాయని, ఈ విమానాలను అక్కడ ల్యాండింగ్ చేసుకోవచ్చన్నారు. వలసదారులు రాక నేపథ్యంలో అమృత్‌సర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన.. సెకండ్ బ్యాచ్‌లో వచ్చిన పంజాబ్ సహా ఇతర రాష్ట్రాల ప్రజలను వారి స్వస్థలాలకు పంపించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు.

157 మందితో మూడో విమానం..

అమెరికా అక్రమ వలసదారులకు సంబంధించి ఫిబ్రవరి 5న తొలి విమానంలో 104 మంది భారత్‌కు చేరుకోగా.. 116 మందితో ఫిబ్రవరి 15న రెండో విమానం చేరుకుంది. మూడో విమానంలో 157 మంది అక్రమ వలసదారులు భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం.

## ఈ ఏడాదిలోనే భారత్‌లో తొలి చిప్ తయారుచేస్తాం

వచ్చాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇంకా పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం 234 విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు తాజా సెమికండక్టర్ డిజైన్ సాధనాలను అందిస్తున్నామని తెలిపారు. ఇండియా సెమికండక్టర్ మిషన్ 1.0 పూర్తి చేసేందుకు ఐటీ మంత్రిత్వ శాఖ కృషి చేస్తోందన్నారు. అయితే మొహాలీలోని సెమికండక్టర్ ల్యాబ్ ఆధునికీకరణ ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నా ఆయన.. ఇది పూర్తయ్యాక మోఓ 2.0 కోసం పనిచేయనున్నట్లు ఆయన తెలిపారు. తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమికండక్టర్ మానుఫాక్చరింగ్ కార్ప్‌తో కలిసి టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజరాత్‌లోని దొలేరాలో సెమికండక్టర్ ఫ్యాబ్‌ను నిర్మిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. వీటిలో ఉపయోగించే గాలియం నైట్రైడ్ పరిశోధన, అభివృద్ధి కోసం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కి ప్రభుత్వం రూ.334 కోట్లు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం త్వరలో విడిభాగాల కోసం ఉత్పత్తి- సంబంధిత ప్రోత్సాహక (ఖఎ) పథకం తీసుకొస్తుందని ఆయన అన్నారు. 2025 సెప్టెంబర్-అక్టోబర్ నాటికి తొలి మేడిన్ ఇండియా చిప్ విడుదల కానుందని తెలిపారు.

## మేడ్చల్ మార్గంలో మెట్రో చకచకా

హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారుజేబీఎస్-సికింద్రాబాద్ క్లబ్‌రోడ్, పికెట్ కేంద్రీయ విద్యాలయం రోడ్, మడ్‌ఫోర్డ్ రోడ్, టివోలి జంక్షన్ రోడ్, డైమండ్ పాయింట్ కూడలి, సెంటర్‌పాయింట్ జంక్షన్, హస్మత్‌పేట కూడలి, బోయిన్‌పల్లి రోడ్, తాడ్‌బండ్ ఎయిర్‌పోర్ట్ ఆఫీస్ జంక్షన్, బోయిన్‌పల్లి చెక్‌పోస్ట్ రోడ్ మీదుగా మేడ్చల్ అలైన్‌మెంట్ వెళ్తుంది. జేబీఎస్ నుంచి సికింద్రాబాద్ క్లబ్, కరీంనగర్ రహదారి మీదుగా శామీర్‌పేట వరకు మరో కారిడార్ వెళ్తుంది. మేడ్చల్, శామీర్‌పేట్, ఫ్యూచర్ సిటీ మార్గాల్లో రాబోయే మెట్రో కారిడార్లకు సంబంధించి డీపీఆర్ మార్చి నెలా ఖరుకల్లా సిద్ధం చేసి కేంద్రానికి పంపాలని హెచ్ఎంఆర్ఎల్ కసరత్తు చేస్తోంది.

### జౌళి ఉత్పత్తుల ఎగుమతులు పెరగాలి

టార్గెట్‌గా పెట్టుకున్నట్లు తెలిపారు. భారత్ టెక్స్ 2025లో 120కి పైగా దేశాలు పాల్గొంటున్నాయన్నారు.భారత్ హై-గ్రేడ్ కార్బన్ ఫైబర్ తయారీ దిశలో ముందుకు సాగుతోందని, వస్త్ర రంగంలో నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను తయారు చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక వస్త్ర రంగంపై దృష్టి సారించా మన్నారు. మరోవైపు, ప్రధాన పత్తి రకాల ఉత్పాదకతను పెంచేందుకు కేంద్రం రూ.500 కోట్లతో కాటన్ మిషన్‌ను ప్రక టించిన విషయం తెలిసిందే. అంతేకాకుడా, 2025-26 బడ్జెట్‌లో జౌళి మంత్రిత్వ శాఖకు కేంద్ర బడ్జెట్‌లో రూ.5,272 కోట్లు కేటాయించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 19శాతం అధికం.

## అమెరికా మద్దతు లేకుండా మేం జీవించలేం

విధంగా స్పందించారు."అమెరికా మద్దతు లేకుండా ఉక్రెయిన్ మనుగడ చాలా చాలా కష్టం. అసాధ్యం కూడా. వారి మద్దతు లేకుంటే మేం జీవించే అవకాశాలు చాలా తక్కువ" అని ఎన్‌బీసీ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీ పేర్కొన్నారు. యుద్ధాన్ని ముగించాలని పుతిన్ కోరుకో వడం లేదన్నారు. రష్యాపై విధించిన కొన్ని ఆంక్షలను ఎత్తివేయించుకోవడం కోసం పలు ఒప్పందాలు చేసుకో వాలని ఆయన భావిస్తున్నట్లు చెప్పారు.మ్యూనిక్‌లో జరిగిన భద్రతా సదస్సులో మాట్లాడిన జెలెన్‌స్కీ.. ఐరోపా గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యాతో ఐరోపాకు ప్రమాదం పొంచి ఉందని.. ఐరోపా ఇప్పటికైనా మేల్కొని, సొంతంగా సైన్యాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. గతంలోలా ఐరోపాకు అమె రికా అండగా నిలవదన్న ఆయన.. త్వరలో ఐరోపాపై రష్యా దాడి చేసే అవకాశం ఉందన్నారు. మరోవైపు రష్యాతో ట్రంప్ జరుపుతున్న చర్చల్లో ఉక్రెయిన్ భాగస్వామ్యం లేకపోవడంపై జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తంచేశారు.డొనాల్డ్ ట్రంప్.. పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలో దిమిర్ జెలెన్‌స్కీలతో ఇటీవల వేర్వేరుగా మంతనాలు జరిపారు. పుతిన్‌తో దాదాపు గంటన్నర పాటు చర్చలు జరిపినట్లు స్వయంగా ట్రంప్ వెల్లడిం చారు. నాటోలో ఉక్రెయిన్ చేరిక ఆచరణాత్మకంగా సాధ్యం కాదని భావిస్తున్నానని చెప్పిన ట్రంప్.. గతంలో కోల్పోయిన భూభాగాన్ని తిరిగి పొందే అవకాశం కూడా ఉక్రెయిన్‌కు లేదన్నారు.

# బర్డ్‌ఫ్లూ భయం

శనివారం తెల్లవారుజామున ఒకేసారి 800 కోళ్లు మృతిచెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో ఇదే ప్రభావం కనబడుతుండగా.. వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిని చిన్న, మధ్యస్థాయి చికెన్ దుకాణాదారులు బోరుమంటు న్నారు. వారం పదిరోజుల వ్యవధిలోనే భారీగా నష్టపోయే పరిస్థి తులు ఏర్పడ్డాయి. చికెన్ రేట్లు కూడా అమాం తం పడిపోవడం, అయినా వ్యాపారాలు సాగక పోవడం దుకాణాదారులకు శరఘాతంగా మారింది. ఇప్పటికే తెలంగాణలోకి పక్క రాష్ట్రాల నుంచి కోళ్లు, గుడ్ల దిగుమతుల పట్ల నిషేధం విధించిన ప్రభుత్వం.. అనారోగ్యంతో కోళ్లు కనిపిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 9100797300ను సంప్రదించాలని సూచన చేసింది.

**'మంట'లేపుతున్న మటన్**

అంతుచిక్కని వైరస్‌తో కోళ్లు మరణిస్తున్న దరిమిలా ప్రజలు చికెన్ తినాలంటేనే జంకుతున్నారు. దీంతో మటన్, చేపలు, ఇతర మాంసాహారాల పట్ల మక్కువ చూపుతున్నారు. ఇదే అదనుగా మటన్ ధరలు వంటింట్లో మంటలేపుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజానీకానికి కిలో వెయ్యి రూపాయలు పెట్టి మటన్ కొనలేని పరిస్థితి. మొన్నటివరకు గ్రామీణ ప్రాంతాల్లోనూ రూ.600 కిలో ఉన్న మటన్ ఇప్పుడు 800 రూపాయలకు చేరుకుంది. పట్టణ ప్రాంతాల్లో, ప్రధానంగా హైదరాబాద్ నగరంలో మాత్రం కొన్నిచోట్ల 900, మరికొన్నిచోట్ల 1000 రూపాయలకు కిలో ధరగా నిర్ణయించారు. చిన్న, మధ్య తరగతి వేతన జీవులు సాధారణ రోజుల్లోనే మటన్ తినలేరు. ప్రస్తుత ధరలతో ఆ షాపులవైపు కన్నెత్తి చూడలేకపోతున్నారు. చేపల రేట్లు కూడా చేదెక్కాయి. 100'150 ఉన్న కిలో చేపలు ఏకంగా 200 రూపాయలకు మించి అమ్ముతుండటం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇంతకీ తినొచ్చా.. లేదా..?**

బర్డ్ ఫ్లూ భయంతో కోళ్లకు, గుడ్లకు దూరంగా ఉంటున్న తరుణంలో పశువైద్యాధికారులు పలు సూచనలు చేస్తున్నారు. చికెన్‌ను అత్యధిక ఉష్ణోగ్రతలో ఉడికించి తింటే వైరస్ ప్రభావడం ఉండదని, ఒకటికి రెండుసార్లు శుభ్రంగా కడిగి వండుకోవాలని చెబుతున్నారు. బయట రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో మాత్రం తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### పౌల్ట్రీకి దెబ్బ.. ఉపాధికి గండం

రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం 1100కు పైగా పౌల్ట్రీ పరిశ్రమలు ఉండగా.. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ రంగం 24 లక్షల మందికి పైచిలుకు జీవనాధారం. పేద, మధ్య తరగతికి అందుబాటులో ఉండే చికెన్ ధరలతో వ్యాపారం కూడా భారీగానే సాగుతోంది. ఈ నేపథ్యంలో బర్డ్ ఫ్లూ వదంతులు విస్తృతంగా వ్యాప్తిచెందడంతో రాష్ట్ర సర్కార్ అప్రమత్తమై.. వైరస్ సోకిన కోళ్ల పట్ల హెచ్చరికలు జారీచేసింది. ఫుడ్‌సేఫ్టీ అధికారులను కూడా రంగంలోకి దింపింది. ఈ క్రమంలో పలు జిల్లాల్లో వందల కోళ్లు మృత్యువాతపడటంతో చికెన్ వ్యాపారాలు ఒక్కసారిగా ధమాలయ్యాయి. పల్లెలవరకూ చికెన్ తినొద్దనే సంకేతాలు వెళ్లడంతో షాపులన్నీ వెలవెలబోతున్నాయి. పౌల్ట్రీల్లో కూడా ఒక్కోచోట పదుల సంఖ్యల్లో మృత్యువాత పడుతున్న కోళ్లను గుట్టుగా పడేస్తున్నారు. పది రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యల్లో కోళ్లు మరణించడంతో పౌల్ట్రీల మనుగడ కూడా ప్రశ్నార్థకమవుతోంది. కార్మికులను తగ్గించే పరిస్థితులు ఉన్నట్టు యజమానులు చెబుతున్నారు.

చికెన్ ఇంట్లోకి తీసుకొచ్చిన తర్వాత చేతులకు గ్లౌసెస్ వేసుకుని ముందుగా శుభ్రం చేసుకోవాలని, జ్వరం, ఇతర వ్యాధులతో భయపడుతున్నవారు మాత్రం చికెన్‌కు దూరంగా ఉండాలని అంటున్నారు.

# అనౌన్స్‌మెంట్ తికమకతోనే తొక్కిసలాట

వాటిల్లో మూడు ఆలస్యమయ్యాయి. దీంతో చాలా మంది యాత్రికులు 14వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి చేరారు.ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో పరిస్థితిపై ఓ యాత్రికుడు స్పందిస్తూ.."నేను నా జీవితంలో ఎన్నడూ ఒక రైల్వే స్టేషన్‌లో అంతమంది జనాలను చూడలేదు. అధికారులు అక్కడే ఉ న్నారు. కానీ, ప్రయాణికుల సంఖ్య ఒక్కసా రిగా పెరిగిపోవడంతో.. నియంత్రించడం వారి వల్లకాలేదు" అని వెల్లడించాడు. తొక్కి సలాట రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకొంది. ఈ ఘటనలో మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘటనలో మృతులకు రైల్వేశాఖ రూ.10 లక్షల పరిహారం ప్రకటించింది.

**మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం**

కుంభమేళా కు ప్రయాణికులు పోటెత్తడంతో శనివారం న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 18 మంది మరణించగా.. అనేక మంది గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వనున్నట్లు రైల్వేశాఖ అధికారులు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పగాయాలైనవారికి రూ.లక్ష ఇస్తామన్నారు. ఇక మృతుల్లో బిహార్‌కు చెందిన 9మంది, ఢిల్లీకి చెందిన 8మంది, హరియాణాకు చెందిన ఒకరు ఉన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని, అదనపు భద్రతా బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముదిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించడం బాధాకరం. మృతుల



కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా' అని ఆమె ఎక్స్‌లో రాసుకొచ్చారు. ఈ ఘటపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ సైతం విచారం వ్యక్తం చేశారు.కుంభమేళాకు వెళ్లేందుకు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పోటెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. 14వ నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండడంతో భక్తులు అక్కడకు చేరుకున్నారు. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు అదే సమయంలో 12, 13, 14 నంబరు ప్లాట్‌ఫాంలపై ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగిపోయి తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనపై ప్రధాని మోదీగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తొక్కిసలాట నేపథ్యంలో రద్దీని నివారించేందుకు నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**రైల్వేశాఖ నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట**

నిర్లక్ష్యంతోనే ఆ దుర్ఘటన జరిగిందని విమర్శించారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. తొక్కిసలాట ఘటన తనను ఎంతో బాధించిందని రాహుల్ పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఘటన రైల్వేశాఖ వైఫల్యానికి నిదర్శనమన్నారు. నిర్వహణ లోపం, నిర్లక్ష్యం కారణంగానే అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారని విమర్శించారు.ప్రభుత్వ అసమర్థత కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని కాంగ్రెస్ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. 'ఇది తీవ్ర విషాదకరం. అక్కడి నుంచి వచ్చిన విజువల్స్ భయంకరంగా ఉన్నాయి. కేంద్రం పర్యవేక్షణలో, దేశ రాజధానిలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం పూర్తిగా ప్రభుత్వ అసమర్థతే. మరణించిన, గాయపడినవారి ఖచ్చితమైన గణాంకాలు ఎప్పుడు తెలుస్తాయి?. రద్దీ నియంత్రణకు చర్యలు ఎందుకు తీసుకోలేదు?,, కుంభమేళా నేపథ్యంలో రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఎందుకు నడపలేదు?' అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ఇలాంటి ఆరోపణలు చేశారు. కుంభమేళాకు వెళ్లేందుకు ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పోటెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. తొక్కిసలాటలో 18 మంది మరణించగా.. అనేక మంది గాయపడ్డారు. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు 12, 13, 14 ప్లాట్‌ఫాంలపై వేచిఉన్నారు. అదే సమయంలో 14వ నంబరుపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలవడంతో ఒక్కసారిగా తొక్కిసలాటకు దారితీసింది. దీనిపై ఢిల్లీ పోలీసులు విచారణ చేస్తున్నారు. తొక్కిసలాటకు గల కారణాలు తెలుసుకునేందుకు రైల్వేస్టేషన్‌లోని సీసీటీవీలను పరిశీలిస్తునట్లు ఓ సీనియర్ అధికారి తెలిపారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో 18 మంది ప్రాణాలు కోల్పోవడంపై ఆమ్‌ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా స్పందించారు. ఈ ప్రమాదానికి బాధ్యత వహిస్తూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో తరచుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ వాటి నివారణకు కేంద్రం ఎటువంటి చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. రైళ్లలో పెరు గుతున్న రద్దీ అంశాన్ని ఫిబ్రవరి 11న పార్లమెంటులో తాను లేవనెత్తినా..ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు జరిగిన ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.సాధారణ సమయాల్లోనే రైళ్లలో ప్రజలను ఆలుగడ్డ బస్తాల్లా కుక్కి పంపిస్తున్నారని అన్నారు. రైళ్లోని బాత్రూమ్‌లో కొంత స్థలం దొరికినా ప్రజలు అదే అదృష్టంగా భావిస్తారని పేర్కొన్నారు. మహాకుంభ్ లాంటి అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహిస్తున్న సమయంలో అయినా రద్దీని దృష్టిలో ఉంచుకొని రైళ్ల సంఖ్య పెంచాలని రైల్వేశాఖ ఆలోచించలేకపోయిందని దుయ్యబట్టారు.

## మాలిలో పెను విషాదం

గాయపడినట్లు అక్కడి అధికారులు వెల్లడించారు. నెల రోజుల వ్యవధిలోనే ఈ తరహా ఘటనల్లో ఇది రెండోది కావడం గమనార్హం. చైనా దేశస్థుల నిర్వహణలో ఉన్న గనిలో శనివారం కొండచరియలు విరిగిపడి ఇప్పటివరకు ప్రాథమికంగా 42మంది చనిపోయినట్టు అక్కడి ప్రభుత్వ ప్రతినిధులు వెల్లడించారు. ఈ గని చట్టబద్ధంగా నిర్వహిస్తున్నారో లేదా అనే విషయాన్ని తెలుసుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఇది రెండో ప్రమాదం కావడం గమనార్హం. జనవరి 29న, కౌలికోరో అనే ప్రాంతంలో బంగారు గని కూలడంతో అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఎక్కువ మంది మహిళలే. అలాగే, గతేడాది జనవరిలోనూ మాలి రాజధాని బమాకో సమీపంలో జరిగిన దుర్ఘటనలో 70మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం రేపింది. మాలి జనాభాలో 2 మిలియన్లు (10శాతం) కన్నా ఎక్కువ మంది మైనింగ్ రంగంపైనే ఆధారపడి ఉన్నట్లు పేర్కొంది. ఆఫ్రికా దేశాల్లో మూడో అతిపెద్ద బంగారు ఉత్పత్తిదారుగా ఉన్న మాలిలో గనుల ప్రమాదాలు తరచూ చోటుచేసుకుంటుంటాయి.

## బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు వృథా

హామీలను అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. తెలంగాణలో భారాసను అధికారంలో నుంచి దించేందుకు పదేళ్లు పట్టిందని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిలోనే తీవ్ర వ్యతిరేకత వచ్చిందని విమర్శించారు. హనుమకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. 2014 తర్వాత మండలిని భారాస తమకు మద్దతుగా మార్చుకుందన్నారు. పోరాటం చేసే వారు లేకుండా తమకు మద్దతుగా ఉన్నవారినే ఆ పార్టీ ఎంచుకుందని ఆరోపించారు.

# స్థానిక సంస్థలకు వీడని ఎన్నికల గ్రహణం

- ఎన్నికలు జరుగవు...నిధులు రావు
- పాలకవర్గాలు లేక నిలిచిన 15వ ఫైనాన్స్ నిధులు



వనపర్తి, ఫిబ్రవరి16 (జనంసాక్షి) : పాలకుల పంతాలకు బలయ్యేది ప్రజలే.రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల హననం జరుగుతుందని తెలిసినా అధికారంలో ఉన్న పార్టీల ఉనికి కోసం వాటిని తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది. అందులో భాగమే ఏడాది కాలంగా తెలంగాణలో గ్రామ పంచాయతీలకు ఎన్నికల జరుపక పోవడమని పలువురు సామాజిక వేత్తలు, రాజకీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.1973 -74 రాజ్యాగ సవరణ ద్వారా తెచ్చిన పంచాయతిరాజ్ చట్టం ప్రకారం ఐదేళ్ళకోసారి విధిగా స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించి ఎప్పటికప్పుడు కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయినప్పటికీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ఏడాది కాలంగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే అంశాన్ని మూలకు పడేసిందన్న విమర్శలు కొనసాగుతున్నాయి. పాలకమండళ్లు ఉంటేనే 15వ ఫైనాన్స్ నిధులు విడుదల ఆయ్యే నిబంధనలు ఉండడంతో 2024-25 ఏడాది నిధులను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

### మార్చి 31లోపు ఎన్నికలయ్యే అవకాశం తక్కువే

రాష్ట్రంలో పంచాయతీల పాలక వర్గాలు లేక ఏడాది దాటింది. పలు కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నాయి. వాటికి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో కూడా తెలియని పరిస్థితులున్నాయి. దీని ఫలితంగా పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా, అప్పటినుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి.ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరం లో తెలంగాణలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం రూ.1,514 కోట్లను కేటాయించింది. కానీ, పంచాయతీల్లో పాలక వర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. అందువల్ల 15వ ఫైనాన్స్ నిధులను విడుదల చేసేది లేదని కేంద్ర ప్రభుత్వం ఖరాఖండిగా చెబుతోంది. దీంతో ఏడాదిగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. మరోవైపు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,152 కోట్లను కేటాయిచగా, ఈ నెల 7వ తేదీ నాటికి రూ.2,109 కోట్లు విడుదలయ్యాయి. కర్ణాటకకు రూ.1,120 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మాత్రమే సర్పంచ్‌లు లేనికారణంగా నిధులు విడుదల కాలేదు. ఈ నిధులను కోల్పోవాల్సి వస్తుందన్న కారణంతోనే రాష్ట్ర ప్రభుత్వం మార్చి 10వతేదీ నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించింది. కానీ, రాష్ట్రంలో మారిన రాజకీయ, సామాజిక పరిస్థితులతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో ఈ ఏడాది కేంద్రం నుంచి అందాల్సిన ఆర్థికసంఘం నిధులపై సందిగ్ధం నెలకొంది.

### 2024-25 15వ ఆర్థిక సంఘం నిధులు అనుమానమే..?

నిధుల విడుదలలో కేంద్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తోంది. 15వ ఆర్థిక సంఘం నుంచి గడచిన నాలుగేళ్లలో (2020-21 నుంచి 2023-24 వరకు) తెలంగాణలోని పంచాయతీలకు రూ.6,051 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం ఒక్క రూపాయి రాకపోవడమే ఇందుకు నిదర్శనం. 2024 ఫిబ్రవరిలో పాలకమండళ్ల పదవీకాలం ముగియడంతో.. ఆ తరువాత నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమయ్యే నాటివరకే లెక్కించి నిధులను కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.1,430 కోట్లలో రూ.6 కోట్లను తగ్గించి రూ.1,424 కోట్లనే విడుదల చేయడం గమనార్హం. కాగా, దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం 2026 వరకు ఉంటుంది. ఈ ఐదేళ్ల (2021 నుంచి 2026 వరకు) కాలానికి పంచాయతీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం కేంద్రం రూ.2,36,805 కోట్లను కేటాయించింది. ఇందులో తెలంగాణకు రూ.7,565 కోట్లు రావాల్సి ఉంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఢిల్లీ మినహా మిగిలిన 28 రాష్ట్రాలకు కలిపి రూ.60,750 కోట్లను కేటాయించింది. వీటిలో తెలంగాణకు రూ.1,514 కోట్లను ప్రకటించింది. కానీ, పంచాయతీల్లో పాలకమండళ్లు లేని కారణంగా ఇవి అందలేదు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపే అంటే మార్చి 31లోగా పాలకమండళ్లు ఏర్పడితే ఆర్థిక సంఘం నిధులు వస్తాయని సర్కారు భావించింది. అందుకోసమే మార్చిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినా,కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాలతో ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో 2024-25కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు రాష్ట్రానికి అందే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇస్తారా.!

రాష్ట్రంలోని పంచాయతీల్లో పాలకమండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయలేదన్నది స్పష్ట మవుతోంది. వచ్చే మార్చి 31తో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఆ తరువాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం గడువు కూడా వచ్చే మార్చితోనే ముగియనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదల చేయని నిధులు వచ్చే ఏడాదికి బదిలీ అవుతాయా? అందుకు అవకాశాలున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు నిలిచిపోతే,తర్వాత ఏడాదికి బదిలీ చేసే వెసులుబాటు కేంద్రానికి ఉంటుంది. అది కేంద్రం విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కానీ, రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు ఇలా నిధులను కేంద్రం బదిలీ చేస్తుందా అన్నది ప్రశ్నార్థకమే.

## ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌కే సంపూర్ణ మద్దతు

- మైనారిటీ సంఘం, లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు సయ్యద్ జబీ

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు గెజిటెడ్ లెక్చరర్స్ ఫోరం తరపున మైనారిటీ సంఘ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ జబీ ప్రకటించారు. 4 ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘ ముఖ్య నాయకులతో కూడిన లెక్చరర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ ఆన్ లైన్ సమావేశంలో అన్ని సంఘాల నాయకులతో చర్చించి అశోక్ కుమార్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకోవడం ప్రభుత్వ ఉపాధ్యాయుల, అధ్యాపకుల అవసరమని అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ జబీ మాట్లాడుతూ ప్రస్తుత టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు చాలా వరకు కార్పోరేట్ విద్య, ప్రేవేట్ సంస్థల తరపున, టీచర్లతో సంబంధం లేని రాజకీయ నాయకులు ఉన్నారని తెలిపారు. గతంలో గెలిచిన వారికి విద్యా రంగంపై, ప్రధాన సమస్యలపై కనీస అవగాహన లేదని తెలిపారు. ప్రభుత్వ టీచర్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి ప్రభుత్వ విద్యాలయాల సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి అశోక్ కుమార్ అని తెలిపారు. విద్యా రక్షణకు ప్రొఫెసర్ హరగోపాల్‌తో, విద్యావంతుల వేదిక తరపున ప్రొ॥ఎం కోదండరాంతో విద్యా సమస్యల సాధన కొరకు పనిచేస్తున్న వ్యక్తి, కార్పోరేట్ విద్య కాకుండా కామన్ విద్య కోసం, సమాన పనికి సమాన వేతనాల కోసం, విద్యలో సామాజిక న్యాయం కోసం పోరాడే సంఘాల నుండి వచ్చిన వ్యక్తి, తెలంగాణ ప్రొగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా ప్రభుత్వ విద్య, పాఠశాలలు, కళాశాలలు ఉపాధ్యాయుల సమస్యలపై అవగాహన కలిగిన నాయకుడు అశోక్ కుమార్ ఒక్కరేనని తెలిపారు. అందుకే నేటి విపరీతమైన పోటీలో, డబ్బులు లేకుండా ఎలక్షన్ లకు వెళ్ళలేని పరిస్థితులలో కూడా ఒక సాధారణ టీచర్ అత్యధిక సంఘాల మద్దతు తీసుకున్న వ్యక్తి అశోక్ కుమార్ అని, ఉపాధ్యాయులందరూ ఆయనకు తోడుగా నిలిచి సమస్యల్ని సాధించుకో వాలని పిలుపినిచ్చారు. వరంగల్, నల్గొండ, ఖమ్మం అభ్యర్థి అలుగుబల్లె నర్సిరెడ్డికి మద్దతిస్తున్నట్లు తెలిపారు.

## నగరంలో రెండురోజులు నీళ్లు బంద్

- ఫిబ్రవరి 17-18న తాగునీటి సరఫరా అంతరాయం
- గోదావరి వాటర్ సప్లై ఫేజ్-1 మరమ్మతులు
- నీటి నిల్వలు చేసుకోవాలని హెచ్చరిక చేసిన వాటర్ బోర్డులు అధికారులు



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ మహానగర జలమండలి గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్-1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద మరమ్మతులు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 17న (సోమవారం) ఉదయం 6 గంటల నుంచి ఫిబ్రవరి 18న (మంగళవారం) ఉదయం 6 గంటల వరకు ఈ పనులు జరగనున్నాయి. ఈ సమయంలో నగరంలోని అనేక ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోనుంది. 3000 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు 900 ఎంఎం డయా వాల్వులు (బీఎఫ్ అండ్ ఎన్ఆర్వీ) అమర్చనున్నారు. మొత్తం 24 గంటల పాటు మరమ్మతులు కొనసాగుతాయి. ముందస్తుగా నీటి నిల్వలు చేసుకోవాలని, ఈ అసౌకర్యానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఓఅండ్ఎం డివిజన్-6 :** ఎస్ఆర్‌నగర్, సనత్ నగర్, బోరబండ, ఎస్పీఆర్ హిల్స్, ఎర్రగడ్డ, బంజారాహిల్స్, వెంగళ్ రావు నగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఫతేనగర్.
**ఓఅండ్ఎం డివిజన్-9 :** కూకట్పల్లి, భాగ్యనగర్, వివేకానంద నగర్, ఎల్లమ్మ బండ, మూసాపేట్, భరత్ నగర్, మోతీనగర్, గాయత్రి నగర్, బాబానగర్, కేపీహెచ్ బీ, బాలాజీ నగర్, హస్మత్ పేట్.
**ఓ అండ్ ఎం డివిజన్-12:** చింతల్, సుచిత్ర, జీడిమెట్ల, షాపూర్ నగర్, గాజులరామారం, సూరారం, ఆదర్శ్ నగర్, భగత్ సింగ్ నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ.
**ఓ అండ్ ఎం డివిజన్-13 :** అల్వాల్, ఫాదర్ బాలయ్య నగర్, వెంకటాపురం, మచ్చ బొల్లారం, డిఫెన్స్ కాలనీ, వాజ్‌పేయ్ నగర్, యాప్రాల్, చాణిక్యపురి, గౌతమ్ నగర్, సాయినాథపురం.
**ఓ అండ్ ఎం డివిజన్-14:** చెర్లపల్లి, సాయిబాబా నగర్, రాధిక.
**ఓ అండ్ ఎం డివిజన్-15:** కొండాపూర్, డోయెన్స్, మాదాపూర్ (కొన్ని ప్రాంతాలు).
**ఓ అండ్ ఎం డివిజన్-17:** హఫీజ్ పేట్, మియాపూర్.
**ఓ అండ్ ఎం డివిజన్-21:** కొంపల్లి, గుండ్లపోచంపల్లి, తూంకుంట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, నాగారం.
**ఓ అండ్ ఎం డివిజన్-22:** నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతి నగర్, గండి మైసమ్మ, తెల్లాపూర్, బొల్లారం.
**ట్రాన్స్ మిషన్ డివిజన్-4:** ఎంఈఎస్, త్రిశూల్ లైన్స్, గన్ రాక్, హకీంపేట్ ఎయిర్ ఫోర్స్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, బీబీనగర్ ఎయిమ్స్.
**ఆర్‌డబ్ల్యూ ఎస్ ఆఫ్ టేక్స్ ప్రాంతాలు:** ప్రజ్ఞాపూర్ (గజ్వేల్), ఆలేరు (భువనగిరి), ఘన్ పూర్ (మేడ్చల్ / శామీర్ పేట్).

## హజ్‌యాత్రలో విధిగా నియమాలను, పద్ధతులను పాటించాలి

- హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి రఫీయుద్దీన్ రషాది
- లబ్బయిక్ హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు శిక్షణ శిబిరం విజయవంతం




కరీంనగర్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : హజ్ యాత్ర 2025 సంవత్సరానికి వెళ్లేవారు హజ్ యాత్రలో భాగంగా కనీస నియమాలను క్రమం తప్పకుండా పాటించాలని మాస్టర్ హజ్ ట్రైనర్ ముఫ్తి రఫీయుద్దీన్ రశాది సందేశం ఇచ్చారు. నగరంలోని కాశ్మీర్ గడ్డ ప్రాంతంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో లబ్బయిక్ సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో మొదటి శిక్షణా శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కు చెందిన ప్రముఖ హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి రఫీయుద్దీన్ రశాది హాజరై హజ్ యాత్రకు వెళ్లే వారికి పూర్తిస్థాయి నియమాలను, పద్ధతులను కూలంకషంగా వివరించారు. బైక్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సొసైటీల ద్వారా పొందే అటువంటి సేవలు, విమానయానం, ఇమ్మిగ్రేషన్, వసతులు, సౌకర్యాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో హజ్ మాస్టర్ ట్రైనర్ ముఫ్తి రఫీయుద్దీన్ రశాది..ముఫ్తి యునుస్ ఖాస్మి, హాఫిజ్ వసిముద్దీన్, మౌలాన హైదర్ అసాధి, హాఫీజ్ లయిఖ్ రహమాన్, లబ్బాయిక్ హజ్ సొసైటీ అధ్యక్షుడు సయ్యద్ ఇర్ఫాన్ ఉల్ హాఖ్, ఉపాధ్యక్షుడు హాఫిజ్ ముదస్సిర్ రహమాన్, ప్రధాన కార్యదర్శి హాఫిజ్ రిజ్వాన్, సభ్యులు అబ్దుల్ కరీం జాహిద్, హాఫిజ్ లోఖ్ మాన్, హాఫిజ్ వసీం సాధఖ్, హాఫిజ్ ఫర్హాన్, మహమ్మద్ హాఫిజ్‌తోపాటు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు చెందిన సుమారు 200మంది హజ్ యాత్రికులు పాల్గొన్నారు.

## టీచర్లు గ్రాడ్యుయేట్ల పక్షాన ఒక్కనాడైనా పోరాటాలు చేశారా?

- కమీషన్లు, కుట్రలు తప్ప కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిందేమిటి?
- వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపు



కరీంనగర్ (జనంసాక్షి) : టీచర్, గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి అర్హతే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. "టీచర్లు, గ్రాడ్యుయేట్ల పక్షాన ఎన్నడైనా పోరాటాలు చేశారా? 317 జీవోకు వ్యతిరేకంగా ఎన్నడైనా కేసీఆర్ సర్కార్ తో కొట్లాడారా? గ్రూప్ 1 సహా నిరుద్యోగల పక్షాన ఎన్నడైనా జైలుకు వెళ్లారా? మరి కాంగ్రెస్ అభ్యర్థులకు ఎందుకు ఓట్లేయాలి? టీచర్లు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం కొట్లాడింది, జైలుకు వెళ్లింది, లాఠీదెబ్బలు తిన్న చరిత్ర బీజేపీదే..."అని స్పష్టం చేశారు. కరీంనగర్ నిజామాబాద్ ఆదిలాబాద్ మెదక్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ తోపాటు బీజేపీ ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్స్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప తదితరులు పాల్గొన్నారు. నిరుద్యోగుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన చరిత్ర బీజేపీదేనన్నారు. వరంగల్, నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో పోరాటాలు చేసామన్నారు. నల్లగొండ, సిద్దిపేటలో నిరుద్యోగుల పక్షాన పోరాడితే అనేక మంది కాళ్లు చేతులు విరగ్గొట్టారన్నారు. లాఠీ దెబ్బలు తిన్నారన్నారు. గ్రూప్ 1 ఉద్యోగుల పక్షాన కేంద్ర మంత్రిగా ఉంటూ మద్దతు తెలిపి పోరాటం చేశానన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆనాడు గ్రూప్ 1 నిరుద్యోగుల మధ్యకు చేరి విధ్వంసం సృష్టించాలని చూశారని తెలిపారు. తద్వారా గ్రూప్ 1 అభ్యర్థుల భవిష్యత్ ను నాశనం చేయాలని చూశారన్నారు. ఆనాడు వాళ్ల కుట్రను తిప్పికొట్టానని, మరి ఏనాడైనా కాంగ్రెస్ నేతలు, బీఆర్ఎస్ నేతలు తమ స్వార్థం కోసం తప్ప నిరుద్యోగుల పక్షాన ఉద్యమాలు చేసిన చరిత్ర లేదని, కమీషన్ల కోసం పనిచేశారని, కాంగ్రెస్ నేతలు ప్రతి పనికి సంబంధించి బిల్లులో 14 నుండి 18 శాతం కమీషన్ అడుగుతున్నారని, కమీషన్ ఇవ్వకుండా బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లను వేధింపులకు గురిచేస్తున్నారని తెలిపారు. టీచర్ల కోసం నిరంతరం కొట్టాడింది మనమేనన్నారు.

## కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ నాశనం

- మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



సిద్దిపేట, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : పార్లమెంటు ఎన్నికల్లో మూడో సారి నరేంద్ర మోదీకి ప్రజలు అధికారం కట్టబెట్టారని, ప్రతిపక్షాల తీరు పార్లమెంటులో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు. ఇప్పుడు తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఆశీర్వదించే విధంగా కనిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులకు అండగా కొట్లాడిన పార్టీ బీజేపీ అని, టీచర్ల విషయంలో, మధ్యతరగతి వారి విషయంలో బీజేపీ కృషిచేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో నే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాండవిస్తోందని, ప్రపంచం లో 11 వ ఆర్థిక వ్యవస్థలో ఉన్న భారత్ మోదీ కృషితో 5 వ స్థానానికి వచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్యను సంపూర్ణంగా నిర్మూలించే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 4 లక్షల కోట్లు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచాన్నే శాసించే అమెరికా అధ్యక్షుడు, అమెరికాలో మోదీని సన్మానించిన విషయం చూసామన్నారు. కేసీఆర్ పాలనను ప్రజలు అసాహ్యించుకోడానికి 9 సంవత్సరాలు పడితే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు అసాహ్యించుకోడానికి 9 నెలలు పట్టిందన్నారు.

### కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారు.

కేసీఆర్ పాలనలోనే ఆర్థిక వ్యవస్థ కొల్లగొట్టారని, కాంగ్రెస్ పార్టీని కానీ కేసీఆర్‌ను కానీ ప్రజలు నమ్మే విధంగా లేరని ఈటల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందే కేసీఆర్ అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ పాలనపై కేసీఆర్ నిలదీయడం ఎంటన్నారు. కాళేశ్వరంపై అధికారులను ప్రశ్నిస్తే కేసీఆర్ చెప్పినట్లే చేసామని చెబుతున్నారు. కేంద్రంలో 70 మందికి పైగా మంత్రులు ఉంటే.. అందులో 30 మందికి పైగా బీసీలే ఉన్నారని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు..




## రేవంత్ మాటల్లో తప్పేంలేదు

- ఎంపీ మల్లు రవి

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : ప్రధాని మోడీ పుట్టుకతో బీసీ కాదని మధ్యలో లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని మాత్రమే సీఎం రేవంత్ రెడ్డి అన్నారని, ఇందులో ప్రధానిని అవమాన పరిచే అంశం ఏముందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో హాట్ కామెంట్స్ చేశారు. మోడీ పుట్టకతో బీసీ కాకపోవడం వల్ల బీసీల అణచివేత, అవమానాలు ఆయనకు తెలియదన్నారు. అదే విషయాన్ని రేవంత్ రెడ్డి ప్రస్తావించారు.. అందులో ఎలాంటి రాజకీయ విషయాలు లేదని అన్నారు. రేవంత్ రెడ్డికి బీసీల సమస్యలు బాగా తెలుసు కాబట్టే ఆయన సీఎం కాగానే బీసీ కులగణన చేసి వారి జనాభా లెక్కల ప్రకారం వారికి విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో వాటా కోసం కృషి చేస్తున్నారని కొనియాడారు.

మోడీ గనుక బీసీ అయ్యుంటే బీసీలపై ప్రేమ ఉంటే దేశంలో జనగణనతో పాటు కులగణన చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని అన్నారు. దేశంలో ఎవరు దైవంశసంబుతులు కారని ఇది ప్రజాస్వామ్య దేశం ఇక్కడ ప్రజల మద్దతు ఉన్నవారే నాయకులు అవుతారని తెలిపారు. ప్రధాని మోడీ బీసీ అని పదే పదే చెప్తున్న బీజేపీ మోడీ బీసీల కోసం ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీల సమస్యలు తెలియదని రేవంత్ రెడ్డి అన్నారని, అందులో తప్పు ఏముందని ప్రశ్నించారు. మోడీ బీసీ అయితే ఇక్కడ ఉన్న బీజేపీ నాయకులు మోడీని ఒప్పించి బీసీ కులగణన చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



## గ్రంథాలయాలు: సస్టైనబుల్ డెవలప్‌మెంట్

# గోల్స్‌ను చేరుకునే మార్గం

ఐక్యరాజ్యసమితి 2015లో ప్రకటించిన సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీఎస్) ప్రపంచవ్యాప్తంగా పేదరికం, అసమానతలు, పర్యావరణ నాశనం, న్యాయం, శాంతి వంటి సమస్యలను పరిష్కరించడానికి రూపొందించిన 17 లక్ష్యాల సమాహారం. ఈ లక్ష్యాలను సాధించడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అవి జ్ఞాన కేంద్రాలుగా మాత్రమే కాకుండా, సమాజానికి అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, విద్యను ప్రోత్సహిస్తూ, మౌలిక హక్కులను పరిరక్షించే వేదికలుగా మారాయి. గ్రంథాలయ శాస్త్రం, గ్రంథాలయాల భవిష్యత్తు, గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులు, పరిశోధకుల పాత్ర వంటి అంశాలను ఈ వ్యాసంలో విశ్లేషిస్తాము.

గ్రంథాలయాలు ఎస్ డీ జీఎస్ లక్ష్యాలను అనుసరించి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. అవి విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం ద్వారా నాణ్యమైన విద్య (ఎస్‌డీజీఎస్-4) లక్ష్యాన్ని సమర్థవంతంగా చేరుకునేలా సహాయపడుతున్నాయి. ఉచిత పుస్తకాలు, డిజిటల్ లెర్నింగ్ రీసోర్సులు, చదువుకొనే వాతావరణాన్ని రూపొందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి. అంతేగాక, సమాచార అవకాశాలను అందించడంలో సమానత్వాన్ని (ఎస్‌డీజీఎస్-10) నెలకొల్పి, సమాజంలోని వెనుకబడిన వర్గాలకు జ్ఞానాన్ని చేరుస్తున్నాయి. కొన్ని గ్రంథాలయాలు స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్యంతో చట్టపరమైన సమాచారం, ప్రజాస్వామ్య వ్యవస్థల గురించి అవగాహన కల్పిస్తూ, పారదర్శకమైన పరిపాలనను (ఎస్‌డీజీఎస్‌బి16) ప్రోత్సహిస్తున్నాయి. అయితే, గ్రంథాలయాలు ఎస్‌డీజీఎస్‌కు అనుగుణంగా పనిచేయడంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నా యి. ముఖ్యంగా, లైబ్రేరియన్లు ఎస్‌డీజీఎస్ గురించి తెలుసుకున్నా, వాటిని కార్యాచరణలోకి తీసుకురావడం లో స్పష్టమైన అవగాహన లోపించడంతో సమస్యలు ఏర్పడుతున్నాయి. పలు అభివృద్ధి చెందుతున్న దేశాల లో, విద్యా మంత్రిత్వ శాఖలు గ్రంథాలయాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేకపోవడం వల్ల సమర్థవంతమైన సేవలు అందించలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఏడాది అదనంగా 700 బిలియన్ డాలర్లు అవసరమన్న అంచనాలు ఉన్నందున, సముదాయ ఆధారిత నిధుల సేకరణ అనివార్యంగా మారుతోంది. అలాగే, గ్రంథాలయ నిర్వహణలో సాంకేతిక మార్పులు, సిబ్బందికి తగిన శిక్షణ లభించకపోవడం వల్ల, ఆధునిక గ్రంథాలయ వ్యవస్థలు స్థాపించడానికి అవరోధాలుగా మారుతున్నాయి.

గ్రంథాలయ శాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు ఎస్‌డీజీఎస్‌ను గ్రంథాలయాల విధానాల్లో అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. పరిశోధకులు గ్రంథాలయాల ద్వారా సుస్థిర అభివృద్ధిని ఎలా సాధించవచ్చో విశ్లేషిస్తూ, కొత్త మార్గదర్శకాలను ప్రతిపాదిస్తున్నారు. ఉదాహరణకు, "శూన్య ఆకలి" మరియు "మంచి ఆరోగ్యం" లక్ష్యాలను గ్రంథాలయాలు ఎలా సాధించగలవో గురించి పలు పరిశోధనలు వెలువడ్డాయి. విద్యార్థులు, పరిశోధకులు ఆకృతిగల గ్రంథాలయ నమూనాలను రూపొందించడం ద్వారా, గ్రీన్ లైబ్రేరీలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నారు. కేరళలోని రాజగిరి బిజినెస్ స్కూల్ లైబ్రరీ ఈ మార్గంలో ముందంజ వేసి, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా పనిచేస్తోంది. డిజిటల్ రీసోర్సులను ప్రోత్సహించడం, శక్తి వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాలను తగ్గించే విధానాలను అనుసరించడం ద్వారా, గ్రంథాలయాలు పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేస్తున్నాయి. ఎస్ డీ జీఎస్ కు అనుగుణంగా గ్రంథాలయాలను మరింత సమర్థవంతంగా మార్చడానికి కొన్ని వ్యూహాలు అనుసరించాల్సిన అవసరం ఉంది. మౌలిక వనరుల కొరతను అధిగమించడానికి గ్రంథాలయాలు ప్రభుత్వ విభాగాలు, అంతర్జాతీయ సంస్థలతో కలిసి భాగస్వామ్యం ఏర్పరచుకోవాలి. అలాగే, లైబ్రేరియన్లకు ఎస్‌డీజీఎస్ లక్ష్యాలపై అవగాహన కల్పిస్తూ, సమర్థవంతమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి. పైగా, టెక్నాలజీ వినియోగాన్ని పెంచి, డిజిటల్ గ్రంథాలయాలను అభివృద్ధి చేస్తే, మరింత మందికి సమాచారం చేరువవుతుంది.

గ్రంథాలయాలు సమాచారాన్ని అందించటమే కాకుండా, సమాజాన్ని మారుస్తున్న శక్తిగా పనిచేయాలి. అవి బహుళ విధాలలో ప్రజలకు మేలు కలిగించేలా రూపొందించబడాలి. విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, న్యాయం, సామాజిక సమానత్వం వంటి రంగాలలో గ్రంథాలయాల పాత్ర పెరుగుతుంది. అయితే, దీని సాధన కోసం సరైన వ్యూహాలు, సరైన పెట్టుబడులు, గ్రంథాలయాల స్వరూపాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చే విధానాలు అనుసరించాలి. విద్యార్థులు, పరిశోధకులు, లైబ్రేరియన్లు కలిసి పని చేస్తే, గ్రంథాలయాల ప్రభావం మరింత విస్తృతంగా ఉంటుందనే విషయం స్పష్టంగా చెప్పొచ్చు. SDGsను సాధించే ప్రయత్నంలో, గ్రంథాలయాలు కీలక భాగస్వామ్యంగా మారి, భవిష్యత్ తరాలకు అమూల్యమైన సేవలను అందించగలవు.



డాక్టర్ రాధికా రాణి
అసిస్టెంట్ ప్రొఫెసర్, హెడ్.లైబ్రరీ,
ఇన్ఫర్మేషన్ డిపార్ట్మెంట్,
కాకతీయ యూనివర్సిటీ, వరంగల్.

### మనిషీ... ఆలోచించు..!

ఈ లోకంలో ఏదీ శాశ్వతం ?
నీ వెనుక ఉన్న ఆస్తులా...!
నీ ముఖానికి ఉన్న అందమా...!
నువ్వు పూట తిని, తినక,కష్టపడి,చమటోడ్చి,లేదా
అబద్దాలు, మాయమాటలు, మోసాలు చేసి
సంపాదించిన ఆస్తులు, అంతస్థులు, బంగారం,
బంధువులు, స్నేహితులు, దైవచింతన, ఇలా నీకు
అన్నీ ఉన్నా ప్రశాంతంగా ఉన్నావా...!
ఒంటరిగా తల్లి కడుపు నుండి వచ్చావు
ఒంటరిగానే భూగర్భములో కలిసిపోతావు
ఈ క్షణం ఉంటే మరుక్షణం ఉందోలేదో తెలియదు
నిమిషం తీరిక లేకుండా పరుగెత్తుతున్నావు
అసలు నువ్వే ఈ భూమిపై లేని రోజంటూ
ఒకటొస్తే నువ్వు సంపాదించుకున్న ఇందులో ఏ
ఒక్కటైనా నిన్ను కాపాడగలదా.!
ఒక్కటి మాత్రం నిజం నీకు ధమ్ము ధైర్యం,రొమ్ము
విరిచే పౌరుషం ఉంటే తెలివి,తెగువ,నిజంగా ఉంటే
నీ ఆలోచనెప్పుడు.. నేనెవరిని అంటూ
ఆలోచించు.. చూద్దాం..!
నీ జీవితానికి సరిపడే సరైన అర్థం లభిస్తుంది.

– ఆర్కే జట్టి

# ఇంతకీ అదానీ కేసు ఏమైనట్లు ?



**మన ప్రధాని మోడీజీ!** అమెరికా పర్యటనపై ఆశలు పెట్టుకున్న వారందరి ఆశలు మీద నీళ్ళు చల్లిన వైనం కనిపించింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మన పీఎం నరేంద్ర మోడీని ఒక జర్నలిస్టు అమెరికాలో ఇండియన్ కార్పొరేట్ గౌతం అదానీపై నమోదు అయిన కేసు గురించి ప్రశ్నించాడు. అంతే మన పీఎం మోడీజీకి కోపం వచ్చేసింది. ఇద్దరు రెండు దేశాల అధినేతలు కలిసి (మోడీ,ట్రంప్) మాట్లాడుతున్న, సందర్భంలో వ్యక్తిగత విషయాలు మాట్లాడడం అనవసరమని, కోపంగా సమాధానం ఇచ్చారు!

**అదానీపై దాటేసే పద్ధతి !**

ప్రపంచంలోనే సంచలనం అయిన అమెరికాలో అదానీ మీద కేసు విషయంలో పీఎం దాటేసే పద్ధతిలో సమాధానం ఇవ్వడం, విషయం అంత ప్రాధాన్యత లేనిదిగా పేర్కొనడం శోచనీయం! ప్రపంచం అంతా ఈ సంభాషణ చూసింది! నిజానికి పీఎం మోడీ ఏ దేశానికి వెళ్ళినా అయన వెంట వెళ్ళడం, లేదా ఆ తర్వాత అక్కడికి వెళ్ళి ఏదో ఒక కాంట్రాక్టు సెట్ చేసుకుని రావడం చూస్తున్నాం! అదానీ విషయంలో ఎలాంటి ఆరోపణలు వచ్చినా మన పీఎం ఇంతవరకు జవాబు ఇచ్చింది లేదు! ఇక బీజేపీ నేతలు గా ఎంపీలు, మంత్రులు అయితే అదానీ పేరెత్తితే విదేశీ కుట్ర అంటారు.

**అదానీ మీద అంత ప్రేమ ఎందుకో!**

అదానీనీ కడుపులో పెట్టుకొని కాపాడుకుంటారు. సెబి చీఫ్ మాధవీ బుచ్ విషయంలోనూ, ఆమె మీద వచ్చిన అవినీతి అక్రమాల ఆరోపణల మీద కూడా అలాగే చేశారు. గౌతం అదానీకి దోచి పెట్టడంలో బీజేపీ నేతలు, ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. ఈ దేశానికి బుక్కెడు బువ్వ పెడుతున్న అన్నదాత, రైతన్నకు రుణమాఫీ చేయడానికి సిద్ధం కాని, కేంద్రం దేశంలోని కార్పొరేట్‌లకు 16 లక్షల కోట్ల రుణ మాఫీ చేయడం ద్వారా కూడా అదానికి ఎక్కువ భాగస్వామ్యం ఇచ్చింది! ఆదానికి ముంబై లోని దారవాహిని కూడా అప్పచెప్పే పని జరుగుతున్నది. ఒక రకంగా దేశంలోని వ్యాపార, వాణిజ్య వ్యవహారాలన్నీ, అదానీ చేతిలో పెడుతున్నారు. అలాంటి అదానిని ఎక్స్పోజ్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ దేశ ద్రోహి అంటారు. అయన మీద కేసులు పెడుతారు. అదానీ మీద వచ్చిన ఆరోపణల మీద జెపిసికి ఒప్పుకోరు! అమెరికాలో కూడా మన పీఎం మోడీ అదానీ విషయంలో అడిగిన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, ఎందుకు అలా? నిజానికి పీఎం మోడీ అక్కడ నుంచి అమెరికా అధ్యక్షుడితో మాట్లాడిన మాటల వివరాలను తెలుసుకోడానికి ఇండియా మొత్తం ఎదురు చూసింది. అమెరికా పర్యటన పై ఆశలు, భరోసాతో లక్షల మన భారతీయుల కుటుంబాలు ఎదురు చూసాయి. అమెరికా లో చదువులు ఉద్యోగాల కోసం వెళ్ళి సదరు నిర్ణీత విజా టైంలోపు తిరిగి రావాల్సిన వారు మన దేశంలో ఉద్యోగాలు లభిస్తాయి, అనే నమ్మకం లేక అక్కడ అక్రమంగా ఉంటున్న వారి సంఖ్య 7.5 లక్షల ఉందని అమెరికా చెబుతున్నది. వాళ్ళందరినీ వాపసు తెచ్చుకుంటామని, పీఎం చెప్పేశారు. అలాంటి వారిని వెతికి హ్యాండ్ కప్స్ వేసి, కాళ్ళకు గొలుసులు వేసి మరీ ఎంతో అవమాన కరంగా ఇండియాకు వారి సైనిక విమానాల్లో తరలిస్తున్న తీరు చాలా దుఃఖ దాయకం గా, ఒక స్నేహ పూరిత దేశంతో అతి అతి క్రూర వ్యవహారం అనక తప్పదు. ఈ విషయం ప్రస్తావన కూడా మోడీ చేయలేదు! మొన్న ట్రంప్ గెలిచిన తర్వాత ప్రమాణ స్వీకారానికి విదేశాంగ మంత్రి వెళ్లారు. పీఎం నరేంద్ర మోడికి ఆహ్వానం లేని కారణం గా అయన వెళ్ళలేదు. ఇటీవలి వెళ్లి వచ్చారు. దిగుమతి పన్నుల భారీ పెంపులు, అమెరికాలో భారీ ఉత్పత్తుల కేంద్రం అభివృద్ధి చేయడం, అక్రమంగా ఉంటున్న భారతీయులతోపాటు ఇతర దేశాల వారిని అమెరికాలోకి చొరబడకుండా బోర్డర్‌లలో సైన్యంతో కట్టుదిట్టం చేయడం, మరోవైపు గత దశాబ్దాలుగా అమెరికాలో పుట్టిన ఇతర, ఇండియా సహా పుట్టిన పిల్లలకు అక్కడి పౌరసత్వం లభించే హక్కును రద్దు చేయడం ఇలా ఎన్నో ట్రంప్ నిర్ణయాలు భారత్‌కు కూడా నష్టం కలిగిస్తున్నాయి. అయినా వాటి మీద మోడీ మాట్లాడలేదు! వీటి అన్నింటి మీద ట్రంప్‌తో మన పీఎం భేటీలో మాట్లాడే అవకాశం ఉంది అనుకున్నారు. మరీ ముఖ్యంగా అక్కడ చదువుకుంటున్న వారి కాస్తో, కూస్తో ఆర్థిక వెసలుబాటు కోసం పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్న వారు ఇప్పుడు ఆ ఉద్యోగాలు మానేశారు. భయం భయంగా ఉన్నారు. ఆగమాగం, ఆగం అవుతున్నారు. అమెరికాలో అక్కడ గ్రీన్ కార్డు పొంది స్థిర నివాసం ఏర్పరచుకున్నవారు మినహా, అక్కడ లీగల్గా పలు లీగల్ విజాల మీద వెళ్లి ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా కొంత టెన్షన్‌లోనే ఉన్నారు. ట్రంప్ ఎప్పుడు ఏమి, ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడు, తెలియని పరిస్తితి ఉంది. ఒకవైపు బ్రిక్స్ దేశాల పై ట్రంప్ వైఖరి నెగెటివ్ గా ఉంది. బ్రిక్స్ లో ఇండియా కూడా ఉంది. డాలర్ ను పోల్చితే మన రూపాయి 87కు పతనం అయిన పరిస్థితి ఉన్నది. దేశీయ ఆర్థిక పరిస్థితి, అప్పుల, ఎగుమతులు తగ్గి దిగుమతులు పెరిగిపోయాయి. దేశంలో ఉద్యోగాల కల్పన లేనేలేదు.

**షేర్ మార్కెట్ ధమాల్!**

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ అటు షేర్మార్కెట్ లో పెరిగటం వల్ల ఇండియన్ షేర్ మార్కెట్ ధమాల్ అయిపోయింది. షేర్ ల లో ఇన్వెస్ట్ చేసిన కోట్ల మంది మధ్యతరగతి కుటుంబం వాళ్ళు మునిగి పోయారు. జీతాలు పెరుగక కొనుగోలు శక్తి తగ్గిపోయింది. బతుకడం కోసం అప్పులు చేసే వారిలో పది మందిలో 8 మంది ఉన్నారు. ఈ కారణంగా నిరుద్యోగులు దేశంలో ఉపాధి కొరత వల్ల ఆస్తులు అమ్మి, అప్పులు చేసి , భూములు, బంగారం కుదువ బెట్టి అమ్మి తాము వెళ్ళే దారి అక్రమం అని తెలిసి కూడా నెలకు లక్షన్నర, రెండు లక్షలు జీతాలు దొరుకుతాయని, వెళ్లి పోతున్నారు. ఇజ్రాయిల్,రష్యాల కు వెళ్లి సైన్యాల లో చేరి, ప్రాణాలు కోల్పోతున్న వారు ఉన్నారు. ఏటా రెండుకోట్ల హామీ నెరవేరింది లేదు! ఈ పరిస్థితుల్లో ఈ అంతటి పరిస్థితులకు 2014 లో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ, పీఎం నరేంద్ర మోడీ అధికారం లోకి వచ్చారు. ఇలా ఇప్పుడు మూడో సారి పదకొండు ఏండ్లుగా అధికారం లో ఉన్నారు. వారిచ్చిన హామీ ప్రకారం 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలి, కాని చెప్పిన దానిలో ఐదు శాతం ఉద్యోగాలు ఇవ్వలేదు! రాలేదు. పైగా ఉద్యోగాల పరీక్ష పేపర్ల లీకులు!

**కనీస జీతం కరువు!**

కనీసం లభించిన యావరేజ్ ఉద్యోగం జీతం 20 వేల్ నుంచి 30 వేలు దాటని 80 శాతం మంది, ఇక ఉద్యోగం లేని వారి కూలీ బతుకుల నెల సంపాదన 6 నుంచి 10 వేలు దాటని పరిస్థితి, పోతే గల్ఫ్ లేకుంటే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్, దక్షణ ఆఫ్రికా ఇదీ టూకీగా మన దేశం లోని నిరుద్యోగుల పరిస్థితి! అమెరికా అధ్యక్షుడితో మన వాళ్లకు భద్రత కోసం, గౌరవం కోసం ఏమి మాట్లాడారు! చెప్పండి మోడీజీ!అమెరికా నుంచి వాపసు వస్తున్న మనవాళ్ళకి మీరిచ్చే గ్యారంటీ, చెప్పండి మోదీజీ! దేశ సంపదను కొల్ల గొడుతూ,లూటీ, చేసి లక్షల కోట్లకు ఎగబాకిన, ఇంకా దోచుకుంటున్న, కార్పొరేట్ గౌతం అదానిని కాపాడుతున్నారు. మీకు అధికారం ను వరుసగా మూడు సార్లు కట్టబెట్టిన భారత దేశం యువత భవిష్యత్తు కు గ్యారంటీ ఎందుకు ఇవ్వరు? దేశం ప్రశ్నిస్తుంది! మోడీజీ కుఛ్ తో బోలో!



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# మహా కుంభ ..మహా అనుభూతి ... మహా మోక్షం..!

భారత దేశంలో ఆధ్యాత్మిక, మతపరమైన సంప్రదాయాల్లో ఒక్కటైనా మహా కుంభమేళా గడసిన 35 రోజుల తర్వాత కూడా కోట్లాది జనంతో కిక్కిరిసి పోయింది. కిలోమీటర్ల దూరంలో ప్రయోగరాజ్ హర హర మహాదేవ శంభో శంకర అంటూ మార్మోగింది. మహా కుంభమేళాలో ఆరు రోజులు పవిత్రంగా మారాయి .ఒకటి పుష్య పౌర్ణమి రోజున తోలి స్నానం, మకర సంక్రాంతి రెండవ స్నానం, మూడవ స్నానం మౌని అమావాస్యరోజున, వసంత పంచమి రోజు నాల్గవ స్నానం , ఐదోస్నానం మాఘ పౌర్ణమి గంగా నది ఒడ్డున ఉన్న 44 ఘాట్‌లు పౌర్ణమి రోజున భక్తులతో నిండిపోయాయి. ప్రతి 12 సంవత్సరాలకు ఒక సారి పూర్ణ కుంభమేళా మహోత్సవం కనివిని రీతిలో ఘనంగా జరుగుతుంది. అందుకే గంగా నది ఒడ్డున దేశ వ్యాప్తంగా వచ్చిన భక్తులు "అన్య తీర్థోన్ మే ధ్యాన్ వా గ్యాన్, ఔర్ సంగమ్ మే మోక్ష కా స్నానం" అని చేస్తున్న పవిత్ర స్నానం ప్రత్యక్షముగా చూసి చలించిపోయాను. అక్కడ ఇసుకపోస్తే రాలని జనంను చూస్తే ఒళ్ళు పులకరించింది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ లాంటి పొరుగు రాష్ట్రాల నుండి యాత్రికుల ఎడతెరిపిలేని సమూహాలు నేను కన్నుల పండుగలా ఆస్వాదించాను. అక్కడ జనజాతర చూస్తే 'మేడారం సమ్మక్క' జాతరను వచ్చిన కోట్ల మంది భక్తులతో రోజు మేడారం జాతరకు వచ్చినట్టు నేను ఉన్న రెండు రోజులు రద్దీ చూస్తే అంచనా వేయవచ్చు.

కుంభమేళా మూడు రకాలుగా నిర్వహించుకుంటున్నాం. అర్ధ కుంభ మేళా, పూర్ణ కుంభమేళా,మహా కుంభమేళా. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సమయంలో మహా కుంభమేళా మొదలవుతుంది. అందుకే ఫిబ్రవరి 12న జరిగే మాఘి పూర్ణిమ స్నానం తర్వాత వారి రాక పెరుగుతుందనే అంచనా తో ఎక్కడికి అక్కడ రోడ్లను దిగ్బంధం చేసారు. నాగ సాధువులు, సీనియర్ సాధువుల రాకతో సందడిగా మారాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం కుంభమేళా పుష్య మాసం పౌర్ణమి సందర్భంగా మొదలై దాదాపు 45 రోజులు సాగి ఫిబ్రవరి 26తో ముగుస్తాయి. ఈసారి మహా కుంభమేళాకు ఎంతో విశిష్టత ఉన్నది. ప్రయోగరాజ్ లో నిర్వహించే మహా కుంభమేళా 144సంవత్సరాలకు జరగడం వల్ల ప్రతి మూడు తరాల్లో ఒక్కరికి మాత్రమే ఈ మహా ఉత్సవంలో పాల్గొనే అదృష్టం దక్కుతుందని ఆధ్యాత్మిక వేత్తలు చెప్పుతున్నారు. 1974 నుండి కుంభాలకు హాజరైనప్పుడు తాను ఎప్పుడూ చూడని అతిపెద్ద సనాతనుల సంఘాన్ని వీక్షించడానికి ఇది తనకు అవకాశం ఇచ్చిందని మీడియా సాక్షిగా మోడీ తెగ సంబరపడి పోయారు. ప్రధాని మోడీకి కుంభమేళా ప్రతి 12 ఏండ్లకు కాకుండా నాలుగు ఏండ్లకొకసారి జరిగితే బాగుండు అన్నట్లుగా ఆయన భావ ప్రకటనలో కన్పించింది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంత పటిష్టమైన బందోబస్తు నిర్వహించినప్పటికీ జనజాతరలో బారికేడ్లు ఇరిగి మూడవ అమృత స్నానం రోజు మౌని అమావాస్య భక్తులకు అచ్చిరాలేదు. దాదాపు 30మంది ప్రాణాలు గాలిలో కల్సినాయి. రెండు,మూడు సార్లు అగ్ని ప్రమాదం జరిగితే 16సెక్టార్, 19వ సెక్టార్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మహా కుంభమేళాలో భద్రతతో పాటు వాహనాలు సజావుగా వెళ్లేందుకు భారీ ఏర్పాట్లు చేసింది. నిన్న ఢిల్లీ రైల్వే స్టేషన్ లో జరిగిన దుర్ఘటన కలచి వేసింది. ఇక్కడికి వచ్చిన భక్తుల విశ్వాసం ఎంతబలంగా ఉందంటే తీవ్రమైన చలిని ,ఇతర అసౌకర్యాలను లెక్కచేయకుండా గంగా స్నానానికి వచ్చిన ఊహించని ప్రతిస్పందన నేను ఆలోచించేలా చేసింది. ఆధ్యాత్మికానికి దూరంగా ఉండే నేను ఇక్కడ స్నానం చేయడం అదృష్టంగా భావిస్తున్నానంటే అతిశయోక్తి కాదు.



డాక్టర్ సంగని మల్లేశ్వర్,
విభాగాధిపతి, జర్నలిజం శాఖ
కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్,
సెల్-9866255355



### కాటకల్సినం సారు

ఏం చెప్పిన దండగే సారు
మల్ల గోసకచ్చినయ్ మా బతుకులు..
శిల్కకు సెప్పినట్లు చెప్పినవ్
ఇనకపోతిమి...
సలి బువ్వ తిన్నట్లున్నది
ఇప్పుడన్న ఈ మట్లె పాలన తీరు...
నాట్లేసి మోపుకి ముద్దుగ పైసలిద్దువు....
పండుక్కి బతుకమ్మ సీరలిచ్చేది...
గురుకుల బల్లల్ల మా పోరగాండ్ల
కడుపు నిండేది....
నువ్వున్నప్పుడు కరెంటైతే పోవుడే మర్శింది...
ఆని క్యారెడ్డపు మాటలిని
నాలుగు పైసలెక్కువత్తయని అటు
ఓటేసినమని....
గింత ముంచుతడని మేమనుకోలే..
నువ్వు దిద్దుకచ్చిన మా సంసారాలే
ఇంత మంచిగుండే...
నువ్వు చెయ్యి వట్టుకొని నడిపించుకచ్చి
నిల్సోవెడితే...
ఇప్పుడున్నోడు చెయ్యలేక
అయింత బాయిల నూకిండు....
సెర్ల నీళ్లన్నీ మా కండ్లడ్లకచ్చినవ్..
వడ్లమ్ముదువోక కల్లాల్లన్ని ఊరవిస్కలకు
ఇండ్లాయే..
ఇట్ల చెప్పుకుంట పోతే సెరువు కట్టంత
పెద్దగున్నది మా దుఃఖం...
నాలగొద్దులుండి పోయే పానం నాది సారు..
నడీడు సుతం దాటని నా కొడుకుల బతుకు
మీదనే మా పుట్టెడు రంది..
తెలంగాణ కోసం తన్లాడినవ్ ఆఖరికి ఎట్లనో
పట్కచ్చినవ్..
ఇప్పుడు మేము మల్ల నువ్వు రావనన్నే
మొక్కుతన్నం..
ఇక మల్ల నిన్ను సూత్తనో లేదో...
బతికుంటేనైతే నా ఏలు మీద సిరా సుక్క
కారుకే సారు..

**(మా ఊర్ల అరవై యేండ్ల ముసలవ్వ సెప్పిన ముచ్చట..)**
**కేసీఆర్ గారికి తెలంగాణ ప్రజలందరి తరఫున పుట్టిన రోజు శుభాకాంక్షలు**




తుమ్మల కల్పన రెడ్డి
9640462142

# అచ్చ తెలుగు కృతులు-పరిశీలనం

డాక్టర్ కె.వి. సుందరాచార్యులు గారు మా గురువర్యులు. 1982 నుండి 1989 వరకు ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాచ్య కళాశాలలో చదువుతున్నప్పుడు వారు మాకు పాఠాలు చెప్పారు. పి.డి.సి మొదటి సంవత్సరంలో సంస్కృతం, రెండవ సంవత్సరంలో విద్యానాథుని ప్రతాపరుద్ర యశోభూషణం, పై తరగతుల్లో యయాతి చరిత్రను పాఠంగా చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చి ఉదయం అంతా ఏదో ఒక పని చేసుకుంటూ సాయంత్రం పూట కళాశాలకు వచ్చి చదువుకునే విద్యార్థుల సైకాలజీని గుర్తించి పాఠం చెప్పేవారు. విషయం ఎంత గంభీరమైన అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా వివరించేవారు. శిష్యుల పట్ల వాత్సల్యం కలవారు. నిరంతర మందస్మిత వదనులు. విద్యార్థులలో సృజనాత్మక రచనా వ్యాసంగాన్ని పెంపొందించడానికి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, పద్య పఠనం తదితర పోటీలను నిర్వహించేవారు. కళాశాల వార్షిక సంచిక నెలవంకకు హితవరులుగా వ్యవహరించేవారు. లక్షణ శాస్త్రాలను తాత్విక సిద్ధాంతాలను సరళ సుబోధకంగా వివరించేవారు.

డాక్టర్ కెవి సుందరాచార్యుల గారి అచ్చ తెలుగు కృతులు పరిశీలన అనే గ్రంథంలో 320 పుటలు, మూడు ప్రధాన విభాగాలలో విషయ వివరణ చేయబడింది. అచ్చ తెలుగు స్వరూప స్వభావాలను, పద్యాలలో వచ్చిన అచ్చ తెలుగు కావ్యాలు, రచనలు మూడో విభాగంలో భాషానువాద పద్ధతి అన్య దేశాలు మొదలైన వాటిని గురించి వివరించారు.




పాల్కురికి సోమనాథుడు రాసిన వృషాధిప శతకంలోని "బలుపొడ తోలు చీరయును...' అనే పద్యం అచ్చ తెలుగులో సాగిందన్నారు. నన్నయ,తిక్కన,నన్నుచోడు, శ్రీ నాథుడు, అల్లసాని పెద్దన మొదలైన వారు చెప్పిన పారిభాషిక చర్చలు చేసి చివరకు కేతన రాసిన ఆంధ్ర భాషా భూషణం లోని తత్సమము తద్భవము, అచ్చ తెలుగు, దేశ్యము గ్రామ్యము అని ఆయన చెప్పిన ఐదు భాగాలుగా ఆయన పదాలను వివరించారు. తత్సమంబు తక్క తక్కిన నాలుగు అచ్చ తెలుగులందు అఖిలజనులు అని చేసిన అచ్చతెనుగు విభాగమే ఆ కావ్య రచనా భాషకు సంబంధించినది అన్నారు. తల, నెల, వేసవి, గుడి మడి, పులి, చలి మొదలైన పదాలు అచ్చ తెనుగు అన్నారు. సంస్కృత సమాలు కానీ తక్కిన పదజాలంతా అచ్చ తెనుగే అని నిర్వచించి పొన్నెగంటి తెలగన తొలి తెలుగు కావ్యకర్తగా పేర్కొన్నారు. ఆయన రాసిన యయాతి చరిత్ర మొట్టమొదటి అచ్చతెలుగు రచనగా పేర్కొన్నారు. తెలుగులో 150కి మించి అచ్చ తెలుగు రచనలు లేవని, అందులోనూ 50కి పైగా నిఘంటువులే ఉన్నాయన్నారు. ముఖ్యంగా నిరోష్ఠ్య నిర్వచనాది నియమ భూయిష్టాల వల్ల 'చిత్రకవిత' అనే అపప్రథకు గురైందన్నారు. అందువల్లనే అది అనాదృత సాహిత్యంగా మిగిలిపోయింది అన్నారు, కాగా అచ్చతెలుగు రచనలు ఉత్సాహవంతులైన పాఠకుల మెదడుకు పదును పెడతాయని, కవుల పరిశ్రమ పాండిత్యం తెలుగు పదాలలోని జిగిబిగి వాటివల్ల తెలుస్తాయన్నారు. ఇలా తెలుగులో వచ్చిన అచ్చ తెలుగు కృతులపై సాధికార పరిశోధన చేసి వాటి విశేషాలను సమగ్రంగా, శాస్త్రీయంగా నిరూపించారు. ఇది కెవి సుందరాచార్యులు గారి పరిశోధన ప్రవణతకు అద్దం పడుతుంది.

తెలుగు సాహిత్య చరిత్రలో చాలా కాలం వరకు మరుగున పడిపోయిన అచ్చతెలుగు కృతులపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ఆనాడు నన్నయ అరణ్యపర్వ శేష భాగాన్ని ఎర్రన పూర్తి చేసినట్లు సాహిత్య చరిత్రలో మిగిలిన అచ్చ తెలుగు రచనలను చేర్చి సుందరాచార్యులు గారు సాహిత్య చరిత్రను సమగ్రం చేశారనటంలో సందేహం లేదు. ఇది వారి పరిశోధన ప్రత్యేకతగా చెప్పవచ్చు. రెండవది ఈ విషయంలో వారిదే పరమ ప్రామాణికమైన పరిశోధన గ్రంథం.

నేను పరిషత్తు ప్రాచ్య కళాశాలలో చదువుతూనే ఉదయం పూట నల్లకుంట లోని ఒక ప్రైవేటు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేసేవాడిని. విద్యార్థులలో మన భాషా సంస్కృతుల పట్ల విస్తృతమైన అవగాహన, ఆసక్తిని పెంపొందించడానికి 1988లో డాక్టర్ కె . వి. సుందరాచార్యులు గారిచే రామాయణం, అలాగే డాక్టర్ పి. వి. చలపతిరావు గారిచే ఆంధ్ర మహాభాగవతంపై ప్రసంగ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాను. ఈ సభకు వారు విచ్చేసి అద్భుతమైన ఉపన్యాసాలు ఇచ్చారు. ఇప్పటికీ ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు నాకు ఈ విషయాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తుంటారు. నా ఉత్సాహమే ఆ కార్యక్రమానికి పెట్టుబడి అయినా నా పట్ల శిష్య వాత్సల్యంతో విచ్చేసి ఆశీర్వదించారు. నా జీవితంలో అదొక తీపి గుర్తు. డాక్టర్ కె . వి.సుందరాచార్యుల గారికి మా పాలకుర్తి ప్రాంత పరిసరాలతో అవినాభావ సంబంధం ఉంది. విశాలాంధ్ర పూర్వ సంపాదకులు, వామపక్ష మేధావులు సి. రాఘవాచారి గారి జన్మస్థలం శాతాపురం మా మండలంలోనిది. రాఘవాచారి గారి తల్లి చనిపోయినప్పుడు సుందరాచారి గారు అక్కడకు వచ్చారు. అలాగే కోతులబాధ, లక్ష్మక్క పల్లి తదితర గ్రామాలలోనూ వారికి బంధువులు ఉన్నారు. 1997లో నేను రాసిన సాహితీ వైతాళికుడు పాల్కురికి సోమనాథుడు అనే పుస్తకానికి వారు ఆశీస్సులు అందించారు. ఈ సందర్భంగా హరిబావులి లోని వారింటికి రెండు మూడు సార్లు వెళ్లి వచ్చాను. చదువు పూర్తయి ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా సెలవులలో పరిషత్తు నిర్వహించే వివిధ సాహిత్య కార్యక్రమాలకు హాజరైనప్పుడు వారిని కలుస్తుండేవాడిని. ఎంతో వాత్సల్యంగా పలకరించేవారు. డాక్టర్ కె.వి. సుందరాచార్యులు గారు సహృదయ సంపన్నులు. ఉదార హృదయులు. నిర్మల, నిరాడంబర, సాత్విక, తాత్విక భావ సంపన్నులైన వారు 90వ పడిలోకి చేరుతున్న సందర్భంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.



డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్
99 891 48 305

# ప్రజా సమస్యలను తీర్చినప్పుడే సంతృప్తి

- నల్లగొండ ప్రజల కోసం ఎల్లవేళల నా గుమ్మం తెరిచే ఉంటుంది
- ఆర్ఆర్ఆర్ హైదరాబాదు రూపురేఖలు మార్చేస్తుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి






**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మంత్రిగా ఎంత బిజీగా ఉన్నప్పటికి నల్లగొండ నియోజకవర్గ ప్రజల కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని కొనసాగిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిఅన్నారు.ఆదివారం శ్రీనగర్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలోప్రజావాణి కార్యక్రమాన్ని మంత్రి నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆర్థిక ఇబ్బందులతో కాలేజీ ఫీజులు కట్టలేక, ఆసుపత్రుల్లో చికిత్స కోసం వచ్చిన అభ్యర్ధనలను మానవత్వంతోపరిష్కరించి, వారి మోముల్లో సంతోషం నింపారు.రాష్ట్ర కెబినేట్ మంత్రిగా రాష్ట్రవ్యాప్త బాధ్యతలతో ఈ మధ్య ప్రజావాణి కార్యక్రమం కొంత ఆలస్యం జరిగిందన్న మంత్రి చెప్పారు.ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమానికి అధికారులను ఎవరిని పిలవలేదని పేర్కొన్నారు.అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ చుట్టూరా నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు ఆర్ ఆర్ ఆర్ నిర్మాణంతో తెలంగాణ రాష్ట్ర ప్రగతి మరో మెట్టు ఎక్కుతుందని ఆయన అన్నారు.రీజినల్ రింగ్ రోడ్డు పనులకు ఉత్తర భాగానికి టెండర్లు పిలిచామని, దక్షిణ భాగానికి సంబంధించి డీపీఆర్ కు టెండర్లు పిలవడం జరిగిందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు. గతంలో వైయస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించడం, దానికి దగ్గర్లోనే రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ ను, ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నగరం నుంచి శంషాబాద్ సఎయిర్ పోర్ట్ కు13 కిలోమీటర్లు పొడవైన పీవీ నరసింహారావు ఫ్లైఓవర్ కట్టిన తర్వాత హైదరాబాద్ కు మల్టీనేషన్ కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు. బెంగళూరులో ఎయిర్ పోర్టు నుంచి ఐటీ కంపెనీలకు వెళ్లాలంటే ట్రాఫిక్ వలన రెండు మూడు గంటల సమయం పడుతుందని, హైదరాబాదులో అలాంటి సమస్య తలెత్తకుండా,ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.గత ఎన్నికల ముందు కేసీఆర్ ఔటర్ రింగ్ రోడ్డును కమిషన్ కోసం అమ్ముకున్నాడని విమర్శించారు. 30 వేల కోట్లతో రీజినల్ రింగ్ రోడ్డు పనులను ప్రారంభించాల్సి ఉన్న నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు.రీజినల్ రింగ్ రోడ్డు,ఔటర్ రింగ్ రోడ్డుకు నడమ నిర్మిస్తున్న రేడియల్ రోడ్స్‌తో తెలంగాణ రూపురేఖలు మారడంతో పాటు, హైదరాబాదు ట్రాఫిక్ సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు.దశాబ్దాల నల్గొండ జిల్లా సాగు,త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు శ్రీశైలం టన్నెల్ బేరింగ్ మిషన్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. అమెరికా నుంచి రాబిన్స్ బోరింగ్ కంపెనీ నుంచి వచ్చే మరో బేరింగ్ మిషన్ మద్రాసు పోర్టు వరకు వచ్చిందని తెలిపారు.రెండు సంవత్సరాల్లో శ్రీశైలం సొరంగం మార్గం పనులను పూర్తి చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శ్రీశైలం టన్నెల్,బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టులకు తగిన నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు.కెసిఆర్,కేటీఆర్ లతో పాటు కొంతమంది కులగణలో పాల్గొనకపోవడంపై విలేకర్లు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ రాష్ట్ర పౌరులుగా అందరూ సర్వేలో పాల్గొనలని హితవు పలికారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నల్లగొండ నియోజక వర్గ ప్రజలకు తాను ఎల్లవేళల రుణపడి ఉంటానన్నారు. ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు.నల్లగొండ సమగ్రాభివృద్దే తన ధ్యేయమని, అన్ని రంగాలలో నల్లగొండలో అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. ఇప్పటికే నల్గొండ పట్టణంతో పాటు నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను ప్రారంభించామని అవన్నీ పూర్తయిన తర్వాత నల్గొండ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్మల మోహన్ రెడ్డి,మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,నల్లగొండ, తిప్పర్తి, కనగల్ మాజీ జడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, పాశం రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, కనగల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనుప్ రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలను జాగిలంతో ఆకస్మిక తనిఖీలు



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో పలు ప్రదేశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని,ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు.గంజాయి మత్తు పదార్థాల నిర్మూలన గురించి, అక్రమ రవాణా జరగకుండా నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ముఖ్యంగా కిరాణా షాపులలో, అనుమానంగా ఉన్న పంట పొలాల్లో, కొరియర్ సెంటర్లలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.ప్రజలు, ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు వినియోగిస్తున్న లేదా రవాణా చేసిన, సరఫరా చేసిన వెంటనే డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుతది అని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ కానిస్టేబుల్ శ్యామప్ప, నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేష్ పాల్గొన్నారు.

## స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్‌కు గిరిజనుల వినతి




**న్యాల్‌కల్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మండల కేంద్రం న్యాల్ కల్ లో సంత్ సేవాలాల్ మహారాజ్ జ్ఞాపకార్థం భవన నిర్మాణం కోసం ప్రత్యేకంగా స్థలాన్ని కేటాయించాలని కోరుతూ జహీరాబాద్ నియోజకవర్గం లంబాడీల ఐక్యవేదిక అధ్యక్షుడు జాదవ్ శేఖర్ విన్నవించారు. సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి సందర్భంగా శనివారం న్యాల్ కల్ తహసిల్దార్ భూపాల్ కు విన్నవించారు. న్యాల్ కల్, ముంగి, రుక్మాపూర్,తదితర తండాలకు చెందిన గిరిజనులు తాహసిల్దార్ కు విన్నవించారు. కార్యక్రమంలో రాథోడ్ సక్కులాల్, రాథోడ్ చందర్, రాథోడ్ ప్రేమ్ సింగ్, గోవర్ధన్, మారుతి, తారా సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ అవసరమని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.స్థానిక ఎంవిఆర్ పాఠశాల వార్షికోత్సవం లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు పిల్లలకు ర్యాంకులు ముఖ్యం కాదని జ్ఞానం నేర్పించాలన్నారు.స్కిల్స్ అభివృద్ధి చేసుకుంటే ఉద్యోగాలు సాధించవచ్చునన్నారు.ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మెడిసిన్ ఐఐటి తో పాటు ఉన్నత చదువులకు పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు.డ్రగ్స్ సెల్ ఫోన్ లకు చిన్నారులను దూరంగా ఉంచాలని కోరారు.నల్గొండ ఔటర్ రింగ్ రోడ్డుకు మార్చి నుంచి పనులు ప్రారంభమవుతాయన్నరు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ విద్యాసంస్థల చైర్మన్ కొలనుపాక గీతరవికుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి వైస్ చైర్మన్ రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## హెచ్-సిటీ పనులకు స్థల పరిశీలన

- పలు విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ ఇలంబర్తి పర్యటన



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి జోన్‌లో పలు అభివృద్ధి పనులకు ఆదివారం జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి స్థల పరిశీలన చేశారు. ఇంటర్ డిపార్ట్మెంట్ కన్వర్జెన్సీ పర్యటనలో భాగంగా హెచ్ఎండిఎ, వాటర్ వర్క్స్, టియస్ఐఐసి పోలీస్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలన చేసారు. వారితో పాటుగా జోనల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్, ప్రాజెక్టు మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ అధికారులతో పలు ప్రాంతాల్లో ప్రతిపాదించిన పనుల స్థల పరిశీలన చేసారు. హెచ్-సిటి ద్వారా ప్రతిపాదించిన ఫ్లై ఓవర్లు,రోడ్డు విస్తరణతో పాటుగా జంక్షన్ ఇంప్రూవ్మెంట్ పనుల ప్రతిపాదన పనులను ఈ సందర్భంగా పరిశీలించారు. జంక్షన్ వద్ద హెచ్-సిటి ప్రతిపాదన పనుల వద్ద యుటిలిటీ తొలగింపుతో పాటు స్థల సేకరణకు చర్యలు తొందరగా తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత విభాగాల అధికారులతో కలిసి కమిషనర్ బస్సులో ప్రయాణించి ప్రతిపాదిత పనుల వద్ద ఆయా శాఖలకు సంభందించిన యుటిలిటీ విద్యుత్, వాటర్ వర్క్స్, టెలిఫోన్ వైర్లు వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను కోరారు. హెచ్-సిటి పనుల టెండర్ ప్రక్రియ తుది దశలో ఉన్న నేపథ్యంలో పనులను కొనసాగించేందుకు యూటిలిటీలు తొలగింపు చర్యలు ముమ్మరంగా తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆయా హెచ్ ఓడి లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం హెచ్-సిటి పనులను ప్రతిష్టాత్మకంగా అమలు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా హెచ్-సిటి ద్వారా ప్రతిపాదించిన పనులైన ఖాజాగూడ జంక్షన్, సీపీ ఆఫీస్ గచ్చిబౌలి జంక్షన్, త్రిపుల్ ఐటీ జంక్షన్, విప్రో జంక్షన్, కాంటిన్జెంట్ జంక్షన్, డిఎల్ఎఫ్ రోడ్డు మజీద్ బండ (బొటానికల్ గార్డెన్), చందానగర్ రైల్వే స్టేషన్, లింగంపల్లి ఫ్లైఓవర్, శ్రీదేవి టాకీస్ గంగారం రోడ్డు, ఆల్విన్ ఎక్స్ రోడ్ తదితర ప్రతిపాదించిన పనుల స్థల పరిశీలన చేసిన జిహెచ్ఎంసి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర పురపాలక శాఖ డిప్యూటీ సెక్రటరీ ప్రియాంక, వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి, జాయింట్ సి పీ డెవిస్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, టియస్ పి డి సి ఎల్ అధికారులు శేఖర్, పాండ్యన్, జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, వేణు గోపాల్ రెడ్డి, టి యస్ ఐఐసి ఎండి విష్ణువర్ధన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, జోనల్ సిపి, ఏసిపి, ప్రాజెక్టు ఈఈలు, డిప్యూటీ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి




**వనపర్తి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకోవాలని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా, పట్టణ, మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు వృక్షార్చాన చేపట్టి విరివిగా మొక్కలు నాటి మరో హరితహారానికి శ్రీకారం చుట్టాలని, అదేవిధంగా వివిధ సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు,అన్నప్రసాద వితరణ, దేవాలయాలలో,చర్చి,మసీదుల్లో ప్రార్థనలు చేపట్టాలని నిరంజన్ రెడ్డి సూచించారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

- జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏఎస్ఐ అంజలయ్య



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో ఏఎస్ఐ అంజీలయ్య ఆధ్వర్యంలో అదివారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖలు నిర్వహించారు. వాహనదారులకు బ్రీత్ అనలైజర్ తో డ్రంకన్ కండిషన్ తనిఖీ చేసి 06 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణ ఏఎస్ఐ ఆంజిలయ్య మాట్లాడుతూ..వాహనదారులు మద్యం సేవించి నడపరాదని, నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందని తెలిపారు.వాహనదారులు మద్యం సేవించి నడపరాదు వారికి సూచించారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా తో పాటు జైల్ శిక్ష విధించడం జరుగుతుందని, మద్యం సేవించిన కేసులు పునరావృత్తం అయితే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని దాంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారక్కలను దర్శించుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



**శివ్వంపేట, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** లక్ష్మాపూర్ చౌరస్తా మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో వెలసిన సమ్మక్క -సారలమ్మ జాతర ఉత్సవాలు దిమ్మేల నిర్వాహకులు శశికళ నర్సింలు దంపతుల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది నిర్వహించడం అనవాయితిగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది గత రెండు రోజులుగా సమ్మక్క సారలమ్మ జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం జరిగిన అమ్మవార్ల కళ్యాణానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె గద్దెలపై కొలువైన అమ్మవార్లను దర్శించుకొని వారికి బంగారం నైవేద్యంగా బెల్లం ను సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆమె మొక్కలు చెల్లించుకున్నారు. అలాగే అమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించిన వారిలో మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రగౌడ్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణా గౌడ్, పార్టీ నాయకులు గూడూరు యదాగౌడ్, నర్సింహా రెడ్డి, మండల పరిషత్ కో- ఆప్షన్ సభ్యులు లాయక్, ప్రభాకర్ రెడ్డి, కుంట లక్ష్మణ్ లు ఉన్నారు. అదేవిధంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పదిలమైన ప్రణాళికతో పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం

- మెరుగైన ఫలితాల కోసం విద్యాశాఖ కసరత్తు
- మార్చి నెలలో జరిగే ఎస్సెస్సీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం
- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధికారులు అడుగులు
- ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలు చేస్తున్న విద్యాశాఖ
- జీపీఏ-10/10 సాధిస్తే చరవాణిని అందిస్తా..
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ప్రత్యేకంగా విద్యార్థులకు ప్రోత్సాహం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** పదో తరగతి పరీక్షలు వస్తున్నాయంటేనే విద్యార్థుల్లో ఏదో భయాందోళన విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ముందు నుంచే ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవడం వల్ల ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడంతోపాటు మంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచుకోవడానికి వీలుంటుంది. ఈ దిశగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, డీఈఓ రమేష్ కుమార్ జిల్లావ్యాప్తంగా పలు ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులు ఉపాధ్యాయులతో చర్చించి ఉత్తీర్ణత శాతం పెంచేలా ఎలాంటి కార్యక్రమాలను నిర్వహించాలనే అంశాలపై సమీక్షా సమావేశాలను నిర్వహించి విద్యార్థులకు ప్రోత్సాహాన్నిస్తూ సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు దిశ నిర్దేశం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పాఠశాలల సందర్శన సందర్భంగా పదో తరగతి ఫలితాల్లో 10/10 సాధించిన విద్యార్థులకు మొబైల్ ఫోన్లను అందజేస్తానని కలెక్టర్ సైతం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థుల్లో నెలకొన్న సమస్యలు, భయాందోళనలు పోగొట్టేలా పలు అవగాహన కార్యక్రమాలను సైతం నిర్వహిస్తూ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు.

### తల్లిదండ్రులతో సమావేశాలు :

ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రుల బాధ్యతను విద్యార్థులకు ఇంటి వద్ద చదివేందుకు వాతావరణం కల్పించాలని వారికి సూచిస్తున్నారు.

### విద్యాశాఖ అధికారులు అవగాహన

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్ ప్రతిరోజు జిల్లాలోని ఉన్నత పాఠశాలలను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ 100శాతం ఉత్తీర్ణతపై దిశానిర్దేశం చేస్తున్నారు.

### మెరుగైన సాధనే లక్ష్యం

గతంలో పాఠ్యాంశాలను బోధించనప్పటికీ ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో ఉపాధ్యాయులు ప్రతిరోజు విద్యార్థులకు వివరిస్తూనే లక్ష్యసాధనకు అడుగులు వేస్తున్నారు. దీంతో పరీక్షలకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నామనే మాటతో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం అని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.

### వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : ఏ. రమేష్ కుమార్, డిఇఓ, నాగర్ కర్నూల్ జిల్లా

పరీక్షా పత్రాలను అవగాహన చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలి. చదివిన విషయాలను రివిజన్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవాలి.పదో తరగతి పరీక్షలో సబ్జెక్టుకు 80మార్కులకు ఒకే పేపర్ నిర్వహించడం జరుగుతుంది.ఇప్పటికే నిర్వహించిన మాదిరి పరీక్షా పత్రాలను అధ్యయనం చేస్తూ ప్రణాళికబద్ధంగా విద్యార్థులు సిద్ధం కావాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. విద్యార్థులు మంచిగా పరీక్షలు రాసి వందశాతం ఫలితాలు సాధించాలి. శ్రమనీ ఆయుధం.. అయితే విజయం మీ బానిస అవుతుంది.

## రాళ్లతో దాడి ఘటనలో గాయపడిన బాలిక మృతి



**మునిపల్లి, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** పక్కింటి వారితో జగడం చిలికి చిలికి పెద్దదై రాళ్ళ దాడికి దారి తీసింది. ఈ ఘటనలో 15 సంవత్సరాల వయసు గల బాలిక మృతి చెందింది.ఈ ఘటన మునిపల్లి మండలం అంతారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన దూదేకుల ఇస్మాయిల్ ఈ నెల 11న రాత్రి 7.30 సమయంలో తన ఇంటి ముందు మూత్ర విసర్జన చేసి వస్తుండగా అక్కడే వున్న వీరారెడ్డి,విజయరెడ్డిలు తన ఇంటి ప్రక్కన ఎందుకు మూత్రం పోశావని ఇస్మాయిల్ చొక్కా పట్టుకుని కొట్టారు.తన తండ్రిని కొట్టవద్దని ఇస్మాయిల్ కూతురు అలియాబేగం (15)అడ్డు వచ్చింది.వారు బాలిక అని చూడకుండా రాళ్లతో కొట్టారు.ఆమె పరుగేత్తుతూ క్రింద పడింది దీనితో ఆమెకు బలమైన గాయాలు కావడంతో పెద్దచెల్మెడాలోని ఆర్ ఎంపీ వద్ద చికిత్స చేయించారు. అనంతరం బుదేరా సాయిరాం ఆసుపత్రిలో వైద్యం చేయించారు. అక్కడ నుంచి సంగారెడ్డిలోని వెల్నెస్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్టు ఎస్సై రాజేష్ నాయక్ తెలిపారు.అలియాబేగం కంకోల్ జడ్పీహెచ్ ఎస్ ఉర్దూ మీడియంలో పదవతరగతి చదువుతుంది.

## కుల గణన సర్వే నమోదుకు మరో అవకాశం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** తెలంగాణ ప్రభుత్వం గత ఏడాది నవంబర్ లో చేసిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల గణన సర్వేలో వివిధ కారణాలవల్ల పాల్గొనని వారు తేదీ 16 ఫిబ్రవరి 2025 నుంచి తేదీ 28 ఫిబ్రవరి 2025 వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర వివరాలను నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం మరొకసారి అవకాశాన్ని కల్పించిందని పురపాలక కమిషనర్ తాటి మల్లికార్జున్ గౌడ్ తెలియజేశారు. మున్సిపాలిటీ ఆఫీసులో ప్రజా పాలన సేవా కేంద్రం ఏర్పాటు చేయడమైనది దరఖాస్తుదారులు నేరుగా సేవా కేంద్రానికి వచ్చి లేదా http://seeepcsurvey.cgg.gov.in లింక్ ఓపెన్ చేసి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 040 -21111111 కు నేరుగా కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

## ముగిసిన రేగోడు ప్రీమియర్ లీగ్



**రేగోడ్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** రేగోడు మండలంలోని క్రికెట్ ఆటలు మేలింగ్ వజ్రాలను వెలికి తీసే లక్ష్యంగా నిర్వహించినటువంటి రేగోడు ప్రీమియర్ లీగ్ ఆదివారం అట్ట ఆసంగా ముగిసింది. ఈ రెండు రోజులు నిర్వహించిన పోటీలకు 6 ఫ్రాంచైజీలు రాగా రెండు రోజులు లీక్స్ నీ నిర్వాహకులు నిర్వహించారు. వరల్డ్ వైడ్ ప్రీమియర్ లీగ్ స్థాయిలో ఆటగాళ్లను ముందుగా రిజిస్ట్రేషన్ చేయించి వారిని పద్ధతిగా వేలంపాటలు సైతం కొనుగోలు ప్రక్రియను నిర్వహించి ఫ్రాంచైజీలు ఆటగాలను తీసుకున్నారు. ఈ రేగోడు ప్రీమియర్ లీగ్ సీజన్ వన్ లో ఫైనల్ కీ ఇమేజ్ ఫోటోగ్రఫీ మరియు పవర్ డీజే 97 ప్లస్ టీమ్స్ రాగా ఇమేజ్ ఫోటోగ్రఫీ ఫైనల్ కప్ కైవసం చేసుకుంది. ట్రోఫీ బహుకరణ కార్యక్రమానికి మండలంలోని పలువురు రాజకీయ నాయకులు హాజరై విన్నర్లకి ట్రోపీని బహుకరరించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాంచైజీ ఓనర్స్ అఖిల్ మియా, పూర్ణచందర్, లడ్డు లక్ష్మణ్, నరేష్, దిగంబర్, సంతోష్ రావు, నిర్వాకులు కర్ణకోటి మహేష్, కొండాపురం మధు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మానవపాడు, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** చిన్ననాటి స్నేహితులను కలవడానికి ప్రత్యేకంగా ఆస్ట్రేలియా నుండి ఓ పూర్వపు విద్యార్థి వచ్చిన విశేషం జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలో కనిపించింది. 36 ఏళ్ల తర్వాత %బాజ% 1989 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వపు విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ బ్యాచ్ లో సుమారు విద్యార్థులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా గెట్ టు గెదర్ కార్యక్రమానికి ఆస్ట్రేలియా నుండి నేరుగా ఈ కార్యక్రమానికి అమరవాయి గ్రామానికి చెందిన అరుణ అనే పూర్వపు విద్యార్థి వచ్చింది... ఇక్కడి వాతావరణం... ఆనాటి జ్ఞాపకాలు, విద్యార్థులు చెప్పిన బోధనలు, దేశ సంస్కృతిని ఎప్పటికీ మర్చిపోలేమని, దేశం విడిచిన ఇక్కడి జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ గుర్తుంటయన్నారు. పూర్వపు విద్యార్థుల సమ్మేళనమును కేవలం ఆమె కోసమే గత ఐదేళ్లుగా వెయిట్ చేసినట్లు ఆ విద్యార్థులు తెలిపారు. అందరం కలవడం సంతోషంగా ఉందని ఒకరినొకరు జ్ఞాపకాలు మెమరీ వేసుకుంటూ స్వీట్లు తినిపించుకున్నారు. ఆ నాటి ఉపాధ్యాయులు సీతారామయ్య, వెంకటాచలం, ఈశ్వర్ రెడ్డి, నాగన్ గౌడ్, బజారన్న, శాంతిభూషణ్, ప్రస్తుత హెడ్మాస్టర్ శివప్రసాద్, ఆనాటి అటెండర్ వెంకట్రామున్ని ఘనంగా పూర్వపు విద్యార్థులు సన్మానించుకున్నారు.

## ప్రజా పాలన కేంద్రాల్లో సర్వే సమాచారం అందజేయాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** సమగ్ర ఇంటింటి సర్వేలో నమోదు చేసుకొనివారు ప్రజా పాలన కేంద్రాల్లో సమాచారం అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు16 (ఆదివారం) ఐనప్పటికి ప్రజా పాలన సేవా కేంద్రాలు పనిచేస్తున్నాయని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు సామాజిక, ఆర్టిక, విద్య, ఉపాది, రాజకీయ కుల సర్వేలో పాల్గొనని వాళ్లకు మరొక అవకాశం కల్పించామన్నారు. టోల్ ఫ్రీ, ప్రజాపాలన సేవా కేంద్రాలు, ఆన్లైన్ ఫామ్ డౌన్లోడ్ చేసి సమర్పించడం ద్వారా పాల్గొన వచ్చని తెలిపారు. ఎంపీడీవోలకు సూచనలు చేస్తూ తెలంగాణలో తొలిసారి చేపట్టిన సామాజిక, ఆర్టిక, విద్య, ఉపాది, రాజకీయ కుల సర్వేలో ఎవరైతే వివిధ కారణాలచే పాల్గొనలేదో అటువంటి వారి కోసం మరోసారి సర్వే కొరకు అవకాశం ఉంటుందని, ఈ నెల 16 నుంచి 28 వరకు అవకాశం కల్పిస్తామని , ఇందుకు గాను టోల్ ఫ్రీ, నెంబర్ 04021111111 కు ఫోన్ చేయవచ్చు అని లేదా మున్సిపల్ ఆఫీసు లో ఉన్న ప్రజాపలన సేవాకేంద్రాల ద్వారా లేదా ఆన్లైన్ ఫామ్ డౌన్లోడ్ చేసుకొని వివరాలు నింపిన తరువాత వాటిని ప్రజాపలన కేంద్రాలలో ఇచ్చి తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ఈరోజు నుండి 28 వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 05.00 గంటలవరుకు అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లోని ప్రజా పాలన సేవా కేంద్రాలు తెరిచి ఉంటాయని తెలిపారు. ఈ ప్రజా పాలన సేవా కేంద్రాల్లో ఈ అవకాశాన్నిఇంతకు ముందు సర్వే లో పాల్గొనని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు . ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మెదక్ ఎంపీడీవో రఘు సంబంధిత పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యవార్లు దిద్దిన బడి..!

- సర్కారు బడి... సరికొత్త ఒరవడి
- నాడు పురాతనం.. నేడు అధునాతనం
- అభివృద్ధి బాటలో ముక్టాపూర్ బడి
- బడి గోడలపై సృజనాత్మక చిత్రాలు
- సొంత విధులతో పాఠశాల అభివృద్ధి
- అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు

**తరగతి గోడలే విద్యార్థులకు పాఠాలు బోధి స్తున్నాయి. ప్రాథమిక విద్యను అభ్యసించే చిన్నారులకు అర్థమయ్యే రీతిలో పాఠశాల గోడలపై చక్కని చిత్రాలను గీయించారు. ఒకసారి చెప్పినదాని కంటే ప్రత్యక్షంగా చూసింది మనసులో బలంగా నాటుకుంటుంది. రోజు అదే చిత్రం మనకళ్ల ముందు కనిపిస్తే అందులోని అంశాలను ఎప్పుడు అడిగినా టక్కున చెప్పేయవచ్చు.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల గోడలు పాఠ్యాంశాలతో నిండిపోయాయి. బడిలో ఉండే వాతావరణం సృజనాత్మకతను తట్టిలేపు తుంది. బడి గోడలపై వేయించిన చిత్రపటాలు విజ్ఞానం పెంచుతున్నాయి.**








**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్ గిద్ద మండలంలో గల మారుమూల గ్రామంలోని ముక్టాపూర్ ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల గతంలో పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో స్థానిక విద్యార్థులు పాఠశాలకు రావడానికి ఇబ్బంది పడేవారు. గత సంవత్సరం జూలైలో బదిలీపై నలుగురు ఉపాధ్యాయులు బాబు శెట్టి, రమేష్, లింగమేశ్వర్, సంగమేశ్వర్ ముక్టాపూర్ పాఠశాలకు వచ్చారు. అక్కడ పరిస్థితులను చూసి ఎలాగైనా పాఠశాల రూపు రేఖలు మార్చాలని సంకల్పించారు. వెంటనే ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్థుల కృషితో కొత్తరూపు సంతరించుకొంది. తరగతి గదులను వినూత్నంగా తీర్చిదిద్దారు. సరి కొత్త పద్ధతులతో బోధిస్తుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం అక్కడ 65 మంది విద్యార్థులు ఉన్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్థుల సహకారంతో పాఠ శాల రూపురేఖలను పూర్తిగా మార్చి వేశారు. అందరికీ అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు శుద్ధి చేసిన తాగునీరు తదితర సదుపాయాలు కల్పించారు.

### ప్రైవేటుకు ధీటుగా...

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన ఉండేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. 'మీ పిల్లల్ని బడికి పంపండి.. వారి భవిష్యత్తుకు మాది పూచీ' అని తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తూ పాఠశాల ఎన్రోల్మెంట్ను పెంచుతున్నారు. పాఠశాలలో విభిన్న కార్యక్రమాలను ఆదర్శంగా నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులు, దాతల అభిమానాన్ని చూరగొంటున్నారు.

### ఆకట్టుకునే విధంగా..

పాఠశాలలో విద్యాబోధన చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఆధునిక పద్ధతులను అనుసరిస్తున్నారు. విద్యార్థులను ఆకట్టుకునేలా తరగతి గదుల గోడలపై దేశనాయకులు, జంతువుల చిత్రాలు, అచ్చులు, హల్లులు, పదాలు, గుణింతా లను ఉపాధ్యాయులు పొందుపరిచారు. వివిధ రకాల కార్డులు, తయారు చేసిన బొమ్మలతో పాఠ శాలను అందంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో విద్యార్థులు చదువుపై ఆసక్తి చూపుతున్నారు.

### ఆడుతూ.. పాడుతూ..

గోడలపై పాఠ్యంశాలు జ్ఞానానికి సంబంధిం చిన అంశాలు విద్యార్థులు ఆడుతూ.. పాడుతూ. చదువుకునేందుకూ సహకరిస్తున్నాయి. అంతేకాకుండా వారిలో పాఠశాల అంటే ఉన్న భయాన్ని తొలగిస్తుంది. తరగతి గదిలో పాఠం అర్థం కాకపో యినా చిత్రాలను చూసి కొంతైనా అవగాహన కలుగు తుంది. పది సూక్తులను చదివితే అందులో వారికి ఒక్కటి గుర్తున్నా ఫలితం సాధించినట్టే.

### సొంత ఖర్చుతో..

ఓ వైపు అక్షరాలు నేర్పిస్తూనే మరో వైపు పాఠశాల రూపు రేఖలు మార్చాలని నలుగురు ఉపాధ్యాయులు సంకల్పించారు. రూ. లక్ష 20 వెల సొంత ఖర్చుతో బడికి రంగులు వేయించి పిల్లలకు అవసరమయ్యే బొమ్మలు వేయించారు. అలాగే పాఠశాలలో రూ. 20 వెలతో సీసీ కెమెరాలు, రూ. 9 వెలు వెచ్చించి మిషన్ భగీరథ నీళ్ల సౌకర్యం కల్పించారు. గ్రామస్తులు, కొంతమంది ఉద్యోగుల సహకారంతో పాఠశాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

### పాఠశాల అభివృద్ధికి సమష్టి కృషి



ఉపాధ్యాయులు, గ్రామ స్థుల సహకారంతో పాఠశాలను అభివృద్ధి చేస్తున్నాం. పాఠశాలకు ఏ సదుపాయం అవసరమైనా గ్రామస్థులకు చెబుతాం. తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలకు అవసరమయ్యే వసతులను సొంత ఖర్చులతో ఏర్పాటు చేశాం. ప్రాథమిక స్థాయి పిల్లలకు పది సార్లు నోటితో చెప్పడం కన్నా ఒక్కసారి బొమ్మలతో చూపించి చెబితే మదిలో జ్ఞాపకం ఉండిపోతుంది. ఈ ఉద్దేశంతోనే తమవంతుగా ఈ విధానం చేపట్టాం. విద్యార్థులకు తనకున్నంతలో సేవచేసి పాఠశాలను ఆదర్శంగా నిలవటమే లక్ష్యం. వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య మరింత పెంచేందుకు కృషి చేస్తాం.

**బాబుశెట్టి, ప్రధానోపాధ్యాయుడు**

## భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలి

- సమన్వయంతో జాతరను విజయవంతం చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** పెద్దగట్టు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గించకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. ఆదివారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని దురాజ్ పల్లిలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరావుతో కలిసి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండవ అతి పెద్ద జాతర పెద్దగట్టు జాతర అని అన్నారు. ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు అందరు సమన్వయం చేసుకుంటూ భక్తులకి దైవ దర్శనం అందేలా చూసి జాతర విజయవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. భక్తులకు త్రాగునీరు నిరంతరం సరఫరా చేయాలని, భక్తులు ఇబ్బందులు పడకుండా, దుమ్ము లేవకుండా ట్యాంకర్లతో నీరు చల్లాలని, పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని సూచించారు. ఆదివారం రాత్రి కేసారం నుండి దేవరపెట్టేను పెద్దగట్టు పైకి తీసుకొచ్చి గుడి చుట్టూ గంపల ప్రదర్శన చేయటంతో జాతర ప్రారంభం అవుతుందని తెలిపారు. ఎవరైనా భక్తులు తప్పిపోతే కంట్రోల్ రూమ్ వద్దకి వచ్చి తెలియజేస్తే మైక్ ద్వారా ప్రకటించటం జరుగుతుందని తెలిపారు. జాతరలో చిన్న పిల్లలతో పని చేయించడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా దుకాణాలలో చిన్న పిల్లలతో పని చేయిస్తే చర్యలు తీసుకోవటం జరుగుతుందని, అలాంటి వారిని గుర్తించాలని కార్మిక శాఖ అధికారులకి సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఆర్డిఓ వేణు మాధవ్, తహశీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి,కృష్ణయ్య, ఆంజనేయులు, అమీన్ సింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మట్టి మాఫీయా దౌర్జన్యాన్ని అరికట్టాలి



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో మట్టిమాఫీయా దందాలు అరాచక దౌర్జన్యాలు మితిమిరిపోతున్నాయని జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీ తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నాడు బాయ్స్ హై స్కూల్ గద్వాల పట్టణంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి అఖిల పక్ష నాయకులు మాట్లాడారు. ఈసందర్భంగా ఎల్కూర్ గ్రామం లో మట్టి టిప్పర్ల సంఘటన దౌర్జన్యం జరిగిన సంఘటన లో పెద్దపల్లి అజయ్ పాత్ర ఒక ఉదాహరణ మాత్రమే నని జిల్లా లో మట్టి, ఇసుక, భూ కబ్జా రౌడిజం ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నాయని మండిపడ్డారు . దీని వెనుక అధికార ప్రతినిధి, పోలీసుల అండ దండలు పుష్కలంగా ఉన్నందున మితి మీరుతున్నాయని పేర్కొన్నారు. దీనిపైన కలెక్టర్,ఎస్పీ,డీఎస్పీ నిర్లక్ష్యం చేయకూడదు తక్షణమే భూ కబ్జా, మట్టి మాఫీయా చేస్తున్న గుండాలపై రౌడ్ సీట్ కేసులు పెట్టడం తో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఏల్కూరు రంగన్న లాంటి ప్రజా ఉద్యమకారులకు రక్షణ కల్పించాలినీ గద్వాల అఖిలపక్ష కమిటీ, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకటరాములు, సిపిఐ ఆంజనేయులు, సిపిఎం వెంకటస్వామి, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ శంకర ప్రభాకర్, పౌర హక్కుల సంఘం ఎండి సుభాన్, టవర్ మక్బుల్, ఎల్కుర్ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

# కూతురిని ప్రేమించాడని యువకుడి హత్య

- నిజాంపేట్ మండలంలో దారుణం
- మృతదేహాన్ని ముక్కలు చేసి, పెట్రోల్‌తో దహనం
- పోలీస్ స్టేషన్లో లొంగిపోయిన అమ్మాయి తండ్రి గోపాల్





**నారాయణఖేడ్, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** పరువు హత్య కలకలం రేపిన ఘటన సంగారెడ్డి జిల్లా, నిజాంపేట్ మండలంలో చోటుచేసుకుంది. ఇద్దరు సంతానం కలిగిన ఓ యువకుడు 9వ తరగతి చదువుతున్న ఓ మైనర్ బాలికను ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్న విషయాన్ని తెలుసుకున్న బాలిక తండ్రి యువకున్ని ముక్కలు, మొక్కలు చేసి, అనంతరం మృత దేహంపై పెట్రోల్‌తో దహనం చేసి పోలీసులకు లొంగిపోయాడు. నారాయణఖేడ్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 9వ తరగతి చదువుతున్న తన కూతురుని ప్రేమిస్తున్నాడని నిజాంపేట మండలం రామచంద్ర తాండకు చెందిన అంగోత్ దశరథ్ (30) అనే యువకుడిని, మేఘ్యు నాయక్ తాండకు చెందిన గోపాల్ అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. అనంతరం ఎవరికి అనుమానం రాకుండా మృతదేహాన్ని మేఘ్యు నాయక్ తాండ శివారులో కొండల మధ్యన పెద్ద లోయల్లో శవాన్ని మొక్కలు ముక్కలుగా నరికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు అంగోత్ దశరథ్ తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా అసలు విషయం తెలిసింది. గోపాల్ ను అదుపులోకి తీసుకొని విచారించగా తానే చంపేనని ఒప్పుకుని శనివారం నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్లో లొంగి పోయాడు. నిందితుడు గోపాల్ ను సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. పోలీసులు కాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. మృతుడి భార్య భార్య సోనీ బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, 4 సంవత్సరాలు కూతురు,2 సంవత్సరాల కుమారుడు ఉన్నారు.

### పతకం ప్రకారమే హత్య..

: పతకం ప్రకారమే దశరథంను హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంపాలనే ఉద్దేశంతోనే అమ్మాయితో మాట్లాడించి తండాకు రప్పించుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. నాలుగు రోజుల క్రితం సంగారెడ్డి నుంచి లారీ యజమాని వద్ద రూ.20 వేలు బైకు తీసుకొని వచ్చి ఆరోజే ఫోన్ మాట్లాడారన్నారు. పొద్దున బయలుదేరుతాని తెలిపిన మర్నాడు నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది అన్నారు. బయలుదేరే ముందు సాయింత్రం అమ్మాయితో ఫోన్ చేయించారు. అమ్మాయి నాతో పెళ్లి చేసుకో అని ఫోను చేయడంతో రూ. 20 వేలు తీసుకొని వచ్చారని తెలిపారు.

# రైతు కమిషన్ మా వాగ్దానం

**రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి స్పష్టం**



హైదరాబాద్ (జనంసాక్షి)

కాంగ్రెస్ పార్టీ 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో పెట్టిన వాగ్దానం. అందులో భాగంగానే రైతు కమిషన్ ఏర్పాటుచేశామని కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి స్పష్టం చేశారు. సీఎంగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టగానే వ్యవసాయానికి పెద్దపీట వేయాలని, రైతు సంక్షేమానికి తగిన ప్రాముఖ్యత ఇవ్వాలనే లక్ష్యంతో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఏర్పాటు చేశారని, దానిద్వారా వ్యవసాయం లాభసాటిగా ఉండడానికి వ్యవసాయంలో పెనుమార్పులు తేవాలన్నా కమిషన్ దోహదపడ్తుందన్నారు. 'అయితే రైతు కమిషన్ పూర్తి స్థాయిలో చైర్మన్, సభ్యుల నియామకం అయ్యి.. మూడు నెలలు అవుతోంది. ఈ మూడు నెలల కాలంలో.. అనేక అంశాలపై చర్చలు జరిపింది కమిషన్. మరికొన్ని సమస్యల పరిష్కారం దిశగా సలహా సూచనలు చేసింది. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పై అధ్యయనం చేసి ప్రభుత్వానికి సూచనలు చేసింది. సాగు నీరు, విత్తనాలు, భూమి హక్కులు, పంట రుణాలు, రైతు ఆత్మహత్యలు లాంటి కీలక సమస్యలపై మేథోమధనం చేసి ప్రభుత్వానికి సలహాలు ఇచ్చింది. కొన్ని సమస్యల పై క్షేత్ర స్థాయిలో పర్యటించి సమాచారాన్ని సేకరించింది. నిజామాబాదు లో పసుపు బోర్డు ఏర్పాటు, పత్తి రైతుల మార్కెట్ సమస్యల పై పార్లమెంట్ లో ప్రస్తావన, వరి విత్తనాల వలన నష్టపోయిన రైతులకు పరిహారం లాంటివి కమీషన్ కృషి తో సాధ్యపడ్డాయి. మరోవైపు సాంప్రదాయ పంటలైన చెరుకు, పసుపు తోపాటు ఉద్యానవన పంటల ప్రోత్సహించడానికి చేపట్టాల్సిన చర్యలపై ఉద్యాన వన శాఖ అధికారులకు దిశానిర్దేశం చేసింది కమిషన్. ఇక భూ గర్భ జలాలు పెంచుకోడానికి గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వానికి నివేదికను అందించింది. గత ప్రభుత్వం మైనర్ ఇరిగేషన్ ను మేజర్ తో కలిపింది. దానిపై కమిషన్ ఇప్పటికే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసింది. మైనర్ ను మేజర్ నుండి విడదీసి.. ఆ చెరువుల నిర్వహణ గ్రామీణ ప్రాంతంలో వుండే నీటి సంఘాలకు అప్పగించాలని కోరింది కమిషన్. దానిపై ఒక పాలసీని తయారు చేసి మంత్రిగారికి ఇవ్వడం కూడా జరిగింది' అని కోదండరెడ్డి పేర్కొన్నారు.

**పంజాబ్ తర్వాత తెలంగాణలోనే రైతు కమిషన్**

దేశంలో రైతు కమిషన్ పంజాబ్ రాష్ట్రంలోనే ఉంది. ఆ తర్వాత ఏర్పాటు చేసిన రాష్ట్రం మన తెలంగాణే. రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని మన సీఎం రేవంత్ రెడ్డి గారు రైతు కమిషన్ ను ఏర్పాటు చేశారు. అంతేకాదు ఏడాదికాలంలో అత్యధిక పథకాలు రైతులకోసమే తీసుకొచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే రైతు కమిషన్.. రైతుల కోసం అమలు చేస్తున్న పథకాల అమలు ఎలా ఉంది? రైతులను ఆదుకోవడానికి ఇంకా ఏం చెయ్యాలి? అనే అంశాలను ఎప్పటకప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. అందుకోసం అధ్యయనాయాలు, అన్ని వర్గాలతో సంప్రదింపులు, కొన్ని పైలట్ ప్రాజెక్టుల అమలు ఆవశ్యకత ఉంది. వ్యవసాయ కమీషన్ ఇప్పటికే ఈ వైపు వడివడిగా అడుగులు వేస్తుంది.

**రైతులకు ప్రభుత్వానికి వారధి కమిషన్**

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 60 లక్షల వరకు రైతులు, రైతు కుటుంబాలు ఉన్నాయి. అయితే రైతులకు అండగా, ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమీషన్ పనిచేస్తుంది. కమీషన్ ఒక స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా కమీషన్ నిరంతరం పని చేస్తుంది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్దే ధ్యేయంగా, రైతే రాజు అనే నినాదంతో ముందుకు పోతుంది. ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులను అన్ని విధాలా ఆదుకోవాలనే దృఢ సంకల్పంతో ఏర్పాటు చేశారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా కమిషన్ పని చేస్తుంది. ఈ పరిస్థితుల్లో రైతు కమిషన్‌పై తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం అని కోదండరెడ్డి తెలిపారు.

## కులగణనపై ప్రజల్లో అవగాహన కల్పించిన బిసి కమిషన్




హైదరాబాద్ (జనంసాక్షి)

గతంలో కులగణనలో పాల్గొనని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించిన దరిమిలా బిసి కమిషన్ పలు ప్రాంతాల్లో కులగణనలో పాల్గొనేలా ప్రోత్సమించేందుకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. కులగణనలో పాల్గొనని వారికోసం ఆదివారం ప్రారంభమైన కులగణన ఈ నెల 28 వరకు కొనసాగనుంది. దీంతో తొలిరోజు బిసి కమిషన్ జంట నగరాల్లో వివిధ బస్తీల్లో పర్యటించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ ఆదివారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు పాత బస్తీ లోని చాంద్రాయణగుట్ట కుమ్మరిబస్తీలో ఇంటింటికీ వెళ్ళి కులగణన జరిగిందా? లేదా అనే సమాచారాన్ని సేకరిం చారు. ఇంతవరకు కులగణనలో పాల్గొనని వారు ఏ విధంగా నమోదు చేసుకోవాలో వివరించి చెప్పారు. సుమారు రెండు వందల కుటుంబాల వద్దకు వెళ్లి సమాచారం సేకరించగా అందులో 72 కుటుంబాల వారు తమ కులగణన వివరాలు సేకరించ లేదని చెప్పారు. వారి ఇంటి నెంబర్లు తదితర వివరాలను, బిసి సంక్షేమ,
మున్సిపల్ వార్డ్ అధికారులు నోట్ చేసుకుని, నమోదుకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. బిసి కమిషన్ చైర్మన్ తో పాటు బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, స్థానిక ప్రముఖులు వెంకటేష్, నరేష్, శ్యాం తదితరులు చైర్మన్ వెంట ఉన్నారు. కాగా శాలివాహన నగర్, మలక్ పేటలో బిసి కమిషన్ సభ్యులు రాపోలు జయ ప్రకాష్, టిఎస్‌జిఓ కాలని, గచ్చి బౌతి లో సభ్యులు తిరుమలగిరి సురేందర్
ప్రజలకు అవగాహన కల్పిస్తూ పర్యటించారు.

# నేటినుంచి ఫాస్ట్ ట్యాగ్ కొత్త రూల్స్

**పాటించకపోతే డబుల్ టోల్ తప్పదు**

హైదరాబాద్ (జనంసాక్షి)




జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించేందుకు, వాహనదారులు గంటల తరబడి వేచి ఉండకుండా త్వరగా తమ గమ్యస్థానాలను చేరేందుకు ఫాస్ట్ ట్యాగ్ ప్రవేశ పెట్టారు. ఈ ఫాస్ట్ ట్యాగ్ విధానంతో డిజిటల్ ట్రాన్సాక్షన్స్ విధానాన్ని కూడా ప్రోత్సహించబడుతుంది. కాగా.. ఫాస్ట్ ట్యాగ్ లో కొత్త రూల్స్ వచ్చాయి. ఫిబ్రవరి 17 నుంచి ఈ నియమాలు అమల్లోకి రానున్నాయి. వాస్తవానికి, ఫాస్ట్ ట్యాగ్ బ్యాలెన్స్ ధ్రువీకరణకు సంబంధించిన నియమాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐ) అమలు చేస్తోంది. నూతన నియమాలకు తెలుసుకోకపోతే అదనపు ఛార్జీలు కట్టాల్సి వస్తుంది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకుందాం..టోల్ ప్లాజాకు చేరుకున్నప్పుడు ఫాస్ట్‌ట్యాగ్ బ్లాక్‌లిస్ట్‌లో ఉండకూడదు. లావాదేవీ రిజెక్ట్ అయితే.. రెట్టింపు టోల్ చెల్లించాల్సి ఉంటుంది. అంతే కాకుండా.. టోల్ ప్లాజాకు చేరుకోవడానికి ముందు 60 నిమిషాల కంటే ఎక్కువ కాలం ఫాస్ట్‌ట్యాగ్ బ్లాక్‌లిస్ట్‌లో ఉంటే.. అది తెలిసి కూడా10 నిమిషాల పాటు బ్లాక్‌లిస్ట్‌లోనే కొనసాగితే పేమెంట్ రిజెక్ట్ అవుతుంది. అందుకే ఎప్పటికప్పుడు మీ ఫాస్ట్‌ట్యాగ్‌ను చెక్ చేస్తూ ఉండండి.. ఫాస్ట్‌ట్యాగ్ బ్లాక్‌లిస్ట్‌లో చేరడానికి 60 నిమిషాల ముందు లేదా టోల్ దగ్గర స్కాన్ చేసిన 10 నిమిషాలలోపు (మొత్తం 70 నిమిషాల్లో) రీఛార్జ్ చేసుకోవాలి. ఇలా చేస్తే లావాదేవీలు సక్సెస్ అవుతాయి. అదనపు భారం ఉండదు. ఇదొక్కటే కాదు%ా% కేవైసీ వెరిఫికేషన్ పూర్తి చేయకపోవడం, ఛాసిస్ నంబర్‌కు, వెహికల్ నంబర్‌కు మధ్య తేడా ఉన్నా.. ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్తుంది. దీనికి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఈ అంశంపై చాలా మందికి క్లారిటీ రావడం లేదు. అందుకే ఉదాహరణతో తెలుసుకుందాం.. మధ్యాహ్నం1 గంటలకు మీ ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్లింది అనుకుందాం.. మీరు 2.30 గంటలకు టోల్‌ప్లాజాకు చేరుకున్నారు. మీ ట్రాన్సాక్షన్ రిజెక్ట్ అవుతుంది. ఇక్కడ దాదాపు గంటన్నర సమయం పట్టింది. అయితే.. 70 నిమిషాల్లోగా బ్లాక్‌లిస్ట్‌కు సంబంధించిన వివరాలు మీరు చూసుకొని.. దాన్ని సరి చేసి.. కేవైసీని పూర్తి చేయడం చేస్తే లావాదేవీలో ఎలాంటి ప్రాబ్లమ్ రాదు. ఇదొక్కటే కాదు.. మీ టోల్ రీడ్ పూర్తైంది అనుకుందాం.. 10 నిమిషాల తర్వాత మళ్లీ బ్లాక్‌లిస్ట్‌లోకి వెళ్తే ఆ లావాదేవీ తిరస్కరించబడుతుంది. అందుకే ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ ముందుగానే రిఛార్జ్ చేసుకోవడం మంచిది.

## ఐపిఎల్-2025 షెడ్యూల్ విడుదల

హైదరాబాద్ (జనంసాక్షి)



క్రికెట్ అభిమానులకు ఇండియాన్ ప్రీమియర్ లీగ్ అంటే ఎంత ఇష్టమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఐపిఎల్ సీజన్ మొదలవుతుంది అంటే చాలు.. మ్యాచ్ వచ్చే సమయానికి టివిలకు అతుక్కుపోతారు. ప్రాణ మిత్రులైనా సరే.. తమ అభిమాన జట్లను సపోర్ట్ చేసే విషయం మాత్రం పోట్లాడుకుంటారు. అలాంటి అభిమానులందరి బీసీసీఐ గుడ్‌న్యూస్ అందించింది. ఐపిఎల్-2025 షెడ్యూల్‌ని ఆదివారం విడదల చేసింది.ఈ ఏడాది ఐపిఎల్ మొత్తం 65 రోజుల పాటు జరుగనుంది. 13 వేదికల్లో మొత్తం 74 మ్యాచ్‌లు ఆడనున్నారు. మార్చి 22వ తేదీన కోల్‌కత్తా వేదికగా జరిగే తొలి మ్యాచ్‌లో ఆర్సిబి కెకెఆర్ తలపడనున్నాయి. ఇక మార్చి 23వ తేదీన ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. అదే రోజున ముంబై వేదికగా ముంబై ఇండియన్స్ చెన్నై సూపర్‌కింగ్స్ తలపడనున్నాయి. కాగా, ఈ టోర్నీ ప్లేఆఫ్‌లు హైదరాబాద్ మరియు కోల్‌కతా వేదికగా జరుగుతాయి. మే 20న మొదటి క్వాలిఫయర్, 21న ఎలిమినేటర్, 23న రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరుగగా.. ఈ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మే 25న జరుగనుంది.

## కీర్తిలాల్స్‌లో డైమండ్ జ్యువెలరీ కలెక్షన్ ప్రారంభం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 16 (జనం సాక్షి)

ప్రముఖ ఆభరణాల సంస్థ కీర్తిలాల్స్, తన తాజా సేకరణ ప్రదర్శన అమ్మకాల ఎగ్జిబిషన్ ది మ్యూజ్ బై కీర్తిలాల్స్ ను సోమాజిగూడ కీర్తిలాల్ షోరూమ్ లో ప్రారంభించినట్లు కీర్తిలాల్స్ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఇది ఆభరణాల ప్రేమికులను ఫ్యాషన్ ఔత్సాహికులను ఆకర్షించేలా ఉన్న 'ది మ్యూజ్ బై కీర్తిలాల్స్' అనేది ఆధునిక మహిళ కి నచ్చేలా, ఆధునిక డిజైన్లు, కీర్తి లాల్స్ యొక్క సంప్రదాయ శిల్పకళా నైపుణ్యాన్ని సమ్మిళితం చేసి రూపొందించిన అద్భుతమైన ఆభ రణాల శ్రేణిని కలిగివుందని చెప్పారు. సూక్ష్మమైన వివరాలు, వినూత్న నమూనాలు, బహుముఖతపై ప్రత్యేక దృష్టితో ఈ సేకరణ నేటి ఆధునిక వినియో గదారుల కోసం కొత్త ప్రమాణాలకు తీసుకెళ్తుంద న్నారు. 'ది మ్యూజ్ బై కీర్తిలాల్స్' మా సృజనాత్మ కతకు ఆవిష్కరణల పట్ల తమ నిరంతర నిబద్ధ తకు ప్రతిక అన్నారు. ఈ సేకరణలోని ప్రతి ఆభర ణం మాస్టర్ హస్తకళాకారుల నైపుణ్యాన్ని, ఖచ్చితత్వాన్ని ప్రతిబింబిస్తూ, సమకాలీన డిజైను కాలా తీత వైభవంతో మేళవిస్తుందని అ న్నారు. ఈ సేక రణను ప్రత్యేకంగా ప్రదర్శించిన షోరూమ్, సంప్రదా య ఆధునిక దుస్తులకు సరిగ్గా సరిపోయే స్టేట్మెంట్ నెక్లెస్లు, సొగసైన చెవిపోగులు, వివిధ డిజైన్లలో ఉన్న ఉంగరాలు స్టైలిష్ కంకణాలు సహా విభిన్న తరహా ఆభరణాలు ప్రదర్శనలో ఆకట్టుకున్నాయని తెలిపారు.

## పెళ్లిలో గుండెపోటుతో వరుడు మృతి



భోపాల్ (జనంసాక్షి)

మధ్యప్రదేశ్‌లోని శ్యోపుర్ జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. పెళ్లి ఊరేగింపులో ఉండగానే వరుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన అక్కడి వారిని శోకసంద్రంలో ముంచివేసింది. వివరాల్లోకి వెళితే.. ప్రదీప్ జాట్ అనే 27 ఏళ్ల యువకుడు శ్యోపుర్ జిల్లా నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) మాజీ అధ్యక్షుడిగా ఉండేవాడు. అతని అంకుల్ యోగేష్ జాట్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రటరిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.ప్రదీప్‌కి శ్యోపుర్‌కి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలితో వివాహం నిశ్చయం అయింది. జాట్ హాస్టల్ వేదికగా జరుగుతున్న వివాహ వేడుకల్లో ప్రదీప్ ఉత్సహంగా పాల్గొన్నాడు. బారాత్‌లో అందరితో కలిసి నృత్యం చేశాడు. ఆ తర్వాత అతన్ని గుర్రంపై మండపం వద్దకు తీసుకు వస్తుండగా.. గుర్రంపైనే గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. పక్కనే ఉన్నవారు ఇది గమనించి అతనికి వెంటనే సిపిఆర్ చేసి ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో పెళ్లి భాజాలు మోగాల్సిన ఆ ప్రాంగణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# హైదరాబాద్‌లో అపోలో మొదటి సమగ్ర ఆరోగ్య కేంద్రం

హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి)




ఆరోగ్య సేవలను ప్రజలకు చేరువ చేయడంలో భాగంగా అపోలో కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్‌లోని నార్సింగిలో 6500వ అపోలో ఫార్మసీని ప్రారంభించింది. ఇదే చోట అపోలో క్లినిక్ సేవలు కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో నార్సింగి ఒకటి. ఈ సమగ్ర ఆరోగ్య కేంద్రం స్థానికులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించనుంది. అపోలో క్లినిక్, డయాగ్నస్టిక్స్ సేవలు అపోలో హెల్త్, లైఫ్ స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) విభాగంలో ఉంటుంది. ఇది 3200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ హెల్త్ హబ్లో మందులు, పరీక్షలు, వైద్య సంప్రదింపులు కలవు. ఇది 'వన్ అపోలో' మోడల్‌ను మరింత బలోపేతం చేస్తుంది. రిటైల్ హెల్త్‌కి ఇది సరికొత్త రూపం. వచ్చే రెండేళ్లలో వెయ్యి ఫార్మసీలు, క్లినిక్ లు, డయాగ్నోస్టిక్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటికే అపోలో 24/7 ఆన్‌లైన్ సేవల ద్వారా 3.5 కోట్ల మందికి వైద్య సేవలు అందిస్తూఉంది. ఇప్పుడు ఈ కొత్త హబ్ ద్వారా అపోలో సేవలు మరింత చేరువ కానున్నాయి. అపోలో హెల్త్ కో. లిమిటెడ్ ప్రమోటర్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ శోభనా కామినేని మాట్లాడుతూ 'వన్ అపోలో' అనేది ప్రజలకు నమ్మకమైన, ఉత్తమ వైద్య సేవలను సులభంగా తక్షణమే అందించేలా రూపొందించామన్నారు. అపోలో హెల్త్ ని వినియోగదారులకు ఉపయోగపడేలా చేయడానికి ఇది మంచి మార్గం అన్నారు. మన పెద్ద ఫార్మసీలలో కొన్నింటిని మార్చి కొత్త కేంద్రాలు తెరవచ్చన్నారు. అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి మాట్లాడుతూ అపోలో హాస్పిటల్స్ అత్యాధునిక ఆరోగ్య సంరక్షణ విధానాలలో అగ్రగామిగా ఉందన్నారు. ఇప్పుడు క్లినిక్-ఇన్-ఫార్మసీ మోడల్‌ను ప్రారంభించడం ద్వారా తన పరిధిని మరింత విస్తరిస్తుందన్నారు. ఈ కొత్త విధానం రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సమగ్ర విధానం ఫార్మసీ కస్టమర్లకు త్వరగా వైద్య సంప్రదింపులు, ఆరోగ్య పరీక్షలు, రక్తపరీక్షలు అందుబాటులో ఉండేలా రూపొందించామని తెలిపారు.

## ఒరిస్సా టు సికింద్రాబాద్ జోరుగా గంజాయి

ఉప్పల్ (జనంసాక్షి)



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసిన ఘటన ఉప్పల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఎక్సైజ్ సీఐ ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ అల్వాల్ కు చెందిన అభిషేక్ కుమార్ సింగ్ ఆంధ్ర, ఒరిస్సా బార్డర్ నుంచి గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఉప్పల్ పరిసర ప్రాంతంలో అవసరమైన వ్యక్తులకు ఎక్కువ ధరకు అమ్ముతున్నాడని విశ్వసనీయ సమాచారం వచ్చింది. దాంతో ఉప్పల్ భగయత్ లో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో వ్యక్తిని పట్టుకొని విచారించగా గంజాయిని అమ్ముతున్నట్టు నేరం అంగీకరించాడు. అతడి వద్ద నుంచి (5.147) కిలోల గంజాయి (దాని విలువ 1,03,000) మొబైల్ ఫోన్, బైక్ స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి. ఓంకార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఉప్పల్ ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మూడురోజుల పాటు
## తిరుపతిలో టెంపుల్ ఎక్స్‌పో

హైదరాబాద్, ఫిబ్రవరి 16

దేవాలయ పరిపాలన, నిర్వహణకు అంకితమైన ప్రపంచంలోనే అతిపెద్ద సమావేశం ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో (ఐటీసీఎక్స్) 17 నుంచి 19వరకు తిరుపతిలోని ఆశా కన్వెన్షన్స్ లో జరగనుంది. ఈ క్రమంలో టెంపుల్ ఎక్స్‌పో కాన్ఫరెన్స్‌ను ఏపీ సీఎం చంద్రబాబు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్ ప్రారంభించనున్నారు. ఎక్స్‌పోలో భాగంగా ఆలయాలపై నిపుణుల మధ్య చర్చలు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నారు. టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి మానసపుత్రికైన ఐటీసీఎక్స్-2025, అంత్యోదయ ప్రతిష్ఠాన్ సహకారంతో నిర్వహించబోయే కార్యక్రమంతో ప్రపంచవ్యాప్తంగా దేవాలయ పర్యావరణ వ్యవస్థలను నెట్ వర్క్ చేయడానికి, బలోపేతం చేయడానికి, ఆధునీకరించడానికి ఒక డైనమిక్ వేదికను అందించడంతో పాటు, గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని వేడుకగా నిర్వహించనుంది.

# కోడలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన అత్త

డెహ్రాడూన్ (జనంసాక్షి)




అదనపు కట్నం కోసం ఓ కుటుంబం దారుణానికి తెగబడింది.. కొత్త కోడలిని నిత్యం వేధింపులకు గురిచేసింది. హెచ్ఐవీ బాధితుడికి ఉపయోగించిన సిరంజీతో కోడలికి బలవంతంగా ఇంజెక్షన్ చేసింది. దీంతో ఆమె హెచ్ఐవీ బారిన పడింది. దీనిపై పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదుకు తిరస్కరించడంతో బాధితురాలి కుటుంబం కోర్టుకెక్కింది. చివరకు న్యాయస్థానం ఆదేశాలతో బాధితురాలి అత్తింటివారిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్ లోని సహరన్ పూర్ లో చోటుచేసుకుందీ దారుణం. బాధితురాలి కుటుంబం వెల్లడించిన వివరాల ప్రకారం.. 2023 ఫిబ్రవరిలో సహరన్ పూర్ కు చెందిన యువతికి హరిద్వార్ కు చెందిన యువకుడికి వివాహం జరిగింది. ఈ వేడుక కోసం రూ.45 లక్షలు ఖర్చు చేసినట్లు బాధితురాలి తండ్రి చెప్పారు.
రూ.15 లక్షల కట్నంతో పాటు కారును బహుమతిగా ఇచ్చినట్లు తెలిపారు. అయితే, అదనంగా మరో పది లక్షలు, పెద్ద కారు తీసుకురావాలని అత్తింటివారు తమ కూతురుని వేధించారని చెప్పారు. పెళ్లి జరిగిన తర్వాతి రోజు నుంచే వేధింపులు ప్రారంభమ య్యాయని ఆరోపించారు. మార్చిలో తన కూతురు పుట్టింటికి వచ్చేసిందని, మూడు నెలల తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించామని చెప్పారు. ఆ తర్వాత అల్లుడు తన కూతురును కాపురానికి తీసుకెళ్లాడని వివరించారు. అప్పటి నుంచి వేధింపులు మరింత ఎక్కువయ్యాయని, శారీరకంగా, మానసికంగా తన కూతురుపై దాడి జరిగిందని తెలిపారు. 2024 మే నెలలో తన కూతురుకు ఆమె భర్త, అత్త, ఇతర కుటుంబ సభ్యులు బలవంతంగా హెచ్ఐవీ సోకిన నీడిల్ తో ఇంజెక్షన్ చేశారని ఆరోపించారు. దీంతో తన కూతురు హెచ్ఐవీ బారిన పడిందని కోర్టుకు తెలిపారు. కాగా, కోర్టు ఆదేశాలతో బాధితురాలి భర్త, అత్త, ఆడపడుచు, ఆమె భర్తలపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## ఇజ్రాయెల్ నుంచి 300 పాలస్తీనా ఖైదీలు విడుదల

పాలస్తీనా (జనంసాక్షి)



హమాస్ నుంచి ముగ్గురు ఇజ్రాయెల్ బందీలు విడుదల కాగానే ఇజ్రాయెల్ 300 పాలస్తీనా ఖైదీలను శనివారం విడుదల చేసింది. ఈమేరకు ఇజ్రాయెల్ హమాస్ తమ ఆరో విడత బందీల విడుదలను పూర్తి చేయగలిగారు. ఇప్పుడు విడుదలైన పాలస్తీనా ఖైదీల్లో అహ్మద్ బర్ఘౌతీ (48) అత్యంత ప్రాముఖ్యం కలిగిన వ్యక్తి. మిలిటెంట్ నాయకుడు, పాలస్తీనా రాజకీయ వేత్త మార్వాన్ బర్ఘౌతీకి అత్యంత సన్నిహితుడు.జనవరి 19న యుద్ధ విరమణ అమలైన దగ్గర నుంచీ రెండు వైపులా ఐదు విడతల బందీల మార్పిడి పూర్తయింది.
యుద్ధ విరమణ సంధి మొదటి దశలో 21 మంది బందీలు, 730 మంది కన్నా ఎక్కువ పాలస్తీనా ఖైదీలు విడుదలయ్యారు. అత్యంత క్లిష్టమైన రెండో దశలో ఒప్పందం పూర్తిగా నెరవేరకపోతే మార్చిలో మళ్లీ యుద్ధం ప్రారంభం అయ్యే అవకాశా లున్నాయి. ఇంకా బందీలుగా ఉన్న 73 మందిలో ఇజ్రాయెల్ సైనికులతో సహా మిగతా వారంతా దాదాపు అందరూ పురుషులే. అయితే వీరిలో సగానికి సగం మంది చనిపోయారని భావిస్తున్నారు

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 17 ఫిబ్రవరి 2025

# శిల్ప వ్యాలీ కాలనీ సమస్యల పరిష్కారానికి సత్వర కృషి

- రాష్ట్ర పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ పరిధి శిల్ప వ్యాలీ కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి సత్వర కృషిని చేపడుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు శిల్ప వ్యాలీ కాలనీవాసులు ఆదివారం పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీని వివేకానంద నగర్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనికిగాను గాంధీ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా శిల్ప వ్యాలీ కాలనీ వాసులు మాట్లాడుతూ శిల్ప వ్యాలీ కాలనీలో మౌలిక వసతుల కల్పన గావించినందుకు చైర్మన్ గాంధీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని, అదేవిధంగా శిల్ప వ్యాలీ కాలనీలో అంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్లను పునరుద్ధరించాలని, వరద నీటి కాల్వ మరియు భూగర్భ డ్రైనేజీ పనులను చేపట్టాలని, మంచి నీటి వ్యవస్థ ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమైన మౌలిక వసతులతో పాటు వీధి దీపాల వ్యవస్థను ఏర్పాటు చేయాలని తాము అరికెపూడి గాంధీకి విన్నవించడం జరిగిందన్నారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ త్వరలోనే కాలనీలో పర్యటిస్తానని, శిల్ప వ్యాలీ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని తెలియజేశారు. కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను, యుజిడి, వరదనీటి కాల్వ నిర్మాణము పనులు అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి మార్గాలను అన్వేషిస్తున్నామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ ధీమాను వ్యక్తంచేశారు. రోడ్ల నిర్మాణాన్ని దశల వారిగా చెప్పటి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ తెలియచేసారు. అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల పనులను వెంటనే చేపట్టి ప్రజలకు ఉపశమనం కలిగేలా చూడాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. మంచి నీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన మంచినీటి సరఫరా చేయాలని, అవసరమున్నచోట మంచి నీటి సరఫరా సమయం పెంచాలని, తక్కువ ప్రెజర్‌తో వచ్చేచోట తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ గాంధీ జలమండలి అధికారులకు తెలియచేసారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, అదేవిధంగా ఏచిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని, ఎల్లవేళలా శిల్ప వ్యాలీ కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటానని, అన్ని విధాలుగా అండగా ఉంటానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శిల్ప వ్యాలీ కాలనీ వాసులు ధీరజ్, గౌతమ్, విద్య సాగర్, గోవర్ధన్ రెడ్డి, విజేందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, దిలీప్, బాబు రావు, మణికంఠ , ఆనంద్, మోహన్, వినయ్, ప్రణీత్, మనోహర్, ప్రవీణ్, సంపత్, శోభన, బాల విష్ణు, భరత్, సాయి వినయ్, నవీన్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## మస్తాన్‌సాయి హత్య కేసులో గవర్నర్‌కు లేఖ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** రాజ్ తరుణ్ – లావణ్య కేసు రోజుకో కీలక మలుపు తిరుగుతోంది. ఈ కేసులో లావణ్య మస్తాన్ సాయి పై తీవ్ర ఆరోపణలు చేస్తూ నార్సింగి పోలీసులకు కంప్లైంట్ కూడా ఇచ్చారు. కాగా పోలీసులు మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు. మస్తాన్ సాయి విచారణలో దొరికిన అనేక న్యూడ్ వీడియోలు, కాల్ రికార్డింగ్స్ ఉన్నట్టు సంచలన విషయాలు బయటకు రాగా.. తన జీవితం నాశనం అవడానికి కారణం మస్తాన్ సాయి అని, అతని మాటలు నమ్మి రాజ్ తరుణ్ తో తాను గొడవ పడ్డానని, తనను క్షమించాలని బహిరంగంగా రాజ్ తరుణ్ ను కోరారు లావణ్య. ఈ క్రమంలో మస్తాన్ సాయి కుటుంబంపై ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ కు లావణ్య అడ్వొకేట్ ఓ కీలక లేఖ రాశారు. మస్తాన్ సాయి కుటుంబం గుంటూరులో మస్తాన్ దర్గా ధర్మకర్తలుగా ఉన్నారని, ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న వారికి ధర్మకర్తలుగా ఉండే అర్హత లేదని, తక్షణమే వారిని తొలగించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. మస్తాన్ సాయి నేరాల వలన దర్గాకు ఉన్న పవిత్రత చెడిపోతుందని.. భగవంతునికి మచ్చ తెచ్చే వారిని దూరం పెట్టాలని తెలిపారు. గవర్నర్‌కే కాకుండా ఏపీ సీఎస్, గుంటూరు కలెక్టర్ వంటి పలువురికి లావణ్య న్యాయవాది లేఖలు రాశారు.



## పీవీఎన్ఆర్‌పై డివైడర్‌ను ఢీకొట్టిన కారు



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 242 ఫ్లై ఓవర్ పై మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్న స్విఫ్ట్ కార్ అదుపు తప్పి డీవైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదాన్ని తెలుసుకొన్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ గౌడ్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాన్ని ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది సహాయంతో అక్కడి నుంచి తొలగించారు. దీంతో స్తంభించిన అక్కడి ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

## చెరువులో గల్లంతైన యువకులు

**శామీర్‌పేట, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** అమ్మవారి దర్శనానికి వచ్చిన యువకులు చెరువులో గల్లంతైన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం శామీర్ పేట మండలం పొన్నాల గ్రామ పరిధిలోని శ్రీ గండి చిత్తారమ్మ ఆలయానికి ఆరుగురు యువకులు (మిత్రులు) జగద్గిరిగుట్టకు చెందిన బాలు (25), సందీప్ సాగర్ (27), రాంపల్లి సందీప్(26), సాయి చందం (25), కీసర మండలం నాగారం కు చెందిన ఒగ్గు బాలకృష్ణ (24), కర్ర నితీశ్ కుమార్(24)లు శామీర్ పేట మండలం పొన్నాల గండి చిత్తరమ్మ ఆలయానికి దాదాపు ఉదయం 11 గంటలకు వచ్చారు. అక్కడ చిత్తరమ్మని దర్శించుకొన్నారు. ఆలయం వెనకాల ఉన్న చెరువు దగ్గర వంట వండుకొని వాళ్ళ వెంట తెచ్చుకున్న మద్యం, కళ్ళు సేవించారు. సుమారు సాయంత్రం 5 గంటలకు ముగ్గురు యువకులు పాలసంతుల బాలు, అలలికంటి సందీప్ సాగర్, ఒగ్గు బాలకృష్ణ లు చెరువులో కి ఈతకు వెళ్లారు. అందులో ఒక్కరు తిరిగి రాగా మరో ఇద్దరు పాలసంతుల బాలు, అలలికంటి సందీప్ సాగర్ లు చెరువులో గల్లంతు అయ్యారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం శామీర్ పేట పోలీసులు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

## ప్రాణాలు తీసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటు చేసుకుంది. కీసర దయారలో యువతి ఆత్మ హత్య చేసుకోవడం కలకలం సృష్టించింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకుంది. మృతురాలు సాఫ్ట్ వేర్ ఉద్యోగిని అయిన ప్రవలికగా గుర్తించారు. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న కీసర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ హాస్పటిల్ కి తరలించారు. సూసైడ్ కు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## 'మన మహబూబ్‌నగర్ మహా నగరోత్సవం' ముగింపు



**మహబుబ్‌నగర్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మహబూబ్ నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్ గా మారిన సందర్భంగా మహబూబ్ నగర్ నగర పాలక సంస్థ అభివృద్ధిని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అత్యుత్తమంగా తీర్చి దిద్దేందుకు కృషి చేయనున్నట్లు శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శిల్పారామంలో మూడు రోజులపాటు నిర్వహించిన 'మన మహబూబ్ నగర్ మహా నగరోత్సవం' ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఉత్సవంలో సుమారు 22 వేల మంది ప్రజలు పాల్గొన్నారని,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు,ఆట,పాటలతో,చిన్నారులు అందరినీ అలరించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శిల్పారామం ఒక టాలెంట్ వేధిక అని,దీనిని ఎంటర్టైన్మెంట్ కం లెర్నింగ్ కం కల్చరల్ జోన్ గా రూపొందిస్తామన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలో త్వరలో ఒక వారం రోజుల పాటు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు,కార్పోరేషన్ అభివృద్ధికి అందరి సహకారం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్,మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేట జిల్లాలో స్కూళ్లు, కాలేజీలకు సెలవు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఉత్తర్వులు జారీ
- పెద్దగట్టు జాతర నేపథ్యంలో నిర్ణయం



**సూర్యాపేట ప్రతినిధి, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లాలో విద్యాసంస్థలకు సోమవారం (ఫిబ్రవరి 17, 2025) లోకల్ హాలిడే ప్రకటించారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. దురాజ్ పల్లి పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి జాతర సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం లోకల్ హాలీడే ప్రకటించారు. తెలంగాణలో రెండో అతి పెద్ద జాతరగా పేరుగాంచిన పెద్దగట్టు జాతర ఆదివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైంది. ఐదు రోజులపాటు జరిగే పెద్దగట్టు జాతర సమ్మక్క సారలమ్మ జాతర తర్వాత అతి పెద్దది. సూర్యాపేట పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై చివ్వెంల మండలం దురాజ్‌పల్లి వద్ద రోడ్డు పక్కనే పెద్దగట్టు గుట్టపై లింగమంతులస్వామి కొలువై ఉన్నారు. ఈ జాతర దాదాపు 250 ఏండ్ల నుంచి జరుగుతున్నట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. పెద్దగట్టు జాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. ఇది భారతదేశంలోని యాదవుల ఏకైక జాతరగా భావిస్తారు. ఈ ఏడాది జాతరకు దాదాపు 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అందుకనుగుణంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట డిపో నుంచి 60 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడపనుంది. లింగమంతులస్వామి జాతర ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.5 కోట్లు కేటాయించింది.

# అప్పుడే ఎండకాలం వచ్చేసింది..!

- ఫిబ్రవరిలోనే ఏప్రిల్, మే నెలలో ఉష్ణోగ్రతలు
- రానున్న రోజుల్లో పలు ప్రాంతాల్లో 38 డిగ్రీలకు చేరే అవకాశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** ప్రచండ భానుడి ప్రతాపానికి రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో 37 డిగ్రీలకు చేరుకుంది. మరికొన్ని చోట్ల 35 డిగ్రీలకు పైగానే నమోదవుతుంది. అయితే ఇంకా ప్రజలను హడలెత్తించే బులిటెన్‌ను వాతావరణ శాఖ ప్రకటించింది. వచ్చే వారం నుంచి చాలా ప్రాంతాల్లో 38 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఫిబ్రవరిలోనే మే నెలలో వచ్చే ఎండలను ప్రజలు తట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

పగటి ఉష్ణోగ్రతలు క్రమేణా తారాస్థాయికి చేరుకుంటుంటే రాత్రి ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతూ ప్రజలను ఉక్కపోతకు గురిచేస్తున్నాయి. ఆదివారం వాతావరణ శాఖ నమోదు చేసిన ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాచలంలో 37 డిగ్రీలు, మహబూబ్‌నగర్‌లో 37 డిగ్రీలు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైతే, ఆదిలాబాద్‌లో 36.3 డిగ్రీలు, నిజామాబాద్‌లో 36.1, రామగుండంలో 36 డిగ్రీలు నమోదైంది. హన్మకొండలో 35 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35.4, ఖమ్మంలో 35.4, హయాత్‌నగర్, రాజేంద్రనగర్‌లో 34, మెదక్ 33.8, నల్గొండ 33.5, పటాన్‌చెరులో 32.7 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### ఈ నెల 22 వరకు 38 డిగ్రీలకు చేరే అవకాశం

వాతావరణ శాఖ అందించిన వివరాల ప్రకారం ఈ నెల 22 వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలకు చేరుకుంటుందని తెలిపింది. హైదరాబాద్‌లో 36 నుంచి 37 డిగ్రీలకు, రామగుండంలో 36 నుంచి 38 డిగ్రీలకు, ఆదిలాబాద్‌లో 36 నుంచి 37 మధ్య, నిజామాబాద్‌లో 36 నుంచి 38 మధ్య, ఖమ్మంలో 37, హన్మకొండలో 32 నుంచి 34 వరకు, మెదక్‌లో 34 నుంచి 37 వరకు ఉష్ణోగ్రతలు చేరుకునే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. కాగా, పగటి ఉష్ణోగ్రతలకు, రాత్రి ఉష్ణోగ్రతల నడుమ చాలా వ్యత్యాసం కనిపిస్తోంది. గరిష్ట ఉష్ణోగ్రత 34 డిగ్రీల నుండి 38 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదైతే, కనిష్ట ఉష్ణోగ్రత 18 డిగ్రీల సెల్సియస్‌గా నమోదవుతోంది. గాలిలో తేమ ఉదయం 42 శాతం, మధ్యాహ్నం 12 శాతం నమోదవుతోంది. గాలిలో తేమ శాతం తగ్గిపోయి చెమటలు పడుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మరో మూడు నాలుగు రోజులపాటు జిల్లాలో వాతావరణ పరిస్థితులు ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

# నలుగురు నకిలీ వైద్యుల గుర్తింపు

- తుర్కయంజాల్ మున్సిపాలిటీలో టీజీఎంసీ బృందం తనిఖీలు



**తుర్కయంజాల్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నకిలీ వైద్యుల హల్ చల్ కొనసాగుతోంది. పేద ప్రజల అవసరాలు, అమాయకత్వం, అవగాహన లోపం వాళ్లకి వరంగా మార్చుకొని వారి వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా నడుపుకుంటున్నారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం డా.వి. నరేష్ కుమార్, డా. కడాలి విష్ణు బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఎన్ఎంసి చట్ట విరుద్ధంగా ఎంబీబీఎస్ విద్యార్హత లేకుండా అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్న నకిలీ వైద్యుల సెంటర్లపై తనిఖీలు నిర్వహించింది. రాజర్షి ఇన్ఫర్మిటీ నిర్వాహకుడు చంద్రశేఖర్ ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్ మెంట్ చదివి డాక్టరు అవతారం ఎత్తి తన సెంటర్ కు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో 2023 సంవత్సరంలో డా. కాత్యాయని, ఈఎన్టీ సర్జరీ పేరు మీద ఒక బ్రోకర్ ద్వారా అనుమతి తీసుకొని క్వాలిఫైడ్ డాక్టరు ఎవరు లేకుండా తానే వారి వద్దకు వచ్చే పేషంట్లకు డాక్టరు వలె నమ్మించి ఇష్టానుసారం యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్స్, సెలైన్లు ఇవ్వడంతో పాటు ప్రెస్క్రిప్షన్ రాస్తున్నట్లు తనిఖీ అధికారులు గుర్తించారు. రాజర్షి ఇన్ఫర్మేరీ అనుమతికి సర్టిఫికెట్స్ ఇచ్చిన డా. కాత్యాయని వారానికి ఒకసారి వచ్చి వెళ్తారని చెప్పిన నిర్వాహకుడు చంద్రశేఖర్ ని డాక్టర్ ఫోన్ నెంబర్ అడుగగా తన వద్ద లేదని, తాను ఎవరో కూడా తెలియదని చెప్పి తనకు బ్రోకర్ సర్టిఫికెట్స్ ఇచ్చి డీఎంహెచ్వో ఆఫీస్ లో రిజిస్ట్రేషన్ చెయించాడని మాట మార్చాడు. సదరు బ్రోకర్ పేరు కూడా గుర్తు లేదని, నెంబర్ కూడా దొరకట్లేదని నీళ్లు నమలడం విశేషం. తమ వద్ద కౌన్సిల్ రిజిస్టర్‌లో ఉన్న నెంబర్ ఆధారంగా డా.కాత్యాయనిని ఫోన్లో సంప్రదించిన తనిఖీ అధికారులు సదరు సెంటర్ కాని, నిర్వాహకుడు ఎవరో తెలియదని డా.కాత్యాయని కూడ తెలియ చేశారు. అదే ప్రాంతంలో ల్యాబ్ టెక్నీషియన్ గా చదివి ఎటువంటి డాక్టరు లేకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా ఆయాన్ష్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్న పి.మహేష్, ఏఎన్ఎం చదివి కమ్మగూడ ప్రాంతంలో స్మార్ట్ క్యూర్ క్లినిక్ నిర్వహిస్తున్న చంద్రమ్మ అలియాస్ చంద్రకళ, బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డులో 10 వ తరగతి మాత్రమే చదివి వాసు మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ లో అల్లోపతి వైద్యం చేస్తున్న సిహెచ్. శ్రీనివాస్ పై ఎన్ఎంసి 34, 54 ప్రకారం కేసు లు నమోదు చేయనున్నట్టు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డా వి.నరేష్ కుమార్ తెలియ చేశారు. రాజర్షి ఇన్ఫర్మేరీకి దుర్వినియోగం గురించి సర్టిఫికెట్స్ పై లిఖిత పూర్వక సమాధాన%శీ% ఇవ్వాలని డా. కాత్యాయనికి నోటీసు ఇవ్వనున్నట్లు టీజీఎంసీ సభ్యులు డా. కడాలివిష్ణు తెలియచేశారు.

# ఎర్రజెండా ఎప్పుడూ ప్రశ్నిస్తుంది

- టిపీసీసీ ఉపాధ్యక్షుడు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కొత్వాల్



**మహబుబ్‌నగర్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** ఎర్రజెండా ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడి,సమస్యల పట్ల ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుందని టిపీసీసీ ఉపాధ్యక్షుడు,స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కొత్వాల్ అన్నారు. ఆదివారం స్థానిక అరుంధతీ భవన్ లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 'కేంద్ర బడ్జెట్–వివిధ రంగాలపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచి భూమి కొరకు భుక్తి కొరకు పేదల విముక్తి కొరకు అనే భావజాలం కు ఆకర్షితులై సమాజ మార్పు కొరకు కృషి చేశారని ఆయన జాన్ వెస్లీ ని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చాక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేర్చే విషయంలో ఏవైనా లోటుపాట్లు ఉంటే ప్రశ్నించవచ్చు ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజయవంతంగా కులగణన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తూ,రాష్ట్ర ప్రజల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఎం కార్యదర్శి రాములు, గోపాల్, బాలకృష్ణ, రఘు,కిల్లె గోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## అది దేశంలో 'బాధ్యతాయుత' సమాజం

- ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్

**బర్ధమాన్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** హిందు సమాజాన్ని ఏకం చేయడం ప్రధానమని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ఆదివారం ఉద్ఘాటించారు. అది దేశంలో 'బాధ్యతాయుత' సమాజం అని, భిన్నత్వంలోనే ఐక్యత ఉందని అది విశ్వసిస్తుందని భాగవత్ చెప్పారు. బర్ధమాన్‌లో ఎస్ఎఐ మైదానంలో ఒక ఆర్ఎస్ఎస్ కార్యక్రమం (ర్యాలీ)లో భాగవత్ ప్రసంగిస్తూ, 'మేము హిందు సమాజంపైనే ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తుంటామని జనం తరచు అడుగుతుంటారు. దేశంలో బాధ్యతాయుత సమాజం హిందు సమాజమేనన్నది నా సమాధానం' అని చెప్పారు. 'ఇది ప్రత్యేక కార్యక్రమం ఏమీ కాదు. సంఘ్ గురించి తెలియనివారు అది ఏమి కోరుకుంటున్నదని ఆశ్చర్యపోతుంటారు. నేను సమాధానం చెప్పవలసి వస్తే హిందు సమాజం దేశంలో బాధ్యతాయుత సమాజం కనుక దానిని సంఘటితం చేయాలని సంఘ్ కోరుకుంటున్నదని చెబుతాను' అని భాగవత్ పేర్కొన్నారు. ప్రపంచం భిన్నత్వాన్ని అంగీకరించవలసిన ప్రాముఖ్యత గురించి ఆయన నొక్కిచెప్పారు. 'భారత్ కేవలం భౌగోళికం కాదు. భారత్‌కు ఒక ప్రకృతి ఉంది. ఈ విలువలతో జీవించలేనివారు ప్రత్యేక దేశాన్ని సృష్టించారు. కానీ, సహజంగా ఉండిపోయిన వారు భారత్ సారాన్ని అనుసరించారు. ఏమిటి ఈ సారం? అది హిందు సమాజం, ప్రపంచం భిన్నత్వాన్ని అంగీకరించడం ద్వారా మనుగడ సాగిస్తుంది. మనం 'భిన్నత్వంలో ఏకత్వం' అని అంటాం, కాని భిన్నత్వమే ఏకత్వం అన్నది హిందు సమాజం అవగాహన' అని ఆర్ఎస్ఎస్ చీఫ్ వివరించారు. భారత్‌లో చక్రవర్తులు, మహారాజులను ఎవ్వరూ గుర్తుంచుకోరు, కానీ తన తండ్రి మాట చెల్లించేందుకు 14 ఏళ్లు వనవాసం చేసిన రాజును గుర్తుంచుకుంటారు. శ్రీరాముని ఉద్దేశించి, సింహాసనంపై తన సోదరుని పాదుకలను ఉంచిన, ఆయన తిరిగి రాగానే రాజ్యాన్ని అప్పగించిన వ్యక్తి గురించే ఆ ప్రస్తావన) అని భాగవత్ చెప్పారు. 'ఈ లక్షణాలు భారత్‌ను నిర్వచిస్తుంటాయి.ఈ విలువలను పాటించేవారు హిందువులు, వారు సమస్త దేశం విభిన్నతను సమైక్యంగా ఉంచుతారు. ఇతరులకు నొప్పి కలిగించే పనులను చేయం. పాలకులు, మహోన్నతులు తమ పని చేసుకుపోతుంటారు, కానీ దేశ సేవ కోసం సమాజం ముందుకు రావాలి' అని ఆయన అన్నారు. బెంగాల్ పోలీసులు మొదట అనుమతి నిరాకరించిన తరువాత కలకత్తా హైకోర్టు ఆమోదించిన మీదట ఈ ర్యాలీ నిర్వహించారు..

# ప్రైవేట్‌కు స్వాగతం.. ప్రభుత్వ సంస్థలకు వీడ్కోలు



ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది.

ఎవరి స్థలంలో వాళ్లు ఇల్లు కట్టుకోవడం సహజం. అదే మన స్థలం మరెవరికో ఇచ్చి, మనం వెళ్లి పక్కవాళ్ల స్థలంలో ఇల్లు కట్టుకుంటే ఎలా ఉంటుంది? విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఇలాగే ఉంది. మన రాష్ట్రంలో కొత్త విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసే అవకాశాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలైన జెన్‌కో, సింగరేణి ద్వారా ఇతర రాష్ట్రాల్లో ప్లాంట్లు ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నది. మన దగ్గర ప్రైవేట్ ప్లాంట్లకు గేట్లు తెరిచి, మన విద్యుత్తు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో విద్యుత్తు ప్లాంట్లను నిర్మిస్తున్నది. ప్రభుత్వ తీరును విద్యుత్తురంగ నిపుణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇదేం పద్ధతి అంటూ ప్రశ్నిస్తున్నారు.

జెన్‌కో, సింగరేణితో ఇతర రాష్ట్రాల్లో పనులు

విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం, నిర్వహణ విషయంలో జెన్‌కో, సింగరేణి సంస్థలు ఆరితేరాయి. జెన్‌కో థర్మల్, హైడల్ విద్యుత్తు ప్లాంట్లు నిర్మించగా.. సింగరేణి థర్మల్, సోలార్ ప్లాంట్లను నిర్మించడంతోపాటు రామగుండంలో కొత్తగా పంప్‌స్టోరేజీ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. ఈ రెండు సంస్థలను కాదని ప్రభుత్వం కొత్త పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రైవేట్‌కు కట్టబెడుతున్నది. ఆ రెండు సంస్థల చేత రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో కొత్త ప్లాంట్లు పెట్టిస్తున్నది. ప్రభుత్వ సంస్థలతో సొంత రాష్ట్రాన్ని వదిలి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టించడం ఎందుకో.. దీని వెనుకున్న మతలబేమిటోనని నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో మనంపెట్టేవి..

టీజీ జెన్‌కో హిమాచల్‌ప్రదేశ్‌లో బిల్డ్ ఆపరేషన్ అండ్ ట్రాన్స్‌పర్ (బీవోటీ) పద్ధతి లో జలవిద్యుత్తు కేంద్రం (హైడల్) నిర్మాణనికి సంప్రదింపులు జరుపుతున్నది.

సింగరేణి సంస్థ రాజస్థాన్‌లో 3,100 మెగావాట్ల విద్యుత్తు పవర్ ప్లాంట్లను నెలకొల్పేందుకు ఎంవోయూలు కుదుర్చుకుంది. 1600 మెగావాట్ల థర్మల్, 1,500 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పనుంది.

సింగరేణి సంస్థ ఒడిశాలోని నైనీలో 1, 600 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్తు ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

మన రాష్ట్రంలోకి ప్రైవేట్ పెట్టుబడులు

సన్ పెట్రోకెమికల్స్ సంస్థ రూ.45 వేల కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఎంఓయూ కుదుర్చుకున్నది. ఈ సంస్థ నాగర్‌కర్నూల్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో పంప్డ్ స్టోరేజీ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ఈ సంస్థ 3,400 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకుంది.

మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ 11వేల కోట్ల పెట్టుబడులతో 2,160 మెగావాట్ల సామర్థ్యం గల పంప్డ్ స్టోరేజీ పవర్‌ప్లాంట్లను నెలకొల్పనుంది.

మెగా ఇంజినీరింగ్ లిమిటెడ్ సంస్థ మరో 3వేల కోట్లను రాష్ట్రంలో పెట్టుబడి పెట్టి, వెయ్యి మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ (బీఈఎస్ఎస్) ప్లాంట్‌ను నెలకొల్పనుంది.మైత్రా ఎనర్జీ సంస్థ 7వేల కోట్లు పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థ 2,400 మెగావాట్ల సోలార్ సెల్, మరో 2,400మెగావాట్ల సోలార్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ ప్లాంట్‌ను నెలకొల్పనుంది.

హడావిడిగా పాలసీ.. అందుకేనా క్లీన్ ఎనర్జీని ప్రోత్సహించడంలో భాగంగా ప్రభుత్వం ఇటీవలే గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించింది. ఈ పాలసీకి క్యాబినెట్‌లో ఆమోదం లభించింది. అయితే దావోస్ పర్యటనలో భాగంగా రాష్ట్రప్రభుత్వం విద్యుత్తు రంగంలో 66 వేల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకున్నది. దావోస్ సదస్సుకు ముందే సర్కారు గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది. తాజాగా వచ్చిన పెట్టుబడులన్నీ గ్రీన్ ఎనర్జీ రంగానికి సంబంధించినవే. అంటే దావోస్ సదస్సుకు ముందే పాలసీ రూపొందించడం వెనుక ఈ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించాలన్న ముందస్తు కుట్ర దాగి ఉందన్న అనుమానాలు బలపడుతున్నాయి. హడావిడిగా పాలసీ రూపకల్పన వెనుక ఇదే కోణం దాగి ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

# రుణగ్రహీతలకు ఎస్బీఐ శుభవార్త..




బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్-బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది.

బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్-బేస్డ్ లెండింగ్ రేటు(ఈబీఎల్ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు(ఆర్ఎల్ఎల్ఆర్)తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేట్లను పావు శాతం మేర తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో గృహ, వ్యక్తిగత రుణాలతోపాటు ఇతర రుణాలపై చెల్లించే ఈఎంఐలు తగ్గనున్నాయి. ఈ నూతన రేట్లు శనివారం నుంచి అమలులోకి వచ్చాయి. రిజర్వుబ్యాంక్ ఇటీవల రెపోరేటును 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఎస్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది.

దీంతో ఈబీఎల్ఆర్ రేటు పావు శాతం తగ్గించడంతో రేటు 9.15 శాతం నుంచి 8.90 శాతానికి దిగొచ్చింది. అలాగే ఆర్ఎల్ఎల్ఆర్ కూడా 8.50 శాతానికి దించింది. ఆర్బీఐ విధించిన రెపోరేటు ఆధారంగా బ్యాంకులు దీనికి అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను నిర్ణయిస్తుంటాయి. సెంట్రల్ బ్యాంక్ గతవారంలో రెపోరేటును తగ్గించడంతో బ్యాంకులు ఒక్కొక్కటి రుణాలపై వడ్డీరేటును తగ్గిస్తున్నాయి. ఎస్బీఐ కూడా ఈ నిర్ణయం తీసుకున్నది. కానీ, మార్జినల్ కాస్ట్-బేస్డ్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్), బేస్‌రేటు, బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు(బీపీఎల్ఆర్)ని యథాతథంగా ఉంచింది బ్యాంక్.

ఎస్బీఐకి రూ.30 కోట్లు తెలంగాణకు చెందిన రిఫైనరీ కంపెనీ శీతల్ రిఫైనరీస్ లిమిటెడ్, మరికొన్ని సంస్థల రుణ మోసం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రూ.30 కోట్లకుపైగా విలువైన ఆస్తులను రికవరీ చేసి ఎస్బీఐకి అప్పగించింది.

మరిన్ని బ్యాంకులు కూడా..

ఎస్బీఐ బాటలోనే మరిన్ని బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాయి. వీటిలో కెనరా బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లు ఉన్నాయి. దీంట్లో కెనరా బ్యాంక్ ఆర్ఎల్ఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం నుంచి 9 శాతానికి దించింది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా కూడా బీఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 8.90 శాతానికి దించింది. ఈ వడ్డీరేట్లు ఈ నెల 10 నుంచే అమలులోకి వచ్చాయి. అలాగే ఈ నెల 7 నుంచి అమలులోకి వచ్చేలా బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎల్ఎల్ఆర్ రేటుని 9.35 శాతం నుంచి 9.10 శాతానికి తగ్గించింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ కూడా 9.10 శాతానికి తగ్గించగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా రెపోతో అనుసంధానమై రుణాలపై వడ్డీరేటును 9.25 శాతం 9 శాతానికి తగ్గించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సైతం ఆర్ఎల్ఎల్ఆర్ వడ్డీరేటును 9 శాతానికి కోత పెట్టింది.

# బజాజ్ కన్జ్యూమర్ కేర్ చేతికి విశాల్ పర్సనల్ కేర్

హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్జ్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు.



హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న విశాల్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ముంబై ఆధారిత బజాజ్ కన్జ్యూమర్ కేర్ లిమిటెడ్ సొంతం చేసుకుంటున్నది. రెండు విడుతల్లో జరుగనున్న ఈ డీల్ విలువ రూ.120 కోట్లుగా అంచనా వేస్తున్నారు. విశాల్ పర్సనల్ కేర్‌లో తొలుత 49 శాతం వాటాను, ఆ తర్వాత మిగతా 51 శాతం వాటాను బజాజ్ కన్జ్యూమర్ కేర్ కొనుగోలు చేయబోతున్నది. ఇక విశాల్ పర్సనల్ కేర్‌లో 2012లో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ పీపుల్ క్యాపిటల్ పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు ఈ వాటాలనూ బజాజ్ కన్జ్యుమర్ కేర్ కొనాల్సి ఉన్నది. కాగా, ప్రస్తుతం మార్కెట్‌లో బంజారా బ్రాండ్ పేరిట వివిధ శిరోజ, చర్మ సంరక్షణ ఉత్పత్తులను విశాల్ పర్సనల్ కేర్ విక్రయిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా లావాదేవీ పూర్తయితే ఈ బ్రాండ్ బజాజ్ కన్జ్యూమర్ కేర్ గూటికి వెళ్లిపోనున్నది. 'ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో బజాజ్ కన్జ్యూమర్ కేర్ వ్యాపార కార్యకలాపాల బలోపేతానికి విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలు వ్యూహాత్మకంగా కలిసిరాగలదు' అని ఈ సందర్భంగా బజాజ్ కన్జ్యూమర్ కేర్ ఎండీ జైదీప్ నంది అన్నారు. శుక్రవారం జరిగిన తమ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో విశాల్ పర్సనల్ కేర్ కొనుగోలుకు ఆమోదం లభించినట్లు ఆయన చెప్పారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2023-24) విశాల్ పర్సనల్ కేర్ రెవిన్యూ రూ.51 కోట్లుగా ఉన్నది. దీన్ని 1991లో స్థాపించారు. హెర్బల్ పౌడర్లు, అలోవెరా జెల్స్, షాంపూలు, హెయిర్ కేర్ పౌడర్లు అమ్ముతున్నది. ఏపీ, తెలంగాణసహా ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో దీనికి 70వేలకుపైగా ఔట్‌లెట్లున్నాయి. ఇదిలావుంటే కుష్రగ బజాజ్ నేతృత్వంలోని 2.5 బిలియన్ డాలర్ల విలువైన బజాజ్ గ్రూప్‌లోగల ఎఫ్ఎంసీజీ కంపెనీయే బజాజ్ కన్జ్యూమర్ కేర్. గత ఆర్థిక సంవత్సరం దీని ఆదాయం రూ.967.71 కోట్లు, లాభం రూ.158.77 కోట్లుగా ఉన్నది. బజాజ్ ఆల్మండ్ డ్రాప్స్ ఆయిల్, కోకోనట్ ఆయిల్, సబ్బులు, సీరమ్స్, షాంపూలు, కండీషనర్లను అమ్ముతున్నది. ఇక ఈ డీల్‌తో ఉత్తరాది మార్కెట్లలో బంజారా బ్రాండ్‌ను విస్తృతపర్చాలని బజాజ్ భావిస్తున్నది.

# సెక్షన్‌వారీగా మ్యాపింగ్ ఆదాయ పన్ను (ఐటీ)

ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులు పాత ఐటీ చట్టం 1961లోని సెక్షన్లతో కొత్త ఐటీ బిల్లు 2025లోని క్లాజులను సరిపోల్చుకునే అవకాశాన్ని ఐటీ శాఖ కల్పించింది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల దాదాపు 65 ఏండ్ల ఐటీ చట్టం స్థానంలో నూతన ఐటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పాతదాంట్లో సెక్షన్లుంటే.. కొత్తదాంట్లో వాటికి బదులుగా కొన్ని క్లాజులను ప్రతిపాదించారు. దీంతో ఏ సెక్షన్.. ఏ క్లాజుగా మారిందో తెలియక ట్యాక్స్‌పేయర్స్ గందరగోళంలో పడిపోయారు. నిజానికి కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకొనేవారికి ఈ సెక్షన్లతో ఎలాంటి పనీ లేదు. కానీ పాత ఆదాయ పన్ను విధానాన్ని అనుసరించేవా రికి సెక్షన్లు తప్పనిసరి.

వయసు ఆధారంగా గరిష్ఠంగా ఆయా పొదుపు, పెట్టుబడులు, ఖర్చులు, చెల్లింపులపై రూ.11 లక్షల నుంచి 15 లక్షలదాకా పన్ను మినహాయింపు ప్రయోజనాలను పొందవచ్చు మరి. దీంతో కొత్త ఐటీ చట్టంలో కీలకమైన సెక్షన్లను క్లాజులుగా మార్చడంతో ట్యాక్స్‌పేయర్స్ ఐటీ రిటర్నుల సమయంలో ఇబ్బందిపడే ప్రమాదం ఏర్పడుతున్నది. దీనిపైన అటు ట్యాక్స్‌పేయర్స్ నుంచి ఇటు ఎక్స్‌పర్ట్స్ నుంచి ఆందోళనలు, విమర్శలూ వెల్లువెత్తాయి. ఇక ఇప్పటికే పాత ఆదాయ పన్ను విధానం జోలికి వెళ్లకుండా ప్రతీ బడ్జెట్‌లో కొత్త ఆదాయ పన్ను విధానంలోనే సవరణలు చేస్తూ వస్తున్న మోదీ సర్కారు.. పాత ఆదాయ పన్ను విధానానికి పూర్తిగా చరమగీతం పాడేందుకే ఈ కొత్త ఐటీ బిల్లు, సెక్షన్ల మార్పు చేపట్టిందన్న ఆరోపణలూ వచ్చాయి.

ఈ క్రమంలోనే సెక్షన్ టు క్లాజ్ అర్థం చేసుకునేలా ఐటీ శాఖ వెబ్‌సైట్‌లో పాత ఆదాయ పన్ను చట్టంతో కొత్త ఆదాయ పన్ను బిల్లును మ్యాపింగ్ చేస్తూ అప్‌లోడ్ చేశారు. పాత ఐటీ చట్టాన్ని సరళతరం చేస్తామని కొత్త ఐటీ బిల్లును ఈ నెల 13న లోక్‌సభలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. ఇందులో 2.60 లక్షల పదాలు, 536 సెక్షన్లు, 23 చాప్టర్లు, 57 టేబుళ్లున్నాయి. అలాగే ట్యాక్స్ ఇయర్ విధానాన్ని పరిచయం చేశారు. ప్రస్తుత చట్టంలో ఆర్థిక సంవత్సరం (ఎఫ్‌వై), మదింపు సంవత్సరం (ఏవై)గా ఉండగా, వీటిని ట్యాక్స్ ఇయర్‌గా మార్చారు.

# అబ్బాయిలూ బీ కేర్ ఫుల్..



లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. చైనాలో విపరీత ఆదరణ పొందుతోంది. అక్కడి అమ్మాయిలకు ఈ గేమ్ బాగా నచ్చుతోందట. ప్రతి నెలా సుమారుగా 60 లక్షల మంది యాక్టివ్ ప్లేయర్లు ఉన్నట్లు లెక్కలు చెప్తున్నాయి. అలాగే ఈ గేమ్ సృష్టికర్త ఏకంగా బిలియనీర్ అయ్యారని ఫోర్బ్స్ తన కథనంలో పేర్కొంది. అసలేంటీ లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. చైనా యువతులకు అంతలా నచ్చడంలో కారణమేంటీ.. తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు.. ఇదిగో ఇలాగే మొదలౌతుంది ప్రతీ లవ్ స్టోరీ. గుండెల్లో గంటలు మోగకపోయినా.. నచ్చిన చిన్నది లేదా చిన్నోడు కనపించగానే కాస్త సన్నగానైనా మదిలో వీణలు మోగుతుంటాయి. గుండె వేగంగా కొట్టుకోవడం కామన్. ఆ తర్వాత వాళ్ల కళ్లల్లో పడాలనే తాపత్రాయం.. వారి దృష్టిని ఆకర్షించాలనే ప్రయత్నం.. అలా చూపులు కలిసిన శుభవేళ.. రెండు గుండెలు ఒక్కటే ప్రేమగీతం పాడుతుంటాయి. కొన్ని రోజులు బాగానే గడుస్తాయి. ప్రియా నిను చూడలేక అంటూ నిరంతరం వారి ధ్యాసే, ప్రతీ క్షణం వారి ఊహే, ఊహలు గుసగుసలాడే అంటూ మెసేజ్‌లు, వాట్సాప్ కాల్స్.. ప్రేమ యాత్రలకు బృందావనమూ, నందనవనమూ ఏలోనో అంటూ పార్కులు, పబ్బుల చుట్టూ షికార్లు.. ఆ తర్వాత మొదలౌతుంది అసలు సంగతి.

అతగాడికేమో.. ఉద్యోగం చేస్తుంటే పని ఒత్తిడి, జాబ్ లేకుంటే ఉద్యోగం సంపాదించాలనే టెన్షన్.. అటు అమ్మాయి సంగతీ అలాగే ఉంటుందనుకోండి. అయితే నచ్చిన వాడితో కాసేపు మనసు విప్పి మాట్లాడుకోవాలని, ప్రేమ మొదలైన రోజుల్లో మాదిరిగా చాటింగ్, ఫోన్ కాల్స్ చేయాలనే ఆశ. ఇక్కడ చూస్తే ఫుల్ బిజీ షెడ్యూల్, గతంలో మాదిరిగా సమయం కుదరకపోవచ్చు. ఇలాంటి సమస్యలు రిలేషన్‌షిప్, ప్రేమ.. పేరేదైనా సర్వసాధారణం. తమ రోజువారీ జీవితంలో ఏం జరిగిందనేదీ ప్రతిదీ తమ బాయ్ ఫ్రెండ్‌తో చెప్పుకోవాలని, కష్టసుఖాలు పంచుకోవాలని అనుకుంటారు అమ్మాయిలు. కానీ తమ బాయ్ ఫ్రెండ్ ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని, మెసేజులకు త్వరగా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేస్తుంటారు. ప్రతీ ప్రేయసీ.. తన ప్రేమికుడిపై చేసే కంప్లైంట్స్ ఇవే.

అయితే ఈ సమస్యలకు సాంకేతికత సాయంతో చెక్ పెట్టే ప్రయత్నం చైనాలో జరుగుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే ఏఐ బాయ్ ఫ్రెండ్స్ ఇప్పుడు చైనాలో నయా ట్రెండ్.

అక్కడ ఇప్పుడు డేటింగ్ సిమ్యులేషన్ గేమ్‌కు ఆదరణ పెరుగుతోంది. అలాగే ఈ ఏఐ బాయ్ ఫ్రెండ్స్‌ను సృష్టించిన వ్యాపారవేత్త ఏకంగా బిలియనీర్ అయ్యారు. ఫోర్బ్స్ కథనం ప్రకారం.. డేటింగ్ సిమ్యులేషన్ గేమ్.. లవ్ అండ్ స్పేస్‌కు ప్రతి నెలా 60 లక్షల మంది యాక్టివ్ ప్లేయర్లు ఉన్నారు. షాంఘైకు చెందిన పేపర్ గేమ్స్ సంస్థ 2024 జనవరిలో ఈ లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ లాంఛ్ చేసింది. ఈ గేమ్.. ఏఐ సాయంతో పనిచేస్తుంది. అలాగే ఐదు రకాల మగ గొంతులతో దీనిని రూపొందించారు. ఒక అమ్మాయి తన బాయ్ ఫ్రెండ్ ఎలా ఉండాలని కోరుకుంటుందో.. అలాంటి బాయ్ ఫ్రెండ్‌ను ఇందులో సృష్టించారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వర్చువల్ బాయ్ ఫ్రెండ్.. అమ్మాయిలు లేదా యూజర్ల సందేశాలకు త్వరగా స్పందిస్తాడు. అలాగే వారి ఫోన్ కాల్స్‌కు వెంటనే సమాధానమిస్తూ, వారికి నచ్చినట్లు ఎంత సేపైనా ఓపికగా వింటూ, మాట్లాడుతూ ఉంటాడు. ఈ డేటింగ్ సిమ్యులేషన్ యాప్ ఇప్పుడు చైనా యువతులకు విపరీతంగా నచ్చేసింది. దీంతో పేపర్ గేమ్స్ సృష్టికర్త యావో రున్హావో బిలియనీర్ అయినట్లు ఫోర్బ్స్ తెలిపింది. యావో సంపద భారతీయ కరెన్సీ ప్రకారం 130 కోట్లకు చేరినట్లు తెలిపింది. అలాగే కంపెనీలోనూ మెజారిటీ వాటా యావో పేరిట ఉంది. ఈ స్మార్ట్ ఫోన్ గేమ్ ప్రస్తుతం చైనీస్, ఇంగ్లీష్, జపనీస్, కొరియన్ భాషలలో అందుబాటులో ఉంది. బాయ్ ఫ్రెండ్‌లకు ప్రత్యామ్నాయంగా ఉన్న లవ్ అండ్ స్పేస్ డేటింగ్ సిమ్యులేషన్ గేమ్ చైనా యువతులకు విపరీతంగా నచ్చుతున్న నేపథ్యంలో.. ఇది మన దాకా రాకముందే అబ్బాయిలూ మీ గర్ల్ ఫ్రెండ్‌ను కాస్త పట్టించుకోండి.. ఆమే చెప్పేది కాస్త ఓపికగా వింటూ, నచ్చినట్లు ఉండండి అంటున్నారు ఈ వార్త తెలిసిన నెటిజనం.

# కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్..



అత్తగారింట్లో కోడలిని ముప్పు తిప్పలు పెట్టిన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. ఇలాంటివి ప్రతీ ఇంట్లోనూ సర్వసాధారణమే అని అనుకుంటాం. కానీ కొన్ని ఘటనలు మాత్రం అంతకుమించి ఉంటాయి. కోడలిని అత్తామామ, కట్టుకున్న భర్త.. అత్తింట్లో ఎంత హింసకు గురి చేస్తారు అనేవి చాలానే చూసి ఉంటాం. కానీ ఈ ఘటన గురించి వింటే మాత్రం.. ఆ అత్తామామలు రాక్ష సుల కంటే దారుణం అని అనుకోక మానరు. ఎందుకంటే కోడలికి.. ఆ అత్తమామలు ఎయిడ్స్ ఇంజెక్షన్ ఇచ్చారు. ఇంతకీ వాళ్లు ఎందుకు అలా చేశారు. ఆ కోడలికి అత్తగారింట్లో అడుగడు గునా వేధింపులే ఎదురయ్యాయి. భర్తను, అత్తామామలను ఎంత బాగా చూసుకున్నా.. వారు కనికరించలేదు. కూతురిలాగా చూడాల్సిన కోడలిని.. వారు కనీసం మనిషిగా కూడా చూడలేదు. పుట్టింటి నుంచి భారీగా కట్నం తీసుకువచ్చినా.. మరింత కట్నం తీసుకురావాలని ఒత్తిడి తీసుకువచ్చారు. వినకపోవడంతో ఆమెను చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే ఎంతకు తెగించారంటే.. అత్తమా మలు కలిసి.. కోడలికి ఎయిడ్స్ ఇంజెక్షన్ కూడా ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఆ యువతి తండ్రి.. కోర్టును ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఉత్తరాఖండ్‌లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ సహరాన్‌పూర్‌కు చెందిన ఒక యువతికి.. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌కు చెందిన అభిషేక్ అలియాస్ సచిన్‌తో పెళ్లి జరిగింది. 2023 ఫిబ్రవరి 15వ తేదీన వారి వివాహం జరిగింది. కట్నకానుకల కింద యువతి తల్లిదండ్రులు మొత్తంగా రూ.15 లక్షలు ముట్టజెప్పారు. ఈ క్రమంలోనే పెళ్లి జరిగిన కొన్నిరోజులు ఆ యువతి పట్ల భర్త, అత్తామామలు బాగానే ఉన్నా.. ఆ తర్వాతే వాళ్ల అసలు రాక్షసరూపం బయటికి వచ్చింది. కట్నం డబ్బులు కాకుండా.. స్కార్పియో కారు కొనాల ని.. అందుకు రూ.25 లక్షలు పుట్టింటి నుంచి తీసుకురావాలని.. ఆ యువతిని అత్తామామలు వేధించసాగారు.

అయితే జరిగిన విషయాన్ని పుట్టింటివారికి ఆ యువతి చెప్పగా.. అంత డబ్బు తాము ఇచ్చుకోలేమని వారు చెప్పడంతో.. ఆ యువతిని ఇంటి నుంచి పుట్టింటికి వెళ్లగొట్టారు. దీంతో గ్రామంలో పంచాయితీ పెద్దలను ఆశ్రయించ గా.. అత్తింటివారికి నచ్చజెప్పి ఆ యువతిని తిరిగి కాపురానికి పంపించారు. అయినప్పటికీ బుద్ధి మారని ఆ అత్తమామలు.. ఆమెను మరిన్ని డబ్బులు తీసుకురావాలనే వేధింపులు మాత్రం ఆపలేదు. అదనపు కట్నం తీసుకురావాలని ఆ యువతిని మానసికంగా, శారీరకంగా తీవ్ర చిత్రహింసలకు గురి చేశారు. ఈ క్రమంలోనే తమ కుమారుడికి మరో పెళ్లి చేస్తే.. మళ్లీ కట్నం వస్తుందని ఆశపడ్డ తల్లిదండ్రులు ఆ యువతిని హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే భయంకరమైన ఎయిడ్స్ వ్యాధి కలిగిన ఇంజెక్షన్‌ను ఆ యువతికి ఇచ్చారు. ఆ ఇంజెక్షన్ ఇచ్చిన కొన్నిరోజులకు ఆ యువతి తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఆస్పత్రికి తీసుకెళ్లి మెడికల్ టెస్ట్‌లు చేయించగా.. ఆమెకు హెచ్ఐవీ సోకినట్లు డాక్టర్లు చెప్పడంతో అంతా షాక్ అయ్యారు. దీంతో ఆమె భర్త అభిషేక్‌కు ఎయిడ్స్ టెస్ట్ చేయగా.. అతడికి హెచ్ఐవీ లేదని తేలింది. దీంతో బాధితురాలి కుటుంబసభ్యులు ఆమె అత్తమామలపై అనుమానంతో.. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవ డంతో.. చివరికి బాధితురాలు తండ్రి స్థానిక కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో గంగో కొత్వాలి పోలీసులు.. అభిషేక్, అతని తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులపై వరకట్న వేధింపులు, దాడి, హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అనంతరం ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# మహా కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం..



**మహా కుంభ్‌నగర్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం.. తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు 2 సార్లు మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగాయి. తాజాగా శనివారం మరోసారి మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది. మహా కుంభ్‌నగర్‌లోని లవకుష్ ధామ్ శిబిరంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడిం చారు. ఈ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం ఏమీ జరగలేదని వెల్లడించారు.**

మహా కుంభమేళాలో మరోసారి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. కుంభమేళా ప్రారంభం అయినప్పటినుంచి ఫైర్ యాక్సిడెంట్ జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో రెండుసార్లు అగ్ని ప్రమాదాలు జరగ్గా.. తాజాగా మళ్లీ మంటలు అంటుకున్నాయి. దీంతో టెంట్లు కాలిబూడిదయ్యాయి. అయితే ఈ అగ్ని ప్రమదాంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. మరికొన్ని రోజుల్లో మహా కుంభమేళా ముగియనున్న నేపథ్యంలో రోజురోజుకూ భక్తుల తాకిడి పెరుగుతోంది. ఈ క్రమంలోనే మహా కుంభమేళా నిర్వహణ కోసం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం.. అనేక చర్యలు చేపడుతోంది. అయితే మహా కుంభమేళా సందర్భంగా మహా కుంభ్‌నగర్‌లో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటుండటం.. తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఇప్పటివరకు 2 సార్లు మహా కుంభమేళాలో ఫైర్ యాక్సిడెంట్లు జరిగాయి. తాజాగా శనివారం మరోసారి మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం జరిగింది.

మహా కుంభ్‌నగర్‌లోని లవకుష్ ధామ్ శిబిరంలో ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. ఈ అగ్నిప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని.. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. అయితే ఈ అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం ఏమీ జరగలేదని వెల్లడించారు. ఈ అగ్ని ప్రమాదం కారణంగా అక్కడ ఏర్పాటు చేసిన మండపాలు, టెంట్లు కాలిబూడిదయ్యాయి. కాగా ఈ అగ్ని ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడి కాలేదు.

మహా కుంభమేళాలో ఇప్పటికే రెండుసార్లు అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఫిబ్రవరి 9వ తేదీన సెక్టార్-23లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా ఫైర్ యాక్సిడెంట్ సంభవించింది. వెంటనే ఫైరింజన్లను తరలించి మంటలను అదుపు చేశాయి. అంతకుముందు జనవరి 30వ తేదీన తొలిసారి అగ్నిప్రమాదం జరిగింది. ఛత్నాగ్ ఘాట్ వద్ద టెంట్ సిటీలో మంటలు చెలరేగి.. దాదాపు 10 టెంట్లు దగ్ధం అయ్యాయి. మొత్తం మీద.. మహా కుంభమేళా ప్రారంభం నుంచి అనేక అగ్నిప్రమాదాలు సంభవించాయి. జనవరి 19వ తేదీన గోరఖ్‌పూర్‌లోని గీతా ప్రెస్ క్యాంప్‌లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనతో 150కి పైగా కుటుంబాలు ప్రభావితం అయ్యాయి. ఆ అగ్నిప్రమాదానికి గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణమని తెలుస్తోంది. అయితే గీతా ప్రెస్ వ్యక్తులు మాత్రం అగ్నిప్రమాదం బయటి వారి వల్ల జరిగిందని పేర్కొన్నారు.

# అభివృద్ధి బాట.. కౌలాస్ కోట

**ప్రత్యేక చొరవ చూపిస్తున్న ఎమ్మెల్యే తోట**

**బిచ్కుంద ఫిబ్రవరి (జనంసాక్షి)**







కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని కౌలాస్ కోట అభివృద్ధికై ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు ప్రత్యేక దృష్టి సారించారని ప్రజలు అనుకుంటున్నారు. ఎంతో చారిత్రక కట్టడమైన కౌలాస్ కోటను ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అనేక సార్లు సందర్శించడమే గాకుండా స్వాతంత్ర్య దినోత్సవ, గణతంత్ర దినోత్సవ రోజున మన జాతీయ జెండాను రెపరెపలాడిస్తున్నారు. చరిత్రలోకి వెళితే.. కైలాస గిరిదుర్గాన్ని 12వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించారు. 1323లో యువరాజు అలాఫ్ ఖాన్ (తర్వాత కాలంలో మహమ్మద్ బిన్ తుగ్లక్గా రాజయ్యాడు) ఈ కోటను జయించిన ప్రస్తావన ఉంది. ఆయన తండ్రి ఘాజీ బేగ్ తుగ్లక్ ఇటీవలే రాజ్యంలో చేరిన వరంగల్ ప్రాంతంలో తిరుగుబాట్లు అణచివేయటానికి పంపించాడు. సేనలలో కలరా వ్యాపించడంతో తొలి ప్రయత్నం సఫలం కాలేదు. మలి ప్రయత్నంలో బీదరు,.కౌలాస్లను ఆ తర్వాత వరంగల్లును చేజిక్కించుకున్నాడు. బహమనీల పాలనలో కౌలాస్ కోట సరిహద్దు కోటగా, గట్టి బలగంలో రక్షింపబడుతూ ప్రముఖ పాత్ర పోషించింది. పాక్షిక ద్రావిడ శైలిలో నిర్మించిన ఈ కోట నైఋతి బాలాఘాట్ కొండల్లో వెయ్యి అడుగుల ఎత్తులో కౌలాస్నాలా ఒదిగిన ఒక కొండపై ఉంది. చుట్టూ దట్టమైన అడవి, క్రింద నది ఉండటంతో ఇక్కడి ప్రకృతిదృశ్యం అమెజాన్ అడవిని తలపిస్తుంది. కౌలాస్ కోటకు 57 బురుజులున్నాయి. కోట లోపల అనేక ఆలయాలు, దర్గాలు ఉన్నాయి. కోట ద్వారాలపై చెక్కిన అలంకరణలు, హృద్యంగా చెక్కబడిన హిందూ దేవతాశిల్పాలు కోట యొక్క ఆకర్షణలు.కోటకు రెండు ప్రవేశాలున్నాయి. రెండింటికీ స్వాగతతోరణాలున్నాయి. వీటిపై గండభేరుండం వంటి కాకతీయ రాజచిహ్నాలను చూడవచ్చు. 1687లో ఔరంగజేబు, అబుల్ హసన్ తానీషాను ఓడించి, గోల్కొండను మొఘల్ సామ్రాజ్యంలో కలుపుకొన్నప్పుడు, కౌలాస్ కోట బాధ్యతను ఇక్లాస్ ఖాన్, ఖూనీ ఖాన్ అనే ఇద్దరు ఖిల్లాదార్లకు అప్పగించాడు. వీరిద్దరు ఇక్కడ తమ పేర్లతో పెద్ద మసీదులను కట్టించారు.అండాకారంలో ఉన్న కోటకు మూడు ప్రకారాలతో మూడంచెల రక్షణ వ్యవస్థ ఉంది. కోట బురుజులలో మల్లికా, హుస్సేన్, నవ్గజీ, కడీ కా బుర్జ్ ముఖ్యమైనవి. ఇక్కడి నుండి సుదూరదృశ్య వీక్షణం వీలౌతుంది. కోటలోని ఆలయాల్లో 1813లో రాణీ సోనేకువార్ బాయి కట్టించిన రాజపుతానా శైలి రామమందిరం కూడా ఉంది. కాశీ విశ్వనాథ ఆలయాన్ని పోలి రాజపుత్ర రాజులు కట్టించిన కాశీకుండ్ ఆలయంలో సహజసిద్ధమైన నీటి ఊట ఉంది. కోటలో ఇవేకాకుండా మరో మూడు (రామ, హనుమ, బాలాజీ) ఆలయాలున్నాయి. కోట వెనుక భాగంలో అష్టభుజి మాత లేదా జగదాంబ ఆలయం ఉంది. రాజపుత్ర రాజులకు యుద్ధానికి వెళ్ళేముందు ఇక్కడ ప్రార్థించేవారు. కోటలో 16-17వ శతాబ్దానికి చెందిన రెండు మసీదులు (ఇక్లాస్ ఖాన్ మసీదు, ఖూనీ ఖాన్ మసీదు), ఒక దర్గా (షా జియా-ఉల్-హఖ్ దర్గా), బెహ్లూల్ షా వలీ సమాధి మందిరం కూడా ఉన్నాయి. 20వ శతాబ్దం ప్రారంభంలో కోటలో పది ఫిరంగులుండేవి. అయితే వాటిని నాందేడ్, మద్నూర్, బిచ్కుంద పోలీసు స్టేషన్లకు తరలించబడినవి. మిగిలిన నాలుగు ఫిరంగుల్లో, 27 అడుగుల పొడవున్న నవగజీ తోప్ అద్భుతమైన లోహనైపుణ్యానికి ప్రతీక. 500 మీటర్ల మేరకు విస్తరించి ఉన్న తామరపూల చెరువు మరో ఆకర్షణ. కాగా ఈ కోటను అభివృద్ధి చేయడానికి ప్రస్తుత ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు అనే కృషి చేస్తున్నారు.

## జన జాతరను తలపించిన స్వదేశీ మేళా...



**ముగింపు రోజున కిటకిటలాడిన స్వదేశీ మేళా స్టాళ్లు**

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :**



స్వదేశీ సంస్థలు, వస్తు ఉత్పత్తులను ప్రోత్సహిం చాలనే లక్ష్యంతో స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణం అంబేద్కర్ స్టేడియంలో గత ఆరు రోజులుగా నిర్వ హించిన స్వదేశీ మేళా గ్రాండ్ సక్సెస్ అయింది. ఈ నెల 11 వ తేదిన ఉద్యోగ మహోత్సవ్ జాబ్ మేళాతో , దాదాపు 210 స్వదేశీ వస్తు ప్రదర్శన స్టాల్స్ తో స్వదేశీ మేళా వైభవంగా ప్రారంభమైంది. ప్రతి రోజు ప్రముఖుల తో వివిధ అంశాలతో సెమినార్ ప్రోగ్రాం లు , సాయంత్రం వేళ సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించి అందర్నీ అకట్టుకు న్నాయి. ఆదివారం ముగింపు రోజున జరిగిన సెమినార్ ప్రోగ్రాం కు కాలమ్నిస్ట్, ప్రోమినెంట్ అథార్ భాస్కర్ యోగి , ఉస్మానియా యూని వర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ కసిరెడ్డి వేంకట్ రెడ్డి ముఖ్య వక్తలుగా హాజరై మాట్లాడారు .1991 లో నాగపూర్ కేంద్రంగా ప్రారంభమై స్వదేశీ జాగరన్ మంచ్ దేశ సామాజిక , సాంస్కృతిక , ఆర్థిక రంగాల వికాసం కోసం స్వదేశీ పరిజ్ఞానంతో, స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్స హం కోసం పనిచేస్తున్న ఏకైక స్వచ్ఛ ంద సంస్థ అని కొనియాడారు. స్వదేశీ బావజాల వ్యాప్తి కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా స్వదేశీ జగరన్ మంచ్ ఎనలేని కృషి చేస్తుందన్నారు. మన సాంస్కృతిక, సామాజిక , ఆర్థిక రంగాల పునర్ వైభవం కోసం స్వదేశీ జాగరణ మంచ్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

## ఎర్రవల్లి గ్రామం ముంపునకు గురికాకుండా కాపాడాలి

**చారకొండ, ఫిబ్రవరి 16 (జనంసాక్షి)**



డిండి లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా మండలంలోని గోకారం రిజర్వాయర్లో ఎర్రవల్లి, ఎర్రవల్లితండాలు ముంపుకు గురికాకుండా కాపాడాలని ఎర్రపల్లి గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరారు. ఏరాజకీయ పార్టీల నాయకులు ఓట్లు అడగడానికి రాకూడదని ఎర్రవల్లిలో గ్రామస్థులు ఆదివారం బ్యానర్లను ఏర్పాటు చేశారు. ఈసం దర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గోకారం రిజర్వాయర్ ను నిర్మిస్తే ఎర్రవల్లి, ఎర్రవల్లితండా గ్రామాలు ముంపుకు గురి అవుతాయని అన్నారు. ప్రభుత్వం వెంటనే రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించే వరకు ఏరాజకీయ పార్టీల నాయకులు మాగ్రామాలకు ఓట్లు అడగడానికి రాకుడాదని అన్నారు. ప్రజాస్వామ్యంలో మాగ్రామాలకు జరుగుతున్న అన్యాయానికి ప్రభుత్వానికి వ్యతిరేఖంగా త్వరలో జరుగబోయో స్థానిక సంస్థల ఎన్నికలను ముకుమ్మడిగా బహిష్కరిస్తామని హెచ్చరించారు. రిజర్వాయర్ సామర్థ్యాన్ని తగ్గించి మాగ్రామాలను ముంపుకు గురికాకుండా చూడాలని

ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రభుత్వం నుండి స్పష్టత వచ్చేవరకు ఉద్యమిస్తామని గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమం లో గ్రావ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతే ఇవ్వనోళ్లు పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తారా..?

**గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి**

**బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు**

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి)**



ప్రతి నెల నిరుద్యోగ భృతి కింద రూ.4000 ఇస్తామని నిరుద్యోగుల ఓట్లు దండుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని , బిజెపి పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కకొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయించడానికి బిజెపి శ్రేణులు కృషి చేయాలని బిజెపి పార్లమెంట్ కన్వీనర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు అన్నారు. హుస్నాబాద్ పట్టణ బిజెపి శాఖఆధ్వర్యంలో ఆదివారం రోజున పట్టభద్రఓటర్ ఇళ్లకు వెళ్లి బిజెపిపట్టభద్ర ఎమ్మెల్సీ అంజిరెడ్డి టీచర్ ఎమ్మెల్సీ కొమురయ్య కు 1 వ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రవీణ్ రావు కోరారు . ఆయన మాట్లాడుతూ పట్టభద్రులను, ఉద్యోగ ఉపాధ్యాయులను మోసం చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం నేడు ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్స్ ల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగులకు కాంగ్రెస్ హామీ నిరుద్యోగ భృతి రూపాయలు 4000 నేటికీ ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతుందని , ఒక్కో నిరుద్యోగికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ. 56000 బాకీ పడిందన్నారు. పట్టభద్రులకు ఎలాంటి ఉపాధి చూపెట్టకుండా,నిరుద్యోగ భృతి కూడా ఇవ్వని కాంగ్రెస్ సర్కార్ పట్ల పట్టభద్రులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. మోడీ బీసీ కాదని పేర్కొన్న స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ బిసి కాదని నిరూపించాలని మీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ది ఏ కులమో, ఏ మతమో చెప్పాలని ప్రవీణ్ రావు సవాల్ విసిరారు.నిరుద్యోగ పట్టభద్రులను మోసం చేసిన కాంగ్రెస్ కు పట్టబద్రులు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ ప్రచారకార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ గురల లక్ష్మారెడ్డి,బార్ అసోసియేషన్ అధ్యక్షులు విలాసాగరం మురళి మోహన్, హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాస్, మహిళ మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి తోట స్వరూప, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికారప్రతినిధి శంకర్బాబు , వడ్లకొండ రవికుమార్ ,పట్టణ ప్రధానకార్యదర్శి రాయికుంట చందు, తోట సమయ్య,రాంప్రసాద్,నాగార్జున, ఆశదాపు శ్రీనివాస్, భూషంకర్, పోలోజు రాజేందర్, నారోజు నరేష్, పాల్గొన్నారు.

## కేసీఆర్‌కు వద్దిరాజు రవిచంద్ర విషెస్

**హైదరాబాద్ (జనంసాక్షి)**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయించి ప్రజల 70 ఏళ్ల కలను నిజం చేసిన మహానేత కేసీఆర్ అని ఆయన కొనియాడారు. పదేళ్ల కేసీఆర్ సుపరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెంది బంగారుమయం అయ్యిందని ఒక ప్రకటనలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు అందరూ కూడా దండుగ అనుకున్న వ్యవసాయాన్ని పండుగ అని ఆచరణలో నిరూపించిన మహనీయులు కేసీఆర్ అని ఎంపీ వద్దిరాజు వివరించారు. గోదావరి జలాలు వృధాగా సముద్రం పాలవ్వ కుండా మహత్తరమైన కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి రికార్డు సమయంలో పూర్తి గావించి తెలంగాణను సస్యశ్యా మలంగా తీర్చిదిద్దిన దార్శని కులు కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర ప్రస్తుతిం చారు. కేసీఆర్ పెద్ద సంఖ్యలో గురుకులాలను నెలకొల్పి అన్నివర్గాల వారికి ఇంగ్లీష్ మీడియంలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉచిత విద్యతో పాటు పోషకాహారాన్ని అందించారని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకులు, తెలంగాణ అభివృద్ధి ప్రధాత, తెలంగాణ జాతిపిత జన్మదినం సందర్భంగా సోమవారం (17వ తేదీ) మనమందరం పెద్ద సంఖ్యలో మొక్కలు నాటుదామని బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.

## వాయిదాలు.. ఎదురుచూపులు..!

**సూర్యాపేట/హైదరాబాద్ (జనంసాక్షి)**




**స్థానిక ఎన్నికల కోసం మండలాలు, పల్లెల్లో నిరంతర చర్చలు**

**నియోజక, జిల్లాస్థాయి నేతలతో ఆగని మంతనాలు**

స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరిగే సూచనలు కనిపించడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్లు, మున్సిపాలిటీలలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని సూర్యాపేట, యాద్రాద్రి, నల్గొండ జిల్లాలోని 1740 పంచాయతీలకు 2019 జనవరిలో ఎన్నికలు జరిగాయి. గతేడాది జనవరి 31న సర్పంచిల పదవీకాలం ముగిసింది. అదేవిధంగా 73 జెడ్పీటీసీ, 764 ఎంపీటీసీలకు 2019 మే నెలలో ఎన్నికలు జరిగాయి. గతేడాది జులై 3 న మండల పరిషత్, జులై 4న జిల్లా పరిషత్ల పాలక మండళ్ల పదవీకాలం ముగిసింది. ఇక 19 మున్సిపాల్టీలకు 2020 లో ఎన్నికలు నిర్వహించారు. గత నెల 26 న వాటి పదవీకాలం కూడా ముగిసింది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్లు, మున్సిపాల్టీలు ఎన్నికలు నిర్వహించలేక పోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది.కాగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు ప్రారంభమైంది. అయితే బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికల పై ముందుకెళ్లాలని సర్కారు భావిస్తోంది. దీంతో స్థానిక పోరు ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. సమగ్ర కులగణన చేయడంతో పాటు డెడికేటెడ్ బీసీ కమిషన్ ఏర్పాటు చేసింది. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకుమార్చి మొదటి వారంలో కేబినెట్లో నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో తీర్మానం చేయనున్నట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు.

**వాయిదాపడ్డా తగ్గని ఉత్సాహం**

తెలంగాణలో వాయిదా పడిన స్థానిక సంస్థల ఎన్నికలు ఆశావహుల్లో నిరాశను పెంచాయి. ప్రధానంగా పది సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆశావహులు పలు పదవులపై ఆశలు పెట్టుకున్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు అక్కడక్కడా కార్పొరేషన్, మార్కెట్, గ్రంథాలయా పదవులు తప్పితే నేటికి కూడా మెజార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రాధాన్యత గల పదవులను ఇవ్వలేదు. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల పై ఆశావహులు గురిపెట్టారు. ఇందుకు గాను పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గత కొంతకాలంగా స్థానిక పాలనలో ఉన్న ప్రాతినిధ్యాన్ని పెంచుకునే అవకాశంగా భావించిన ఆశావహులు ఈ ఎన్నికల నిరవధిక వాయిదాతో అస్పష్టతలో పడిపోయారు. గ్రామ పంచాయతీ నుంచి, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మునిసిపాలిటీలు స్థాయిలో ప్రతినిధులు తమ సమర్థతను ప్రజలకు నిరూపించుకునే అవకాశం కోసం ఎదురు చూస్తున్నా, అనూహ్యంగా మారిన రాజకీయ సమీకరణాలు అనేక ఊహాగానాలకు తావి చ్చాయి. ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ఎన్ని కల ప్రక్రియను నిలిపివేశాయి. ఆశావహులు ఇప్పటికే చాటుమాటుగా చేస్తున్న ఉత్సాహం కొంత మేరకు తగ్గిపోతున్నా వారు ఇంకా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గ స్థాయిలో నేతలు తమ అనుచరులతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నారు. సమయానికి ఎన్నికలు జరిపితే ప్రజాస్వామ్య స్ఫూర్తి కాపాడబడుతుందనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు.

## కేసీఆర్ బర్త్ డే వేడుకలకు తెలంగాణభవన్ ముస్తాబు

**హైదరాబాద్ (జనంసాక్షి)**



తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలను అత్యంత ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆదివారం వేడుకల వేదిక తెలంగాణ భవన్ లో జరుగుతున్న ఏర్పాట్లను మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ హెూం మంత్రి మహమూద్ అలీ, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి, యువనేత తలసాని సాయి కిరణ్ యాదవ్, నాంపల్లి నియోజకవర్గ ఇంచార్జి ఆనంద్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు విప్లవ్ కుమార్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, మన్నె గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ లు మన్నె కవిత రెడ్డి, వెంకటేష్, కిషోర్ గౌడ్ తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జన్మదిన వేడుకలు ప్రారంభం అవుతాయని అన్నారు. ఎంతో వైభవంగా నిర్వహించే ఈ వేడుకలలో భాగంగా డప్పు కళాకారులు, గిరిజన వేషధారణ నృత్యాల ప్రదర్శన, కళాకారుల తో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, కేసీఆర్ జీవిత, రాజకీయ ప్రస్థానం తో కూడిన ప్రత్యేక డాక్యుమెంటరీ ప్రదర్శన ఉంటుందని వివరించారు. అంతేకాకుండా 71 వ జన్మదిన సందర్భంగా 71 కిలోల భారీ కేక్ ను కట్ చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ వేడుకలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీమంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, కార్పొరేటర్ లు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ లు, పార్టీ నాయకులు, అభిమానులు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతారని తెలిపారు. కేసీఆర్ జన్మదినం సందర్భంగా పెద్దఎత్తున మొక్కలు నాటడం, పండ్ల పంపిణీ, అన్నదానం, వివిధ ప్రార్ధనా మందిరాలలో ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు ప్రారంభమైనాయని, అనేక ప్రాంతాలలో రైతులు వివిధ రకాలుగా జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేసీఆర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకుంటున్నారని తెలిపారు.

## హైడ్రాను ఓల్డ్ సిటీలో అమలు చేయగలరా..?

**నిజామాబాద్ ఎంపీ డి. అర్వింద్ కుమార్**

**హైదరాబాద్ (జనంసాక్షి)**



హైదరాబాద్ మహానగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతపై ప్రభుత్వాన్ని తీవ్రంగా ప్రశ్నించిన నిజామాబాద్ ఎంపీ డి. అర్వింద్ కుమార్, ఓల్డ్ సిటీలో కూడా ఇదే తీరుగా చర్యలు తీసుకోవాలా? అని సవాల్ విసిరారు. సీఎం రేవంత్ రెడ్డికి నిజమైన ధైర్యముంటే ఓల్డ్ సిటీలో అడుగుపెట్టగలరా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఆదివారం నిజామాబాద్లో జరిగిన ఓ సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ-ముస్లింలపై ఆదాయంపై ఆధారపడి ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో భూ స్థాపితమవుతున్న బీఆర్ఎస్ పార్టీకి ఇక ప్రజల్లో ఆదరణ లేదని, ఆ పార్టీ అధినేత కేసీఆర్ శకం ముగిసిపోయిందని అన్నారు. భారతదేశాన్ని కాషాయమయం చేయడమే తన లక్ష్యమని స్పష్టంగా వెల్లడించిన ఎంపీ అర్వింద్, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు బాధ్యతగా ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శిస్తూ, ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి కుల రాజకీయాలు మాట్లాడటం హాస్యాస్పదమని వ్యాఖ్యానించిన ఎంపీ అర్వింద్, ప్రధాని మోడీని విమర్శించే స్థాయి రేవంత్‌కు లేదన్నారు. హామీలు నెరవేర్చలేక రేవంత్ రెడ్డి అవాస్తవ ప్రచారం చేస్తోన్నారని ఆరోపించారు. ఇటీవల ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు చరిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తు చేస్తూ, తెలంగాణ ప్రజలు కూడా త్వరలో అదే విధంగా తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపుతో రాజకీయాల్లో మార్పు

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి : బీజేపీ ఎంపీ లక్ష్మణ్**

**మల్క కొమురయ్యను గెలిపించాలని పిలుపు**

**నిజామాబాద్ (జనంసాక్షి)**





రాష్ట్రంలోని మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని.. కార్యకర్తలు ఆ దిశగా కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్ సూచించారు. ఆదివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీజేపీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీచర్లు, పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి నిజామాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు ధర్మపురి అర్వింద్, గోడం నగేశ్, ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి లక్ష్మణ్ చీఫ్ గెస్టుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. బీజేపీకి ఉత్తర తెలంగాణ కంచుకోటగా మారిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు పట్టం కడితే తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మారుతుందన్నారు. నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ నిండా ముంచిందన్నారు. టీచర్లను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని లక్ష్మణ్ మండిపడ్డారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి రేవంత్ రెడ్డి మెడలు వంచాలని నిరుద్యోగులు, ఉపాధ్యాయులను ఆయన కోరారు. గతంలో గెలిచిన టీచర్ ఎమ్మెల్సీలుగా గెలిచిన వారు రాజకీయ పబ్బం గడుపుకున్నారే తప్ప ఉపధ్యాయుల సమస్యలపై పోరాడింది లేదని లక్ష్మణ్ విమర్శించారు. టీచర్లు అందరూ ఈసారి ఆలోచించి బీజేపీకి అవకాశం ఇవ్వాలన్నారు. 317 జీవో రద్దుపైనా బీజేపీ పోరాడిందని.. బండి సంజయ్ నాయకత్వంలో కొట్లాడిన విషయాన్ని టీచర్లు మరిచిపోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారుపై రోజురోజుకి వ్యతిరేకత పెరుగు తోంద న్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు కచ్చితంగా విజయం సాధిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ మెదక్ నిజామా బాద్ ఆదిలాబాద్ బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య మాట్లాడుతూ.. టీచర్లకు చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సంఘాలు పెరిగాయే తప్ప వారి సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. టీచర్లు ఈసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. పార్టీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు దినేశ్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# వరుస ఘటనలు ఆశ హాస్పిటల్‌లోనే ఎందుకు?

**ఆర్మూర్, ఫిబ్రవరి 16 ( జనం సాక్షి):**




ఆర్మూర్ పట్టణానికి వివిధ దూర ప్రాంతాల నుండి రోగులు వైద్యం కోసం తరలివస్తారు.నిజామాబాద్ ను మించి ఉత్తమ వైద్య సేవల కోసం ఆర్మూర్ వైద్యులను సంప్రదిస్తారు.సుమారు వందకు పైగా హాస్పిటల్ లు వారి వైద్య సేవలను అందిస్తుండగా మరి ఆశ హాస్పిటల్ లోనే వరుస ఘటనలు ఎందుకు జరుగుతాయో అర్థం కాని పరిస్థితి నెలకొంది.

ఆశ ఆస్పత్రికి ఇలాంటి వరుస ఘటనలు కొత్తేమీ కాదు. ఆర్మూర్ మండలం మంథని గ్రామానికి చెందిన బ్రాహ్మణ పల్లి చిన్నారెడ్డికి జరిగిన ఘటనను బాధిత బంధువుల గోసను వార్త కథనం రూపంలో ప్రచురించాం. ఆర్మూర్ ఆశ హాస్పిటల్ యాజమాన్యం వాస్తవాలను జీర్ణించుకోలేక ఆదివారం మీడియా సమావేశంలో వారి అక్కసు ను వెళ్లగక్కింది. కొందరు జర్నలిస్టులు కావాలనే తమ ఆసుపత్రి పై కక్ష గట్టి వార్తలు రాస్తున్నారని ఎండి చెప్పడం ఆయన హోదా, తీరును తెలియజేస్తుంది.ఆశ హాస్పిటల్ యాజమాన్యం, సిబ్బంది బిల్లుల విషయంలో తరచు రోగులు, రోగి బంధువులతో వాగ్వాదాలకు దిగడం మానుకోవాలి. ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వర చికిత్స అందించి ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు దురుసుగా,పరుష పదజాలంతో మాట్లాడడం, తరచు వివాదాస్పదమ వుతూ వార్తల్లో నిలవడం ఆశ సూపర్ స్పెషాలిటీకి పరిపాటిగా మారింది. లోపాలు, ఇబ్బందులు ఎక్కడ తలెత్తుతున్నాయో ఆశ హాస్పిటల్ యాజమాన్యం సమీక్షించుకోవాలి తప్ప తమ తప్పు తామెరుగరు అని విధానం మానుకోవాలి.

**వాస్తవాలను జీర్ణించుకొని ఆశ హాస్పిటల్ యాజమాన్యం**

**బాధితుల గోసను చూపించిన జర్నలిస్టులు**

**జర్నలిస్టులపై అక్కసు చూపిన హాస్పిటల్ ఎండి**

# మంచిర్యాల జిల్లాలో పులి సంచారం

**అడవిలోకి వెళ్లద్దంటూ దండోరా వేయించిన అటవీశాఖ**

**భయభ్రాంతులకు గురవుతున్న గ్రామీణ ప్రజలు**

**మంచిర్యాల ప్రతినిధి ఫిబ్రవరి 16 జనంసాక్షి**





మంచిర్యాల జిల్లాలో పులి సంచరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ కూలీలు , ప్రజలు భయం భయంగా జీవనం కొనసాగిస్తున్నారు.రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజానీకం పనులకు వెళ్లకపోతే పూట గడవదు వెళితే ప్రాణాలతో ఇంటికి వస్తామో లేదో అంటూ గ్రామీణ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు .మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలో పులి సంచరిస్తుందని,పులి సంచరిస్తున్నట్లు పాదముద్రల ద్వారా అటవీశాఖ అధికారులు ధ్రువీకరించారు .తాండూరు మండలం గోపాలనగర్ అటవీ ప్రాంతాలలో పులి సంచరిస్తోందని అటవీశాఖ అధికారులు ఊరిలో దండోరా వేయించారు . గత 10 రోజుల క్రితం బెల్లంపల్లి మండలంలోని కన్నాల అటవీ ప్రాంతంలో పులి సంచరించింది .నేడు గోపాలనగర్, అచలాపూర్ మల్లన్నగుట్ట సమీపంలో పులి సంచరిస్తోందని ఆ వైపు వెళ్లరాదని కరంట్ తీగలతో ఉచ్చులు పెట్టారని అటవీశాఖ అధికారులు దండోరా వేయించారు.అచ్చులపూర్ నుండి చంద్రవెల్లి వెళ్లే మార్గంలో ప్రజలు ప్రయాణించారదని తెలిపారు .పులి సంచారంతో మంచిర్యాల జిల్లాలో గత కొన్ని రోజులుగా పులి సంచారం తో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.స్థానిక ప్రజలు దట్టమైన అటవీ ప్రాంతంలో వాటికి సరైన ఆహారం లేనందునే అరణ్య%శీ% వీడి జనారణ్యంలోకి వస్తున్నాయని అంటున్నారు . వాటి మూలంగా పనులకు వెళ్లాలంటే ఎక్కడనుండి పులి దాడి చేస్తుందోనని జంకుతున్నారు.అటవీశాఖ అధికారులు పులిని వెంటనే దట్టమైన అరణ్యంలోకి పంపించాలని కోరుతున్నారు..

# నేటి నుండి పసుపు రైతుల రిలే నిరాహార దీక్ష

**ఆర్మూర్, ఫిబ్రవరి 16 (జనం సాక్షి)**



పసుపు రైతులకు పసుపు మద్దతు ధర 17 వేల రూపాయలకు పెంచాలని ఐదు రోజులపాటు ఆర్మూర్ అంబేద్కర్ చౌరస్తా వద్ద రిలే నిరాహార దీక్షలు కొనసాగు తాయని పసుపు రైతులు వినోద్ రెడ్డి,వెల్మ ముత్యంరెడ్డి ,నక్కల రాములు, వన్నెల గంగారెడ్డి లు అన్నారు.ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.ప్రస్తుత పసుపు ధర పదివేల రూపాయలు రైతులకు గిట్టుబాటు కావడం లేదని పసుపు ధరను పెంచి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రిలే నిరాహార దీక్షలకు పసుపు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని రైతులను కోరారు.

# పేరుకే పట్టణం.. గుంతలు పడ్డ రోడ్లు







**మురికి నాళాలు లేని కాలనీలు.**

**ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు**

**ట్రాఫిక్ సిగ్నల్స్ లేక అవస్థలు**

**అదిలాబాద్ ప్రతినిధి ( జనంసాక్షి)**

జాతీయ రహదారికి ఇరువైపులా పెద్ద పెద్ద అందమైన బిల్డింగులు. మావల గ్రామం నుంచి తిరుపెల్లి కాలనీ వరకు రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్ మధ్యలో హైమాస్ లైట్లు మధ్యలో వివిధ రకాల చెట్లు. ఇదంతా చూస్తే ఆహా అనిపిస్తుంది. ఈ నేషనల్ హైవే రహ దారి గుండా నిత్యం వేలాది వాహనాలు వస్తూ పోతుంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న అందమైన బిల్డింగులు నిర్మింప బడి దర్శనం ఇస్తాయి. ఇంకేముంది రోడ్డు గుండా ప్రయాణించే ప్రయాణికులు ఎవరైనా సరే వీటిని చూసి అబ్బ ఎంత పెద్ద పట్టణమో! ఏమి అభివృద్ధి అని ముక్కున వేలేసుకోవడం ఖాయం. కానీ ఇదంతా జాతీయ రహదారి పొడవునా కొన్ని కీలో మీటర్ల వరకు మాత్రమే. తీరా చూస్తే పట్టణం అనేక సమస్యలతో పొంచి ఉంది. పట్టణంలో సుమారు 50 కాలనీల వరకు ఉన్నాయి. అందులో సగం కాలనీల వరకు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతున్నాయి. ఎప్పుడో ఇరవై సంవత్సరాల కాలం

క్రితం నిర్మించిన రోడ్లు పూర్తిగా చెడిపోయి గుంత లతో దర్శనం ఇస్తున్నాయి. ముఖ్యంగా కొత్తగా ఏర్పడిన కాలనీల్లో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి వేళల్లో బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్ళ దేస్తున్నారు. మురికి నాళాలు లేక

రోడ్ల పైనే మురుగు నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో క్రిమూ కీటకాలు చేరి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. రోడ్ల పక్కనే చెత్తా చెదారంతో కూడిన దృశ్యాలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు . పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ లేకపోవడంతో ట్రాఫిక్ వ్యవస్థ అస్త వ్యస్తంగా మారిపోయింది. రద్దీగా ఉన్న రోడ్లపై సగం వరకు వాహనలను అలాగే నిలిపి ఉండడంతో రోడ్డున వెళ్ళే పాద చారులు భయ పడి పోతున్నారు. అడిగే వారు లేరు కదా అని కొంత మంది వాహన దారులు తమ వాహనాలను రోడ్లపైనే ఇష్టం వచ్చినట్టుగా పార్కింగ్ చేస్తున్నారు. పట్టణంలో ఇప్పుడు ఈ సమస్య ప్రధానంగా మారిపోయింది . కొన్ని కాలనీల్లో మంచి నీటీ సరఫరా కాకపోవడంతో ప్రజలు త్రాగు నీటి కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పుడు ఎండా కాలంసమీపిస్తుండటంతో ఈ సమస్య మరింత జటిలం కానుంది. శివారు కాలనీల్లో ఈ సమస్య తీవ్రంగ ఉంది. ముఖ్యంగా శివారు కాలనీల ప్రజలు కనీస సౌకర్యాలు లేక కాలం వెళ్లదీస్తున్నారు. ఎన్ని ఆందోళనలను చేపట్టిన ప్రయోజనం లేకుండా పోతూంది. శివారు కాలనీ ప్రజల సమస్యలు ఎవరికి పట్టవా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన ప్రజా ప్రతినిధులు మారిన పట్టణంలోకాలనీల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా మారిపోయింది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు సంబంధిత జిల్లా అదికారులు పట్టణంలో ఉన్న అన్నీ కాలనీలు, ముఖ్యంగా శివారు కాలనీల వైపు

ద్రుష్టి సారించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

# హైదరాబాద్ రవీంద్ర భారతిలో మెరిసిన అభ్యాస్ విద్యాపీఠం



**గ్లోబల్ లెవెల్ కాంపిటీషన్ లో ప్రతిభ చాటిన విద్యార్థులు**

**గవర్నర్ విష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా బహుమతులు**

**జిల్లేడు చౌదరిగుడా (జనంసాక్షి)**

ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్న అభ్యాస్ విద్యాపీఠం అంచలంచెలుగా ప్రతిభను చాటుకుం టుంది. రాష్ట్రంలో లక్షల్లో ఉన్న పాఠశాలలను వెనక్కి నెట్టేసి తన ప్రతిభతో ముందు వరుసలో నిలిచింది. మీకు ఈ పాఠశాల తెలిస్తే తప్పక మీ పిల్లల్ని ఇందులో చేరుస్తారు రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగుడా కేంద్రంలో నెలకొల్పిన అభ్యాస్ విద్యాపీఠం ఆదివారం నాడు ప్రతిభను చాటింది. ఏకంగా గవర్నర్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంది. పాఠశాల నెలకొల్పి సంవత్సరం కాకముందే ప్రతిభను చాటుకుంటుంది అభ్యాస్ విద్యాపీఠం ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ గౌడ్. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులకు మ్యూజిక్ క్లాసులు, కరాటే క్లాసులు, విద్యార్థుల మేధస్సును గుర్తించి స్పెషల్ గ్లాసులు, నిర్వహిస్తున్నారు. విద్యార్థి తల్లిదండ్రులు నిరక్షరాశులు అయినప్పటికీ ఆ తల్లిదండ్రులకు విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు ఇస్తూ విద్యార్థులను ముందుకు తీసుకెళ్తున్నారు. విద్యార్థులు గవర్నర్ చేతుల మీదుగా బహుమతులు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని విద్యాపీఠం ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు. అదేవిధంగా విద్యార్థి తల్లిదండ్రులు కూడా హర్షం వ్యక్తం చేశారు. బహుమతులు పొందిన విద్యార్థులు అర్చిత, ప్రజ్వల్, మధుసూదన్, హరిప్ రసాద్, గొల్ల దీక్షిత, రేహాన్, జస్వంత్, ఉమాన్, చార్విక్, మనీష్, రోహిత్, మహేష్ వర్షిని అఖిల్ షాపియ పూజిత, లక్ష్మి, గుమ్మటి దీక్షిత, ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



**వీపనగండ్ల, ఫిబ్రవరి 17 (జనం సాక్షి)**

ఫిబ్రవరి 20 వ తేదీ నుండి 23 వ తేదీ వరకు వికారాబాద్ జిల్లాలో జరిగే అండర్ - 16 రాష్ట్రస్థాయి కబడ్డి పోటీలకు వనపర్తి జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజర్స్ కార్యదర్శి మండ్ల కురుమయ్య తెలిపారు. ఆదివారం నిర్వహించిన జిల్లా కబడ్డి జట్టు ఎంపికకు 80 మంది బాలురు, 50 మంది బాలికలు పాల్గొన్నారు.

ఈ ఎంపిక పోటీలను పలువురు పి ఈ టి ల ఆధ్వర్యంలో సెలక్షన్ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ఎస్ జి ఎఫ్ కార్యదర్శి జి సురేందర్ రెడ్డి, పిడి కుమార్, జేఏసీ వేణుగోపాల్, కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు తిరుపతయ్య, పీడీ బాబా, మధు, శ్యామల, పి ఈ టి ఝాన్సీ ల పర్యవేక్షణలో బాలుర జట్టు నుండి 16 మంది, బాలికల జట్టు నుండి 14 మంది క్రీడాకారుల కబడ్డీ జట్టును ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు.

# చారకొండలో ఆరో రోజుకు రిలే నిరాహార దీక్షలు

**నేడు తాసిల్దార్ కార్యాలయం బాధితుల ముట్టడి**

**చారకొండ, ఫిబ్రవరి 16 (జనంసాక్షి)**



చారకొండ మండల కేంద్రంలో ఇల్లు కోల్పోయిన బాధితుల రిలే నిరాహార దీక్షలు ఆరవ రోజు కొనసాగుతున్నాయి ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి బాలస్వామి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు దీక్షలకు హాజరై బాధితులకు సంఘీభావం తెలిపి వారు మాట్లాడుతూ ఇల్లు కోల్పోయి దీనస్థితిలో ఉంటున్న ప్రభుత్వ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని అన్నారు . ఈ నెల 4న ఇళ్లను ప్రభుత్వం నేలమట్టం చేసి చేతులు దులుపుకున్నది కానీ 29 మంది కుటుంబాలు ఎక్కడ ఉన్నారు, ఎలా జీవిస్తున్నారు అనేది మరిచిపోయి కనీసం పునరావాసం కల్పించకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడం వలన బాధితులు రిలే నిరాహార దీక్షలకు పూనుకోవడం జరిగిందని అన్నారు. ఆదివారం ఆరవ రోజుకు చేరినా, ప్రభుత్వ అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని ఇల్లు కోల్పోయిన బాధితుల వైపు కన్నెత్తి చూడకపోవడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించిని ఎడల రేపు సోమవారం చారకొండ మండల తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతా మని తెలియజేశారు. అదేవిధంగా దశలవారీగా పెద్ద ఎత్తున ప్రజాసం ఘాలను సామాజిక సంఘాలను ఈ పోరాటానికి కలిసి వచ్చే వారితో కలుపుకొని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. ప్రభుత్వం ఇల్లు కట్టించి ఇచ్చేవరకు ,50 లక్షల రూపాయల వరకు పరిహారం పెంచేదాకా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితులు సుమతమ్మ, గుండె బాలయ్య, జెల్ల అలివేల ,సందూరు చిట్టెమ్మ , గ్యారలాలమ్మ, అనసూయమ్మ, గుండె కృష్ణయ్య, బొల్లంపల్లి వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# సిఎంపీఎఫ్ఓ కమిషనర్‌గా సంతోష్

(ప్రత్యేకప్రతినిధి/ జనంసాక్షి)



బొగ్గు మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్ బొగ్గు గనుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కి కమిషనర్-ఇన్-ఛార్జ్‌గా ఉంటారు. బొగ్గు మంత్రిత్వ శాఖ, సీఎంపిఎఫ్ ఆర్గనైజేషన్ కారిడార్‌లలో ఇటువంటి చర్చలు జోరుగా జరుగుతున్నాయి. సీఎంపిఎఫ్ ఆర్గనైజేషన్ ప్రస్తుత కమిషనర్ వికె మిశ్రా 30 మే 2025న పదవీ విరమణ చేయనున్నారు. దీని తర్వాత, శ్రీమతి సంతోష్ సీఎంపీఫ్ ఆర్గనైజేషన్ కమిషనర్ బాధ్యతలు చేపట్టే బలమైన అవకాశం ఉంది. ఇది జరిగితే, దాదాపు రెండున్నర సంవత్సరాల తర్వాత, సీఎంపిఎఫ్ ఆర్గనైజేషన్ మళ్లీ ఇన్‌చార్జ్ కమిషనర్ పర్యవేక్షణలో పనిచేస్తారు. సంతోష్ ఇండియన్ స్టాటిస్టిక్స్ సర్వీస్ (ఐ ఎస్ ఎస్) 1999 బ్యాచ్ అధికారి.నిపుణుల అభిప్రాయం ప్రకారం, 2012 నుండి 2015 వరకు, బొగ్గు కంట్రోలర్ అమృత్ ఆచార్య ఇన్-ఛార్జ్ కమిషనర్‌గా ఉన్నారు. ఫిబ్రవరి 2015 నుండి మే 2015 వరకు, బొగ్గు మంత్రిత్వ శాఖకు ఆర్థిక సలహాదారు అనిమేష్ భారతి ఇన్-ఛార్జ్ కమిషనర్‌గా ఉన్నారు. మే 2015లో, బికె పాండాను శాశ్వత కమిషనర్‌గా నియమించారు. జూన్ 2017లో, మిస్టర్ పాండా బదిలీ అయ్యారు. మిస్టర్ భారతికి మళ్ళీ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. ఫిబ్రవరి 2022లో బిసిసిఎల్ సిఎండి సమిరాన్ దత్తాకు సిఎంపిఎఫ్ఓ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు, భారతి నుండి బాధ్యతలు స్వీకరించారు. వికె మిశ్రా 15 ఏప్రిల్ 2022న శాశ్వత కమిషనర్‌గా నియమితులయ్యారు. మిస్టర్ మిశ్రా ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ (ఐఇఎస్)కి చెందినవారని, ఆయన 2025 మే 30న పదవీ విరమణ చేయనున్నారని తెలిసింది. పదవీ విరమణకు 3 నెలల ముందు, మిశ్రా ఫిబ్రవరి నెలలోనే తన అసలు కేడర్‌కు తిరిగి రావాల్సి ఉంది. కానీ చెప్పినట్లుగా, బొగ్గు కార్యదర్శి విక్రమ్‌దేవ్ దత్ అతన్ని 2025 ఏప్రిల్ వరకు కమిషనర్ పదవిలో ఉండమని కోరారు. కమిషనర్ పదవిని ఇన్ ఛార్జ్ చేస్తున్నారు. చర్చకు ప్రధాన కారణాలలో ఒకటి సీఎంపిఎఫ్ ఆర్గనైజేషన్ కమిషనర్ పదవి ఖాళీని ఇంకా ప్రకటించకపోవడం. ప్రస్తుతం, బొగ్గు మంత్రిత్వ శాఖ సీఎంపిఎఫ్ బాధ్యతలను అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్‌లకు అప్పగించింది. బ్రార్ పెన్షన్ స్థిరత్వం కోసం ఏర్పాటు చేసిన కమిటీకి చైర్‌పర్సన్ కూడా.

# మేడ్చల్‌లో పట్టపగలే దారుణ హత్య





- చంపేసి తాపీగా వెళ్లిపోయిన హంతకులు

**మేడ్చల్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** మేడ్చల్ పట్టణంలోని బస్ డిపో ఎదుట 44వ నెంబర్ జాతీయ రహదారిపై దారుణ హత్య. మేడ్చల్ బస్ డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న గన్యా కుమారుడు ఉమేష్(30) ను ఆయన చిన్న కుమారుడు మరో వ్యక్తితో కలిసి కత్తితో పొడిచి, చంపాడు. కుటుంబ కలహాల కారణంగా ఈ దారుణానికి ఒడిగట్టినట్టు సమాచారం. మద్యానికి బానిసై కుటుంబ సభ్యులపై వేధింపులకు పాల్పడుతుండడంపై విసిగిపోయిన చిన్న కుమారుడు హత్యకు పూనుకున్నట్టు సమాచారం. సీఐ సత్యనారాయణ, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. గన్యా స్వగ్రామం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి. మేడ్చల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్ గా పనిచేస్తున్న కారణంగా కుటుంబంతో సహా మేడ్చల్ కు వచ్చి, బతుకుతున్నాడు. ఆయనకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. హత్యకు గురైన వ్యక్తి సంతానంలో రెండు వాడు కాగా, హత్య చేసింది చిన్న కుమారుడిగా భావిస్తున్నారు.



# స్కూటర్‌పై పాలమ్మిన మల్లారెడ్డి!

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** స్కూటర్ పై పాలు అమ్ముతూ మల్లారెడ్డి కనిపించి సందడి చేశారు. అది కూడా మెడలో దండలు, భుజాల చుట్టూ శాలువా కప్పుకుని మరీ ఆయన పాలు అమ్మిన తీరు నిజంగానే ఆసక్తి రేకెత్తించింది. మల్లారెడ్డి పాలు, పూలు అమ్మిన రోజులు పోయాయి కదా. ఇప్పటికీ ఆయన ఇంకా పాలు, పూలు అమ్ముతున్నారా?? అని అనుమాన పడాల్సిన పనిలేదు. ఎందుకంటే.. ఇప్పుడు ఆయన స్కూటర్ పై పాలు అమ్మింది నిజం కాదు. అలా ఓ ఫోజు ఇచ్చారంతే. సోషల్ మీడియాలో ఒకింత ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ ఘటన వివరాల్లోకి వెళితే. మేడ్చల్ జిల్లాలోని మేడ్చల్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న మల్లారెడ్డి.. ఆదివారం బోడుప్పల్ లో ఏదో కార్యక్రమం ఉంటే.. దానికి హాజరయ్యేందుకు వెళ్లారట. ఈ సందర్భంగా అక్కడ ఓ వ్యక్తి పాల క్యాన్లను స్కూటర్ పై పెట్టుకుని వెళ్లడాన్ని మల్లారెడ్డి గమనించారు. తన పాత రోజులు ఆయనకు గుర్తుకు వచ్చినట్టున్నాయి. వెంటనే సదరు వ్యక్తిని నిలిపి.. అతడిని స్కూటర్ పై నుంచి దించి.. పాల క్యాన్లు ఉన్న సదరు స్కూటర్ పై ఎక్కిన మల్లారెడ్డి అలా ఫొటోలకు ఫోజులిచ్చారు. ఆ తర్వాత స్కూటర్ దిగి తన భుజాల చుట్టూ ఉన్న శాలువా తీసి ఆ వ్యక్తిని సన్మానించి అలా వెళ్లిపోయారు.

# నకిలీ కాల్స్ నమ్మొద్దు : ఏసీబీ డీజీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** సైబర్ కేటుగాళ్లు కొత్త కొత్తమార్గాలకలో ప్రజలను మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులను ఏసీబీ అదికారులం అంటూ భయపెడుతున్నారు. ఈ విషయంపై ఏసీబీ డీజీ అలర్ట్ చేశారు. పోలీసులు ఎంతగా అవగాహన కల్పిస్తున్న ఏదో ఒక ప్రాంతంలో ప్రజలు మోసపోతునే ఉన్నారు. సైబర్ కేటుగాళ్ల చేతిలో పడి రూ.లక్షల్లో తమ కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్నారు. సామాన్యుల నుంచి ప్రభుత్వ అధికారుల వరకు మోసగాళ్ల వలలో చిక్కి భారీగా నష్టపోతున్నారు. కేటుగాళ్ల పట్ల ఎన్ని చర్యలు తీసుకుంటున్న మళ్లీ మళ్లీ ఏదో ఒక రూపంలో మోసాలకు పాల్పడుతునే ఉన్నారు. తాజాగా యాదాద్రి జిల్లాలో ఓ ఎమ్మార్వోకు ఏసీబీ అధికారిని అంటూ ఓ కేటుగాడు కుచ్చుటోపీ పెట్టాడు. అవినీతికి పాల్పడుతున్నావ్ అంటూ మోసగాడు డబ్బులు డిమాండ్ చేశాడు. అరెస్టు చేయకుండా ఉండాలంటే తాను చెప్పిన ఖాతాలో డబ్బులు వేయాలని బెదిరించాడు. డబ్బులు వేస్తే ఏం పట్టించుకోమని నమ్మబలికాడు. ఎమ్మార్వో భయపడిపోయి కేటుగాడు చెప్పిన ఖాతాల్లో డబ్బులు వేశాడు. సుమారుగా రూ. 3 లక్షల 30 వేలను ఆన్‌లైన్ ద్వారా ఎమ్మార్వో దామోదర్ బదిలీ చేశారు. అయితే, ఏసీబీ పేరుతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యవహారంపై ఏసీబీ డీజీ స్పందించారు. ప్రభుత్వ ఉద్యోగులపై కేసులు నమోదు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఏసీబీ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడిన వెంటనే ఏసీబీకి, లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఈ విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. మీపై కేసు లేకుండా చూస్తామంటూ డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీకి ఫిర్యాదు చేయాలని సలహా ఇచ్చారు. ఏసీబీ అధికారుల పేరుతో ప్రభుత్వ ఉద్యోగులు లేదా సామాన్యులకు అలాంటి ఫేక్ కాల్స్ వస్తే టోల్ ఫ్రీ నెంబర్1కు ఫిర్యాదు చేయాలని అన్నారు. ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064ను సంప్రదించాలని చెప్పారు. ఏసీబీ తెలంగాణ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లో కూడా వాట్సాప్, ఫేస్ బుక్, ఎక్స్ ద్వారా కూడా ఫిర్యాదు చేమొచ్చని తెలిపారు.

## ఏపీలో తొలి జీబీఎస్ మరణం

**గుంటూరు (జనంసాక్షి) :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో తొలి జీబీఎస్ మరణం సంభవించింది. ప్రకాశం జిల్లాలోని కొమరఓలు మండలం అలసందలపల్లి గ్రామానికి చెందిన కమలమ్మ గులియన్ బారే సింద్రోమ్ వ్యాదితో చికిత్స పొకడంతో గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ.. కొద్దిసేపటి క్రితం మృతి చెందింది. రెండు రోజుల క్రితం తీవ్ర జ్వరంతో పాటు కాల్లు చచ్చు బడిపోయి గుంటూరు ప్రభుత్వ హాస్పిటల్ లో చేరింది కమలమ్మ.. రెండు రోజుల నుంచి వెంటిలేటర్ పై మృత్యువుతో పోరాడు తూ ఆదివారం తుది శ్వాస విడిచింది. హాస్పిటల్‌లో వైద్యం అందించిన, ఫలితం లేకుండా పోయింది. అయితే, వ్యాధి లక్షణాలు కనిపించడంతో ఈ నెల 3వ తేదీన గుంటూరు జీజీహెచ్‌కు కమలమ్మను తీసుకెళ్లగా టెస్టులు చేసిన వైద్యులు ఆమెకు జీబీఎస్ వైరస్ సోకినట్లు నిర్ధారిం చారు. చికిత్స అనంతరం కొంచెం తగ్గినట్లు కనిపించిన ప్పటికీ.. గత రెండు రోజుల క్రితం వ్యాధి తీవ్రత పెరగడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వెంటిలేటర్ పై చికిత్స అందించినప్పటికీ. చివరకు మరణించింది. ఇక, ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు చెబుతున్నారు.

## అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త



లక్షెట్టిపేట ఫిబ్రవరి 16 (జనంసాక్షి) : లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరిరోడ్డు కొత్త ప్లాట్స్ లో అక్రమ సంబంధం ఉందనే అనుమానంతో భార్య లకావత్ రాజకుమారి అనే 40సంవత్సరాల మహిళను తన భర్త గణేష్ సిమెంటు ఇటుక, బండరాయితో కొట్టి చంపారు. నిందితుడు రోజు మద్యం తాగి భార్యకు ఇతరులతో అక్రమ సంబంధం ఉందని కొడుతూ, తిడుతూ, చంపుతానని బెదిరించేవాడు. అదే క్రమంలో నిన్న రాత్రి భార్యతో గొడవప పడ్డాడు. తన భార్య ఉదయం 3.30గంటలకు బాత్రూమ్ కు వెళ్లగా వెనకాలే వెళ్లి బాత్రూంలో సిమెంట్ ఇటుక బండరాయితో తలపై కొట్టి చంపారు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. తల్లి బుఖ్య రేణుకాబాయి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు లక్షెట్టిపేట ఎస్సై సతీష్ తెలిపారు

# గుంటూరులో 5 కేజీల బంగారం అపహరణ



**గుంటూరు (జనంసాక్షి) :** గుంటూరు జిల్లా మంగళగిరి మండల కేంద్రంలో భారీ చోరీ జరిగింది. దాదాపుగా ఐదు కిలోల బంగారు నగలు అపహరణకు గురయ్యాయి. శనివారం రాత్రి మంగళగిరి మండలం ఆత్మకూరు అండర్ పాస్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. నాలుగు కేజీల 900 బంగారం దోచుకెళ్లారని భాదితుడు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.4 కోట్ల విలువైన బంగారం ఉంటుందని పోలీసులకు తెలిపాడు. విజయవాడ డీవీఆర్ జ్యూవెలరీ షాపు నుంచి మంగళగిరికి యజమాని రాము బంగారం తీసుకు వస్తున్న క్రమంలో మరో బైక్‌పై వచ్చిన దుండగులు అడ్డుకున్నారు. యజమాని రాముని బెదిరించి బంగారం బ్యాగ్‌ను అపహరించారు. యజమాని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అర్ధరాత్రి పోలీసులు రంగంలోకి దిగి ఘటనాస్థలితో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అయితే చోరీ ఆనవాళ్లు కనబడలేదు. కేసు నమోదు చేసుకున్న మంగళగిరి రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.

# ఎస్టీల కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తాం..

- బాసరలోని గోదావరి నది ఒడ్డున శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు
- 286వ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు మంత్రి సీతక్క



**బాసర (జనంసాక్షి) :** బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు అంగరంగవైభవంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా బాసరలోని గోదావరి నది ఒడ్డున శ్రీ సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. 286వ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఎస్టీలకు గుడ్ న్యూస్ అందించారు. ఎస్టీల కోసం మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కొమరం భీం , సేవా లాల్ , ఏకలవ్య పేరిట కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తామని అన్నారు. మైదాన ప్రాంతాల్లో సైతం ఐటీడీఏలు ఏర్పాటు చేసి ఆ ప్రాంత గిరిజనులకు అభివృద్ధికి ఫలాలు అందేలా చేస్తామని వెల్లడించారు. ఎస్టీల కోసం అదనపు ఇండ్లు ఇవ్వాలని సీఎం రేవంత్ ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. పూర్వీకుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని బంజారా ఉద్యోగులకు సెలవులు ఇచ్చామన్నారు. అన్ని వర్గాలు వైశ్యామ్యాలు లేకుండా కలిసికట్టుగా ఉండాలని వెల్లడించారు. 286వ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు పౌర గాడ్ పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్, ఎంపీ గోడం నగేష్ పలువురు ఎమ్మెల్యేలు, మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్ ముఖ్య నాయకులకు సంత్ సేవాలాల్ జయంతి ఉస్సవ సమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

# మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- బిల్లులు రాక అప్పులు తీరక దారుణానికి ఒడిగట్టిన వైనం





**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 16 (జనం సాక్షి) :** ఓ మాజీ సర్పంచ్‌కు పెండింగ్ బిల్లు అందకపోవడతో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలోని కాశంపూర్ లో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాసింపూర్ గ్రామపంచాయతీ దళిత మాజీ సర్పంచ్ వెంకటయ్య ఆదివారం సాయంత్రం నారాయణపూర్ చౌరస్తా వద్ద క్రిమి సంహారక వరకు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పొరుగు ఊరికి వెళ్లి వస్తానని చెప్పి కూతురు దగ్గర డబ్బులు తీసుకుని వెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టాడు . మధ్య సర్పంచ్ వెంకటయ్య క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యయత్నాన్ని గ్రామస్తులు గమనించి వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. మిషన్ ఆసుపత్రిలో మాజీ సర్పంచ్ వెంకటయ్య చికిత్స పొందుతున్నాడు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని మిషన్ ఆసుపత్రి డాక్టర్ అవినాష్ తెలియజేశారు. మాజీ సర్పంచ్ వెంకటయ్యకు మెరుగైన వైద్యం అందించడానికి తాను కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. గత ప్రభుత్వ హాయంలో సర్పంచ్ గా కొనసాగుతూ 28 లక్షల ప్రత్యేక గ్రాండ్ తో గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణం చేశారు. అప్పటినుంచి ఇప్పటివరకు మాజీ సర్పంచ్ వెంకటయ్య కు 28 లక్షల బిల్లు అధికారులు చెల్లించలేదు. దీంతో అప్పులు విపరీతంగా పెరిగిపోయాయి. అప్పులు తీర్చలేక విధి లేక క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వికారాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్ నియోజకవర్గం లని అన్ని గ్రామ పంచాయతీల మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం నిధుల విడుదల చేశారు.

## కులమతాలకతీతంగా నెహ్రూ కుటుంబం రాజకీయ సేవ

- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 (జనంసాక్షి) :** రాహుల్ గాంధీ కులం, మతంపై బండి సంజయ్ చేసిన కామెంట్స్ పై తెలంగాణ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీది బ్రాహ్మణ కుటుంబమని.. వాళ్లది హిందూ మతమని తెలిపారు. నెహ్రూ కుటుంబం కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని తెలిపారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కులం, మతంపై కేంద్రమంత్రి బండి సంజయ్ చేసిన కామెంట్స్ పై తెలంగాణ కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీది బ్రాహ్మణ కుటుంబమని.. వాళ్లది హిందూ మతమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చాక గాంధీ కుటుంబం కులమతాలను వదిలేసిందని, ఏ రోజు కూడా రాజకీయాల కోసం కులమతాలను వాడుకోలేదని చెప్పారు. రాహుల్ గాంధీ కుటుంబంపై ఎవరికీ అవగాహన లేదని.. బండి సంజయ్ తెలిసి మాట్లాడాడో.. తెలియక మాట్లాడాడో అర్థం కావడం లేదన్నారు. ఆదివారం గాంధీభవన్ లో మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడారు.

### కులమతాలకు అతీతంగా నెహ్రూ కుటుంబం

తాను రెడ్డి అని, తన భార్య గౌడ్ అని పెళ్లయ్యాక తన భార్య పేరు నిర్మలా జగ్గారెడ్డిగా మారిందన్నారు జగ్గారెడ్డి. హిందుమతం ప్రకారం.. భర్త కులమే భార్యకు వర్తిస్తుందని జగ్గారెడ్డి చెప్పారు. రాజీవ్ గాంధీ బ్రాహ్మిణ్ కాబట్టి సోనియా గాంధీది కూడా బ్రాహ్మణ కులం అయిందన్నారు. మోతీలాల్ నెహ్రూ, మహాత్మాగాంధీలు జంజం వేసుకున్నారని చెప్పారు. ఇందిరాగాంధీ భర్త పేరు ఫిరోజ్ గాంది అయితే గాండిని కాస్త గాంధీగా మార్చారని చెప్పారు. ఇంకోసారి రాహుల్ గాంధీ కులం, మతం గురించి మాట్లాడితే బండి సంజయ్ మాటకు విలువ ఉండదన్నారు. బండి సంజయ్ తో పాటుగా బీజేపీ నేతలు విమర్శలు చేసేముందు ఒకసారి హిస్టరీ చెక్ చేసుకోవాలని తెలిపారు జగ్గారెడ్డి. నెహ్రూ కుటుంబం కులమతాలకు అతీతంగా పనిచేస్తుందని తెలిపారు.







Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370